# అనువాద కథలు


## పాలెపు బుచ్చిరాజు




శ్రీ కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 161

# విషయ సూచిక


| ఏడాది | నెల | కథ పేరు | మూల రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|---|
| 2012 | 01 | బంగారం | హర్షద్ త్రివేదీ | 2 |
| 2012 | 02 | జన్మదినోత్సవం | కీ శే సురేశ్ జోషి | 7 |
| 2012 | 03 | ఉపేక్షిత | కీ శే సురేశ్ జోషి | 12 |
| 2012 | 04 | వటవృక్షం | భూపేష్ అధ్వర్యు | 15 |
| 2012 | 05 | రాధా – కృష్ణ | జయశ్రీ జె చౌదరి | 19 |
| 2012 | 06 | అసంతృప్తికి అసలు కారణం | హిమాంశీ శేలత్ | 25 |
| 2012 | 07 | రెండు ముద్దులు | కీ శే సురేశ్ జోషి | 29 |
| 2012 | 08 | కే.వై.సి.ఆఫీసు | జయశ్రీ జె చౌదరి | 34 |
| 2012 | 09 | అగతి గమనం | కీ శే సురేశ్ జోషి | 39 |
| 2012 | 10 | నల్ల కాకి | కీ శే ఘనశ్యామ్దేశాయ్ | 43 |
| 2012 | 11 | ఊసరవెల్లి | కీ శే ఘనశ్యామ్ దేశాయ్ | 46 |
| 2012 | 12 | ప్రతీకారం | కీ శే ఘనశ్యామ్ దేశాయ్ | 51 |



# అనువాద కథలు

## - పాలెపు బుచ్చిరాజు

## బంగారం

### గుజరాతీ మూలం: హర్షద్ త్రివేదీ

**బస్సింకా స్టాండులో ఆగకముందునుంచే, ప్రయాణీకులు** నాలుగు ప్రక్కలనుంచీ బస్సుని చుట్టుముట్టారు. కిటికీ ఊచల్ని పట్టుకుని వేళ్ళాడుతూ, దొరికిన దగ్గరల్లా వాళ్ళవాళ్ళ సామాను పెట్టేసుకుని, కూర్చోవడానికి సీట్లు రిజర్వు చేసేసుకుంటున్నారు. కిటికీ ప్రక్కనున్న సీట్లో కూర్చోకుండా ఉంటే బాగుండేది. ఎంతమంది సామాన్లని పుచ్చుకుని సీట్లు రిజర్వు చేసేది? ఖాళీ సీట్లు ఎక్కడెక్కడున్నాయో వెదికి సామాను జాగ్రత్తగా వాటిలో పడేయాలి. 'నేనేమైనా గుత్తకి పుచ్చుకున్నానా ఏమిటి? పోండి పోండి ఎవరి సామానూ తీసుకునేది లేదు. మీకు సీటు దొరకాల్సి ఉంటే దొరుకుతుంది. లేకపోతే లేదు. మీ ఖర్మ. నాకోసం ప్రయాణం చేస్తున్నారా?' అనుకుని కాళ్ళు కూడదీసుకుని, ఏమీ ఎరగనట్టు కూర్చున్నాను. ఉన్నట్టుండి, నేను కూర్చున్న సీటు దగ్గర అద్దం ప్రక్కకి తోసి, ఎవరో చేతిలో మంచి నీళ్ళసీసాతో, లోపలికి తొంగి చూశారు. అతనో కుర్రాడు. నేను చూపులతోనే అతన్ని మందలించి, క్రిందికి దిగమని గదమాయించాను. అతను దిగే కంగారులో, నా పేంటు నీళ్ళతో తడిపేశాడు. జేబులోంచి రుమాలు తీసి ఇలా తుడుచుకున్నానో లేదో, నా కళ్ళెదుట ఓ పర్సు ప్రత్యక్షమైంది. నేను కూర్చునే, కోపంగా బైటికి చూశాను.

"రావాలంటే, గేటులోంచిరా! నేనిక్కడెవ్వరికీ.." నేను మాట పూర్తిచేసేలోగానే, క్రిందినుంచి చెంపపెట్టులాంటి జవాబు వచ్చింది.

"నీకు కూర్చోవడానికి చోటు దొరికితే సరిపోయిందా? ఎక్కడేనా జాగా ఉంటే అక్కడ ఈ పర్సు పెట్టరాదూ?" నాకు నవ్వొచ్చింది. ఇసకేస్తే రాలనంతటి జనం క్రిక్కిరిసి ఉన్న ఈ బస్సులో ఓ చిన్నపూవు పూసిందన్న భావన వచ్చింది. నేను కాదనలేకపోయాను. చేయిచాచి పర్సు అందుకున్నాను. చుట్టుప్రక్కల సీట్లన్నీ అప్పటికే భర్తీ అయిపోయాయి. నా ప్రక్కనే ఉన్న సీటు ఖాళీగానే ఉన్న విషయం గమనించి, అక్కడ పర్సు పెట్టి, దానిమీద చేయి వేసి కూర్చున్నాను. రెండోచేత్తో, కిటికీ అద్దం మూసేశాను.

సాయంత్రం కావస్తోంది. కానీ వేడి తగ్గే సూచనలేమీ లేవు. ఓ యువతి లోపలికి వచ్చి, చేతిలో ఉన్న సంచిని పై షెల్ఫులో కుక్కి, సీటుమీదున్న పర్సు చేతిలోకి తీసుకుని నా ప్రక్కన బైఠాయించింది. జనం రద్దీకి, ఎండవేడికి, చెమటలు పోస్తున్నాయి. నేను కిటికీ అద్దం తెరుద్దామనుకునే లోపలే ఆమె నా ఛాతీ మీదుగా చేయిపెట్టి అద్దం ప్రక్కకి తొలగించి, "నీకు వేడిగా అనిపించడంలేదా?" అని అడిగింది. ఆమె యవ్వన మిశ్రిత సుగంధం నన్ను చుట్టుముట్టేసింది.

"వేడిగా అయితే ఊరందరికీ ఉంది. కానీ మరో ఇద్దరు, ముగ్గురు పర్సులందిస్తే, నా పనేంగాను?" అన్నాను నేను. ఆమె అందంగా నవ్వింది. కొంచెం సర్దుకుని కూచుంది. నేను మరింత కిటికీ ప్రక్కగా జరిగాను. అన్యమనస్కంగా బైటికి చూడసాగాను. చీకటిపడబోతోంది. చెట్లు నెమ్మదిగా పరుగెడుతున్నాయి. అలా ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడంలో ఆనందం ఉంది. కానీ, గత రెండుమూడు గంటలనుంచీ, బస్సు కిటికీ దగ్గర కూచుని ప్రయాణిస్తున్న కారణంగా, నాకా అందాలాట్టే ఆనందాన్నివ్వడంలేదు.

పరుగెత్తేచెట్లు, గొర్రెల్నీ, మేకల్నీ, మేపుకునే గొల్లలు, ట్రాఫిక్ జామ్‌లు, నదులు, కాల్వలు, గుళ్ళుగోపురాలు, ధ్వజస్థంభాలు, వీటిని చూసి, చూసి విసుగెత్తింది.

కానీ ఇప్పుడు బైటికి చూసినప్పుడు మాత్రం, నాకొక కొత్త అనుభవం కలిగింది. అద్దానికి సగానికి పై భాగం రంగుతో పూసి ఉంది. క్రిందభాగం మాత్రం పారదర్శకంగా ఉంది. ముఖం తిన్నగా పెట్టి చూస్తే, ఎదుటి దృశ్యం రెండు భాగాలుగా కనిపిస్తోంది. బైట అంత చీకటిగానూ లేదు. అంత వెలుతురూ లేదు. అలా విచిత్రమైన వెలుగులో, ఎదురుగా సముద్రతీరం ఉన్నట్టుగా ఉంది. ఫుల్‌గా నిండిన బస్సు సడన్‌గా ఎడమవైపుకు టర్న్ తీసుకుంది. ఆ కుదుపుకి నా ప్రక్కనెవరో కూర్చున్నారన్న విషయం తలుపుకి వచ్చి, ప్రక్కగా ఒదిగి కూర్చున్నాను.

ముందుకు జరిగిన సంధ్య, వస్తువులు కనిపించని వెలుతురు, సముద్రతీరం, క్రింద సమతలం మీద నడిచే బస్సు, అర్ధభాగమే పారదర్శకమైన అద్దం, ఇవన్నీ ఒక విచిత్రమైన మాయా చిత్రాన్ని సృష్టించాయి నా మనసులో.

నా ప్రక్క సీటులో కూర్చున్న యువతి ఇప్పుడు నాకు అపరిచిత వ్యక్తి కాదు. ఆమె సుజాత. నేను సుజాతతో కలిసి చేసినంత ప్రయాణం మరెవరితోనూ చేయలేదు. అవును. దానిని ప్రయాణమే అనాలి. జీవించడం కాదు. ఆమె నా జీవిత భాగస్వామియే అయి ఉంటే, ఈ రోజు నా ప్రక్కనే ప్రయాణిస్తూ ఉండేది. ఎక్కువగా సంకోచించడం నాకు శక్యం కాలేదు. ప్రక్కనున్న యువతికి నా శరీరం తగిలితే తగిలేనుగాక. కొంచెం విశాలంగా జరిగి కూర్చున్నాను. ఆమె భయంతో కూడిన సిగ్గుతో కుంచించుకు పోతుందనుకున్నాను. కానీ ఆమె బైటి వాతావరణంలా అటూ ఇటూ కాకుండా ఉంది. బాగా అలిసిపోయి ఉన్నపుడు, ఇలాంటి స్పర్శ శరీరాన్ని పులకాంకితం చేస్తుందని సుజాత అంటూండేది. నేనింకా సుజాతకి దగ్గరగా జరిగిపోయేవాడిని. అప్పుడది చలికాలం కాబట్టి, బంగారానికి సుగంధం అబ్బినట్టు - కాదుకాదు - సుగంధానికి బంగారంలా!

సుజాతని నేనెన్నిసార్లో అడిగాను, "నేను నీకెలా అనిపిస్తాను?" అని.

ఆమెది ఎప్పుడూ ఒకటే జవాబు. "బంగారంలా! నువ్వు నా బంగారానివి". ఆమె ఉద్దేశంలో బంగారమే ఈ ప్రపంచంలోకెల్లా అతి ఉత్తమమైన వస్తువు.

"కానీ 'బంగారం' నపుంసకలింగం కదా!"

"అందుకేగా అంటున్నాను" అంటూ ఆమె ఆనందంతో చప్పట్లు కొడుతూంటే బస్సులో ఉన్న వాళ్ళంతా ఇటు చూసేవారు. ఆమె చుప్! నిశ్శబ్దం!

"నిన్నూ! నిన్నూ" అంటూ కోపం నటించీ, కళ్ళు చిట్లించీ, దీర్ఘంగా ఊపిరి పీల్చి, ఆమె చేతిని నా చేతుల్లోకి తీసుకుని తొడమీద పెట్టుకున్నాను. చల్లగా తగిలింది. నేను కొంచెం కంపించిన మాట వాస్తవం. కాని వెంటనే జ్ఞప్తికి వచ్చింది, ఆ కుర్రాడు వాటర్ బాటిల్లో నీళ్ళు ఒలకబోసిన విషయం.

"నీ విషయం అంతా అంతేలే! నాలుగో అంతస్తులో కుళాయిలాగ గాలి ఎక్కువ, నీళ్ళు తక్కువ." ఆమె కిసుక్కున నవ్వి, తన రెండో చేతితో నాకు తొడపాశం పెట్టింది. నేను బాధతో, "అబ్బా!" అన్నాను. అలాంటి తరుణంలో స్త్రీలని ఎదిరించరాదని పెద్దలంటారు. 'నేనెలా కనిపిస్తున్నా'నని మళ్ళీ ఆమెను అడిగే ధైర్యం చేయలేకపోయాను.

ఇంకా అయిదారు గంటల ప్రయాణం బాకీ ఉంది. నేను లేచినిలబడి, పైన సంచిలోంచి, 'మంజిల్' మేగజైను తీశాను. ప్రత్యేకంగా ఏదో చదవాల్సి ఉండికాదు. కాలక్షేపానికి పేజీలు తిరగేద్దామని. ఇంతలోనే చిన్న ఎర్రటి నైట్ బల్బులాంటిది తప్ప బస్సులోని లైట్లన్నీ ఆరిపోయాయి. నేను ఉస్సురంటూ. మేగజైను ప్రక్కన పడేశాను.

చేతులు ముడుచుక్కూచుని కూచుని అలిసిపోయాను. కాళ్ళు పట్టేశాయి. ఇక ఉండబట్టలేక రెండుచేతులూ విశాలంగా చాపుకుని, సర్దుకుని కూర్చున్నాను. నా ప్రక్కనున్నామె నిద్రలో, ఇంచుమించు నా మీదకి వాలిపోయింది. కొంచెంసేపు తల నా భుజం మీద కూడా ఆనించింది. ఆమె విశాలమైన స్థనభాగం నా చేతులకి తగులుతోంది. క్షణకాలం పాటు నేనామెకు తగిన సుఖాన్నిస్తున్నాననే భావన కలిగింది నాలో. ఆమె ఇంకా సౌకర్యం కోసం నామీద పూర్తిగా ఆధారపడేలోగానే, కొంచెం జరగడం భావ్యం అనిపించింది. కాస్త ప్రక్కకు జరిగాను. కాని ఆమె నా చేతిని గట్టిగా దగ్గరగా పట్టుకుని ఉంది. ఆ ఒడుపు, ఆ నేర్పు అంతా సుజాతదే! నేనామెనెంత దూరంగా ఉంచాలని ప్రయత్నిస్తున్నానో, ఆమె నన్నంత దగ్గరగా లాక్కుంటోంది. నా అంతట నేనే దగ్గరైనప్పుడు మాత్రం, ఆమె నన్నంతగా తీసి పారేసిందంతే..

సుజాత జ్ఞాపకాలు నన్ను ప్రస్తుతానికి ప్రక్కకి జరగనీయడంలేదు. మనసుని మళ్ళించు కోవడానికి నేను బైటికి చూడసాగాను. కాని అక్కడంతా చీకటి. చిరువెలుతురులో బస్సులో `పొగత్రాగరాదు` అన్న అక్షరాలు కనిపించాయి. అవి నాలో సిగరెట్టు తాగాలన్న కోర్కెని రేకెత్తించాయి. జేబులు వెదికాను. ఒక్కటికూడా కనిపించలేదు. ఇప్పటివరకూ వేసి ఉన్న కిటికీ అద్దం ప్రక్కకి లాగాను. సిగరెట్టు తాగి పొగ వదులుతున్నట్టుగా ఫీలవుతూ, నోట్లోంచీ, ముక్కుపుటాల్లోంచీ, గాలివదిలాను. కానీ, ఆ రుచీ, వాసనా ఏవీ? ప్రక్కనున్న యువతి. నా గుండెలమీంచి కిటికీ అద్దం తెరుస్తున్నప్పటి ఆమె శరీరం వాసన జ్ఞాపకం వచ్చింది. సిగరెట్టు తాగాలన్న కోరిక చచ్చిపోయింది.

ఇంతలో, ఎదురుగా దగ్గరయ్యే ఊరి లైట్లు కనిపించసాగాయి. కొద్దిసేపట్లో బస్సు అక్కడికి చేరుకుంటుంది. ఈ ఊరి బస్సు స్టాండులో ఆమె దిగిపోతే? దిగిపోతే ఏమవుతుంది? ఏమీ కాదు. ఈ ప్రపంచంలో ఎవరెవరి పరిచయాలు ఎంతకాలం సాగుతాయో? ఆమె దిగిపోతుందన్న ఆలోచన రాగానే, ఊరి పొలిమేరల్లోనే, నాలో మేం విడిపోతున్నామన్న ఒక విధమైన ఆవేదన. ఆమె ఎక్కడిదాకా టిక్కట్టు తీసుకుందో జ్ఞాపకం చేసుకోవడానికి కొంతసేపు బుర్ర బద్దలు కొట్టుకున్నాను. ఆమె చెప్పిన ఊరిపేరైతే విన్నట్టులేదు, కాని నా కళ్ళెదురుగా, ఆమె తన కండక్టరు కిచ్చే దృశ్యం మాత్రం సాకారమైంది. అయినా ఈ ఊళ్ళో ఈమె దిగదు. దిగేదైతే, ఈ పాటికే లేచి, సామాను సర్దుకోదూ? అదుగో! ఆ ముసలాయన మూటాముల్లె సర్దుకుని ఎంతసేపటినుంచి ఎదురుచూస్తున్నాడో.

నా చేతులు వాటిపని అవి చేసుకుపోతున్నాయి. సడెన్ బ్రేకుతో, ఒక్క కుదుపు కుదిపింది బస్సు. నేను పక్కన పెట్టిన మేగజైను క్రిందపడింది. యువతి నిద్రలేచింది. నేను క్రిందికి వంగి, మేగజైను తీసి మళ్ళీ పక్కన పెట్టాను. ఒక్కసారి మా ఇద్దరి చూపులూ కలిశాయి. ఇప్పుడిప్పుడే గ్రహణ ముక్తమైన చందమామను తలపించే ముఖంలో నేనే భావాలూ చదవలేకపోయాను. మాట్లాడాలనే కోరిక అయితే కలిగింది కాని ధైర్యం చాలలేదు. నోరు ఎప్పటినుంచో మూయబడే ఉంది. లోపలంతా పొగమంచు నిండినట్టుంది. నేను నోట్లో నాలిక నాలుగుప్రక్కలా తిప్పి, ఒక్కసారి ఆవులించాను. గొంతులోంచి సీమటపాకాయ పేలినట్టు శబ్దం వచ్చింది.

బస్సు నెమ్మదిగా ఒక ఎత్తైన ప్రదేశంలోంచి వెళుతోంది. నాకైతే పెద్దకొండ ఎక్కుతున్నట్టనిపించింది. నేను కొండశిఖరం మీదున్నాను. బాటకిరుప్రక్కలా చిన్నా చితకా కొండలున్నాయి. అంతలోనే నేను, ఆ శిఖరం మీంచి దిగి, రెండు కొండల మధ్య లోయలోంచి పరుగెడుతున్న అనుభవం. ఆ లోయ ఒక పచ్చికమైదానంలోకి దారితీస్తోంది. బహుశా ఆ మైదానంలో ఒక నది ఒడ్డున మేళా జరుగుతోంది. సుజాతకి మేళాలంటే చాలా ఇష్టం. కానీ ఆమె ఎప్పుడూ రంగులరాట్నం మాత్రం ఎక్కదు. నేనోసారి అడిగాను "నువ్వెందుకు ర్మగుల రాట్నం మీద కూర్చోవు?" అని.

"నాకు భయం బాబూ!"

"కాని నువ్వు పులి అంటే భయంలేదు, సింహం అంటే భయంలేదు. కుక్కంటే, నక్కంటే"

"అవును. కానీ నాకు చలిఅన్నా, చలికాలం అన్నా భయం."

"రంగుల రాట్నం చలికాదుగా! సుజీ!" ఆమె భయం పోగొట్టాలని అన్నాను.

"అదే! చలి అంటే అదే ఏమో బాబూ నేనా రంగుల రాట్నం ఎక్కనంటే ఎక్కను. అది పైనుంచి క్రిందికి దిగేటప్పుడు ఎలా ఉంటుందో నీకేం తెలుసు? పొట్టలో ఏదోలా అయిపోతుంది." అని చేతి ఐదువ్రేళ్ళూ చిత్రంగా తిప్పుతూ అంది.

నేనామె పొట్టమీద చేత్తో నిమురుతూ, "నా చిన్ని సుజీ పొట్టలో ఏదోలా అయిపోవాలనే కదా అది ఎక్కేది" అన్నాను.

"అయినా సరే ఫో ఫో నేను మాత్రం ఎక్కను. నాకైతే, చక్కగా, నీటిలో పడవలో ఎక్కి విహారం చేయడమంటే సరదా. మనసులోని భావపరంపరలా, నీటిలో నావతేలిపోతూంటే ఎంత హాయిగా ఉంటుందో!" సుజీ కళ్ళు మూసుకుని చెప్పుతూంటే, ముఖం మీద ఆడుకునే ఆమె ఉంగరాల ముంగురుల్ని నేను నోటితో ఊది సరిచేశాను.

"సరే చెప్పు మన వీరావల్ ప్రయాణం ఎప్పుడు?"

అర్ధాంతరంగా అడిగిన ప్రశ్న అర్ధంకాలేదామెకు. "వీరావలా? ఎందుకు?" అడిగింది.

"ఇంతలోనే ఇంత మతిమరుపు? అక్కడి పడవలు నీకోసం ఎదురుచూస్తుంటాయి"

అలా ఆలోచనల్లో మునిగితేలుతూండగానే నా దృష్టి కిటికీలోంచి బైటికి మళ్ళింది. ఇప్పుడలా బైటికి చూడడం ఆనందంగాఉంది. నాలుగుప్రక్కలా సముద్రం గర్జిస్తోంది. బస్సు బస్సుకాదు, ఒక పడవగా మారింది. ఆ పడవలో మేమిద్దరం ఆసీనులం. మేం అంటే ఎవరు? ఆ యువతి కళ్ళూ, ఉరుప్రదేశం నన్ను సుజాత జ్ఞాపకాలనుంచి వేరుచేయలేకపోతున్నాయి. కానీ, ఈమె పేరేంటి? సుజాతే కాదుకదా! ఆమెతో మాట్లాడాలనే కోరిక మనసులో ఇనుమడించింది. నేనూ సుజాతా ఇలా ఎన్నోసార్లు కబుర్లు చెప్పుకునే వాళ్ళం.

ఎందుకో ఉన్నట్టుండి నా దృష్టి ఆమె పర్సు మీదపడింది. వెంటనే ఆమెను ప్రశ్నించాను.

"మీ దగ్గర ఒకచేతి సంచి కూడా ఉందికదా! జాగా పెట్టడానికి ఎవరేనా సంచి ఇస్తారా? పర్సు ఇస్తారా?" భగవంతుడు నాకు కాళ్ళూ చేతులతోబాటు, మాట్లాడడానికి ఒకనోరు కూడా ఇచ్చాడన్న వాస్తవం అప్పుడు నాకు అనుభవంలోకి వచ్చింది.

ఆమె వెనువెంటనే జవాబు చెప్పలేదు. కానీ నెమ్మదిగా గొంతు సవరించుకుని అంది. "పర్సుకంటే ఈ చేతిసంచియే నాకు ఎక్కువ విలువైంది. ఏది తక్కువ విలువైనదో అదివ్వడం సబబుకదా!"

"నా దృష్టిలో మీ ముగ్గురు కూడా విలువైనవారే" అనుకోకుండా అనేశాను. కానీ అంత చొరవ తీసుకోవడం మంచిది కాదేమోనని తరవాత విచారించాను.

"మీ పురుషులు స్త్రీని ఎప్పుడూ విలువైనదానిగానే గుర్తిస్తారు. కానీ ఆ విలువలోని నాజూకుతనాన్ని అర్ధం చేసుకోగలరా? ఎప్పుడైనా?"

"అదేం? అలా అన్నారు?"

"నేను నా అనుభవాన్ని పురస్కరించుకుని అంటున్నాను. మీ పురుషులు తమకిష్టమైతే బాగానే ఉంటారు. స్త్రీ కించిత్తు తన ప్రత్యేకతని చూపుతే మాత్రం ఆత్మన్యూనతాభావంతో తల్లడిల్లిపోతారు. నిజం చెప్పుతున్నాను. విలువల్ని అర్ధం చేసుకోవడంలో స్త్రీల ముందు పురుషులెప్పుడూ దిగదుడుపే" ఇలా అంటూనే ఆమె లేచి నిలబడింది. పైనున్న తన చేతిసంచి తీసి అధికారపూర్వకంగా నాకందించింది.

ఎదుటవెలుగుతున్న దీపాల వెలుగు చూసి ఇంక ఆమెకు ఆగాలనిపించలేదు కాబోలు. నిశ్చలంగా నిర్భయంగా నాతో అంది. "నేనీ ఊళ్ళోనే ఉంటాను. మా అమ్మతో" అంటూ, నా మేగజైను ఆఖరి పుటలో తనపేరు, చిరునామా రాసి ఇచ్చింది. "మీరు తప్పకుండా రండి. మరిచి పోకండి.మీకోసం ఎదురు చూస్తుంటాను." అని నా కళ్ళలోకి సూటిగా చూస్తూ మరీ చెప్పింది.

"వస్తాను. తప్పక వస్తాను. కానీ, అక్కడ మీ తల్లిగారు"

"ఏమీ ఫరవాలేదు. వంగి, వడలిన శరీరం ఆమె మానసిక పరిస్థితిని చెప్పకనే చెప్పుతుంది."

"ఇప్పుడు మీరెక్కడినుంచి వస్తున్నారు? ఎక్కడైనా ఉద్యోగం?" నా ప్రశ్న వినడంతోనే ఆమెలోని అభిమానం, నిర్లక్ష్యతా పైకి ఉబికాయి.

"నా భర్త దగ్గరనుంచి వస్తున్నాను. ఈ రోజే విడాకులు తీసుకున్నాను."

ఆమె మాటలు నాకంత వాస్తవంగా అనిపించలేదు. వాటిని తేలిగ్గా తీసుకుని,

"కానీ, నువ్వు వివాహితలా కనిపించడంలేదే?" అన్నాను కావాలనే ఏకవచనంలో సంబోధిస్తూ.

"అయితే ఎలా కనిపిస్తున్నానూ?" ఆమె కళ్ళు నాట్యమాడాయి.

"అనాఘ్రాత పుష్పంలా"

అదేమిటో అర్థం అయినా కాకపోయినా, ఆమె సంతోషించిందనిపించలేదు నాకు. ఓరగా నా వైపు తరువాత తన శరీరం వైపు పరికించి చూసి అంది "నిజం చెప్పుతున్నాను. నేనీవాళే విడాకులు తీసుకున్నాను"

నాకు సుజాతతో జరిగిన విడాకుల విషయం గుర్తుకొచ్చింది.

"అలా ఎందుకు చేయవలసి వచ్చింది?" అడిగాను.

"నా భర్త పనికిరానివాడు. నామమాత్రానికే అతను పురుషుడు. మిగతా విషయాల్లో నిరుపయోగి. నేనతనితో జీవితాంతం ఎలా?"

నేను నిశ్చేష్టుడనయ్యాను. ఆమె నాకు దగ్గరగా జరిగి, నా చేయి పట్టుకుని మరోసారి తన ఇంటికి రమ్మని అర్థించింది. ఒక్క కౌగలించుకోవడమే తక్కువ.

ఒక్కసారిగా ఆవేశంతో నేనిలా అన్నాను. "నాలాంటి ఒక సామాన్యుడిని కలుసుకోవాలని కోరుకోవడంలో నీ ఆంతర్యం ఏమిటి?"

"ఫో!ఫో నువ్వేమీ పైకి కనిపించేటంత సామాన్యుడివి కాదు" అని, నా ఒడ్డూ, పొడుగూ చూపులతోనే కొలుస్తోందా అన్నట్టు చూస్తూ నిలబడింది.


"మరెలా కనిపిస్తున్నాను?" భుజాలెగరేస్తు అడిగాను.

"చెప్పనా? బంగారంలా!"

ఒక్క కుదుపుతో బస్సాగింది. నా ఊపిరి ఆగిపోయినట్టయింది. ఆమె నాకిచ్చిన చేతి సంచి తీసుకుని, చేతిలో పర్సుతో, వెనక్కి తిరిగి, తిరిగి చూస్తూ, బస్సు దిగి వెళ్ళిపోయింది. ఆమె పృష్ఠభాగాన్ని, కనిపించినంత దూరం చూస్తూ ఉండిపోయాను నేను.

అప్రయత్నంగా నా నోటినుంచి మాటలు వెలువడ్డాయి, "కానీ బంగారం నపుంసక.."

●●●



# అనువాద కథలు

## - పాలెపు బుచ్చిరాజు

### *జన్మదినోత్సవం* — *గుజరాతీ మూలం: కీ.శే. సురేశ్ జోషి*

**గడియారంలో పదుకొండున్నర అయింది.** ఇంక అరగంట మాత్రమే టైము ఉంది. ఎర్రని ముఖమల్ తెర వెనకన కృష్ణాష్టమికి కావలసిన హంగులన్నీ పూర్తయ్యాయి. బృందావన దాసుగారి పెద్దబ్బాయి అసీత్ అమెరికాలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగులో ప్రత్యేక శిక్షణ పొంది ఈ మధ్యనే ఇండియాకి తిరిగి వచ్చాడు. అతను అందర్నీ ఆశ్చర్యంలో ముంచి తేల్చే కార్యక్రమం తలపెట్టాడు. కారాగృహంలో చిన్ని కృష్ణుడు జన్మించడం, ఒక ప్రక్క ధారాపాతంగా వర్షం, వసుదేవుడు కృష్ణుణ్ణి ఎత్తుకుని యమునా నదిని దాటి గోకులంలో ప్రవేశించడం వీటన్నిటినీ, విద్యుత్ప్రసారం ద్వారా కళ్ళకి కట్టినట్టు, ప్రదర్శించే ఏర్పాటు చేశాడు. ఆ వింతేమిటో చూద్దామని అందరూ ఆతురతతో ఎదురు చూస్తున్నారు.

రైల్వే స్టేషనులో పెద్ద గడియారం ఇప్పుడిప్పుడే పదకొండున్నర కొట్టింది. జనతా ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ప్రయాణీకుల్ని మోసుకుని, సిటీ బస్సు ఊళ్ళోకి వెళ్ళిపోయింది. బస్సు స్టాండు నిర్మానుష్యం అయింది. ఆ ప్రక్కనే ఖాళీ జాగాలో, తుప్పు పట్టిన కిరసనాయిలు డబ్బా రేకులు ఆచ్ఛాదనగా వేసుకుని రెండు మూడు కుటుంబాలు బ్రతుకుతున్నాయి. వాటిలో ఒక గుడిసెలో సన్నని బుడ్డిదీపం మినుకు మినుకు మంటూ వెలుగుతోంది. లోపల్నుంచి ఒక స్త్రీ రోదన ఆ నిశ్శబ్దతని చీల్చుకుంటూ వినవస్తోంది. కాని అక్కడి వాళ్ళెవరూ ఆమె మీద ద్యాస చూపించినట్టులేదు.

అంతలో, ఎవరో సగం సగం నిద్రలో ఏదో మాట్లాడుతున్నట్టనిపించింది.

"ఒరేయ్! కాంజీ! మాణిక్ బెన్ ఏడుపు ఇనిపిస్తాంది. ఎల్లి సూసి రారాదూ!"

జవాబు కూడా సగం నిద్దట్లో ఉన్న మనిషి దగ్గర్నుంచే వచ్చింది.

"సూసేదేముందీ? నెల్లు నిండిపోనాయి. పురిటి నిప్పులేమో! ఇందులో మనం సేసేదేమున్నాది?"

మరో చీకటి మూలనుంచి, ఓ ముసలమ్మ బొంగురు గొంతుతో అంది.

"ఈ మాణిక్ బెన్ అసలే జబరుగా ఉంటాది. కడుపులో పిల్ల కూడా బలంగా ఉండొచ్చు. పురుడు ఏమైనా కట్టమే! ఏ సూదిమందో ఏత్తెగాని పిండం బైటపడదు. అయినా జరగవలసిన దాన్ని మనం ఆపుజేయగలమా? దానద్రుట్టం ఎలాగుంటే అలా జరుగుతాది."

గడియారం, ముళ్ళు ముందుకు సాగుతూనే ఉన్నాయి. మాణిక్ బెన్ బాధ భరించలేక పైన రేకులెగిరిపోయేలా అరుస్తోంది. ఉండుండీ ఆకాశంలో ఉరుములు, మెరుపులు. ఏ క్షణంలోనైనా ఆకాశం విరిగిపడేటట్టు వర్షం భీభత్సం సృష్టించేలా ఉంది.

గడియారపు ముళ్ళు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నాయి. విశాఖ, ధనుంజయ్ మిగిలిన గుంపు నుంచి తప్పించుకుని, మేడమీది గదిలో ఏకాంతంగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఉన్నట్టుండి వారికి ఇంక క్రిందికి వెళ్ళడం మంచిదనిపించింది. బృందావనదాస్, మిగతా భజన మండలి భాగవత ప్రవచనం వినడంలో లీనమై ఉన్నారు. ఇంక సమయం ఆసన్నమైంది. ఠాకూర్‌జీ (కృష్ణ భగవానుడు) జన్మించబోతున్నాడు. మధుసూధన్, అతని మిత్రబృందం బ్రిడ్జి ఆట రెండు రబ్బర్లు పూర్తిచేసి, ఆటకట్టి పెట్టి, ఆసిత్ చేసిన అపూర్వ ఆవిష్కరణ చూసేందుకు ఉద్యుక్తులయ్యారు.

అసీత్ నిశ్చింతగా ఓ మూలన నిలబడి, రీటాతో మాట్లాడుతూ, నవ్వులు చిందిస్తూ, వంకలు తిరిగిపోతున్నాడు. ఇంతలో ఖద్దరు లాల్చీ, ధోవతీ ధరించి, అధ్యక్షులవారు ఏతెంచారు. తెర వెనక్కి వెళ్ళి ఏర్పాట్లన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో పరిక్షించారు. శ్రీకృష్ణ జన్మ ముహూర్తం చేరువౌతోంది. గోడగడియారంలో పెద్దముల్లు, చిన్నముల్లూ ఒకదానికొకటి దగ్గరౌతున్నాయి.

●●●

రైల్వే స్టేషనులో గడియారంలో కూడా రెండు మూళ్ళూ దగ్గర పడసాగాయి. ఆకాశంలో నీటి బరువు మోయలేని మేఘం ఒక్కసారిగా నేలమీది కురికింది. గాలీ, వానా ఏకమై ధారాపాతం అయింది. బస్సు స్టాండు దగ్గర గుడిసెలు ఏ నిముషంలోనైనా ఎగిరిపోయేటట్టున్నాయి. రివ్వున వీచే గాలిరొదలో, ఇప్పుడిప్పుడే చెవులు చిల్లులు పడేలా అరుస్తూ, స్టేషనులోకొచ్చి ఆగిన గుజరాత్ మెయిల్ అరుపులో, మాణిక్‌బెన్ ఆవేదనతో అరిచే అరుపులు ఎవరికీ వినిపించలేదు. రైలు దిగి వచ్చిన పాసెంజర్లతో బస్ స్టాండులో మళ్ళీ కొంత కలకలం వినిపించింది. కానీ, అది కొంచెం సేపు మాత్రమే. మళ్ళీ అంతా సద్దుమణిగింది. నెమ్మదిగా నిశ్శబ్దం ఆవరించింది. వర్షం ఏకధారగా పడుతూనే ఉంది. ఉన్నట్టుండి, వీచిన గాలి ధాటికి, ఆ మినుకు, మినుకుమంటున్న దీపం కాస్తా ఆరిపోయింది, ఆభయంకర నీరవ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నవజాత శిశువు కేరుమనడం వినిపించింది.

●●●

గడియారంలో రెండుముళ్ళూ పన్నెండు మీద నిలబడగానే, ముఖమల్ తెగలు ఫర్.. ఫర్ మంటూ ప్రక్కకి తప్పుకున్నాయి. ఆకాశంలోంచి ఒక తేజఃపుంజం వస్తున్నట్టుగా మెరుపు మెరిసింది. ఆ తేజస్సు తిన్నగా వచ్చి, దేవకీదేవి ఒళ్ళో వాలింది. ఆ వెలుతురు కారాగృహంలోని చీకటిని మటుమాయం చేసింది. ఉండుండీ బైట ఆకాశంలోని మెరుపులు కూడా లోపలివరకూ ప్రసరిస్తున్నాయి. ఇంతలో శంఖారావం, జేగంటల సవ్వడితో హాలంతా నిండిపోయింది. బైట కూర్చున్న రామదీన్, షహనాయివాలా ప్రభాత సమయానికి శుభసూచకంగా భూపాల రాగం అందుకున్నాడు. అక్కడున్న ప్రేక్షకులంతా లేచి నిల్చున్నారు. శ్రీకృష్ణ జన్మదినోత్సవ కార్యక్రమంలో మొదటి అధ్యాయం ముగిసింది.

●●●

గుడిసెల ప్రపంచం నెమ్మదిగా లేచింది. జన్మ అప్పటికే అయిపోయింది. ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారు.

"దేవ్ జీ! ఇందులో కాంజీ పనయితే ఏమీలేదు. మనిద్దరం తీసికెళదామా?"

"కానీ. వేల్‌జీ ఈ వేళప్పుడెక్కడున్నాడో? తెలవదుగదా. అంత చెప్తుతున వాడివి నువ్వే తీసుకెళ్ళరాదూ?"

మరొకరు నెమ్మదిగా అన్నారు, "ష్! కొంచెం నెమ్మదిగా మాట్లాడండి. మాణిక్ వింటే పాపం బాధపడుతుంది."

"అవునవును. బాధపడదూ మరి? లేకపోతే ఇంత రాత్రప్పుడు, వర్షంలో తడుస్తూ మనతో గుడిసెల్లో బతికేదా అది? బంగారపు తూగుటుయ్యాలలో ఊగుతూండేది కాదూ!"

మళ్ళీ ఒకరు నెమ్మదిగా అన్నారు. "ఇదుగో, అలా ఆలోచిస్తూ కూచుంటే ఎలా? ఏదో ఒకటి చేయాలి. నేను వస్తాను. నాతోపాటు ఇంకొకరు రండి. ప్రతాప్ గంజ్ వెళ్ళేదారిలో కాలవలేదూ? దాని ఒడ్డునున్న గుడిసెల్లోకి వెళ్ళాలి."

దానికి సమాధానంగా ఎవరో అన్నారు. "నేనైతే రాను బాబూ! ఇది మన పనికాదు. వాన ఎలా పడుతోందో చూశావా! దారంతా మోకాలిలోతు నీళ్ళతో నిండి ఉండకపోతే నన్ను పేరెట్టి పిలవొద్దు."

ఇంకొకడు ఇంకా కోపంగా అన్నాడు. "నువ్వు చెప్పేది ఇంకా బాగుంది. అలాని ఒకరికొకరం సాయం చేసుకోకపోతే ఎలా? నడు! కాంజీ! నేనొస్తాను నీతో. తీసుకో పిల్లాడిని."

పసి పిల్ల ఏడుపు బైటికి వినిపిస్తోంది. బాడిలో నడుచుకుంటూ వెళ్ళే నాలుగు పాదాల చప్పుడు ఆ ఏడుపులో విలీనం అయిపోయింది. వర్షం ఆగకుండా పడుతూనే ఉంది. గాలి వీస్తూనే ఉంది. స్టేషనులో గడియారం మీది ముళ్ళు ఒకదాని నుంచి మరొకటి విడివడి, ముందుకు సాగుతున్నాయి.

●●●

ఇప్పుడెవరి దృష్టీ గోడగడియారం వైపు లేదు. అసీత్ ఆవిష్కరించిన మాయా ప్రపంచాన్ని అందరూ తన్మయులై చూస్తున్నారు. ఎదురుగా అధ్యక్షులవారు తీసుకొచ్చిన ప్రసాదాలున్నాయి. రంగు రంగుల వంటకాలు అతి చాతుర్యంతో అలంకరించారు. ఇక వసుదేవుడు, కృష్ణుణ్ణి తీసుకుని గోకులం వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు. ఎంతగా నచ్చచెప్పినా దేవకి వినిపించుకోవడంలేదు. చేతులూపుకుంటూ వద్దని వారిస్తోంది. నేపథ్యంలో సన్నాయి కరుణ రసాన్ని ఆలపిస్తోంది. అసీత్ అతినేర్పరితనంతో ఆవిష్కరించిన తుఫాను దృశ్యం అద్భుతంగా ఉంది. ఆఖరికి వసుదేవుడు, బాలుణ్ణి చేతుల్లోకి తీసుకున్నాడు. వెదురు బుట్టలో వటపత్రాలమీద సున్నితంగా పడుకోబెట్టాడు. బొటనవ్రేలు నోట్లో పెట్టుకున్న వటపత్రశాయి ముఖం మీద చిరునవ్వు వెలిగిపోతోంది.

●●●

కాంజీ, దేవ్‌జీ మోకాలు లోతు నీళ్ళలో జాగ్రత్తగా అడుగులేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఏడుస్తున్న పసిపాపడి నెత్తుకుని ముందుకు పోతున్నారు. మాణిక్‌బెన్ ఏడుపు హృదయ విదారకంగా ఉంది. అది వారిని వెంబడిస్తున్నా లెక్కచేయకుండా వారు వెళ్ళిపోయారు. మోకాలి బంటి లోతు నీళ్ళూ వారి వేగానికి అవరోధంగా ఉన్నాయి. వెనుక నుంచి మాణిక్‌బెన్ అరుపులు వారిని తరుముతున్నాయి. స్టేషనులో గడియారం ముళ్ళు ఒకదాని నుంచి మరొకటి విడిపోయి, ముందుకు సాగుతున్నాయి.

●●●

వసుదేవుడు ధారాపాతంగా కురుస్తున్న వర్షంలో తడుస్తూ, యమునానది ఒడ్డుకు చేరుకున్నాడు. నది కూలంకషంగా ప్రవహిస్తోంది. ఇక్కడ అసీత్ తన సృజనాశక్తినంతా ఉపయోగించాడు. హఠాత్తుగా లైట్లన్నీ ఆరిపోయాయి. తేజోపుంజంలా వెలిగిపోతున్న బాలకృష్ణుడు, అప్పుడప్పుడూ ఆకాశంలో మెరుపులూ తప్ప ఏమీ కనిపించడం లేదు. క్షణకాలం పాటు అది మాయాజాలం అన్నమాట అందరూ మరిచిపోయారు. జయావతీ శేఠానీ అయితే చేతులు రెండూ జోడించి తన్మయత్వంతో నిలబడి ఉంది. వసుదేవుడు ఇలా నదిలో ప్రవేశించాడో లేదో, ఒక్కసారిగా నది ఉప్పొంగి పొర్లిపారింది. అందరూ ఆశ్చర్యకరంగా చూస్తున్నారు. కృష్ణభగవానుడి శిరసు మీద ఆదిశేషుడు తన పడగని ఆచ్ఛాదనగా ఉంచాడు. భక్తులందరూ చేతులు జోడించారు. మిగిలినవాళ్ళు అతికుతూహలంతో విస్ఫారిత నేత్రాలతో, అదృశ్యం చూస్తూ ఉండిపోయారు. వసుదేవుడు ముందుకు నడుస్తున్నాడు.

●●●

"వేల్ జీ భాయ్ ఉన్నాడా!"

"ఎవరది?" లోపల్నుంచి, ఖంగు ఖంగుమని దగ్గుతూ ఆయాసంతో బాధపడుతున్న మనిషొక్డు అడిగాడు.

"నేను.. నేను కాంజీని. తొందరగా బైటికిరా! ఓ చిన్నపిల్లాడిని తెచ్చాము. కాస్త వీడికాళ్ళు"

అది విన్నాక, ఎండిన శరీరంతో, చిక్కిశల్యమై గ్రద్దలా ఉన్న ముసలి వాడొకడు బైటికి నడిసి "అడుక్కోవాడికి పనికొచ్చేలానా? "

"మీరెలాగంటే అలాగ!"

కాంజీ అన్నాడు. "ఆఁ! ఆఁ! అదే పూరా సొట్టోణ్ణి సేసెయ్యొద్దు తాతా! కిట్నాట్టమి నాడు రేత్రికాడ పుట్టేడు" ఉబికి వచ్చే వచ్చే దుఃఖంతో అతని మాటలు తడబడుతున్నాయి.

దేవ్‌జీ అన్నాడు "సాలు, సాలు. వల్లకో! కొడుకుట్టేడన్న సంబర వేఁగాని, ఆడికి కూడెట్టనాడికి బందోబస్తు సెయ్యాలా ఒద్దా? ఈణ్ణి సదివించి కలకటేరుగానీ సేద్దామనా?"

"అవును! పిల్లోడు బాలకిట్నుడే అనుకో! అయినా పుట్టింది మణిక్ కడుపునే గందా?" అంటూ ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్న, కర్కశమైన చేతుల్తో ఆ శిశువు మోకాలి దగ్గర మెలిపెట్టి, క్షణంలో కాలు విరిచేశాడు ఆ వేల్‌జీ. పిల్లాడి ఏడుపు గోడల్ని ఛేదించుకుంటూ గాలిలో కెగిరిపోయింది.

దేవ్‌జీ అన్నాడు. "సరే! పోయొస్తాం. తెల్లారి డబ్బు సంగతి సూసుకుందాం. నడు! కాంజీ! నడు. ఇగ నీ కొడుకు ఆకలి సావు సావడు."

వాళ్ళు తిరిగి నీళ్ళలో నడుస్తున్న శబ్దం వినిపించింది. ఆ కాళ్ళు నీటిలో భారంగా పడిలేస్తుంటే, అవి ఆ పిల్లాడి ఏడుపుని మోస్తున్నాయా అనిపిస్తోంది. దారంతా బాడీ బురదగా ఉంది. అయినప్పటికీ వారలా నడుస్తూ పోతూనే ఉన్నారు.

●●●

శ్రీ కృష్ణపరమాత్మ గోకులంలో ప్రవేశించాడు. గోకులం అంతా ఉత్సవ సంబరాల్లో మునిగి తేలుతోంది. యశోదామాత నందకుమారుడిని శోభాయమానంగా అలంకరించింది. దిష్టి తగలకుండా బుగ్గ చుక్క పెట్టింది. పంచాజిరీ (ధనియాలు, జీలకర్ర, గసగసాలు, కొబ్బరి, పంచదారలు పొడిచేసి కలిపిన ప్రసాదం) ప్రసాదం వచ్చింది. సన్నాయి సున్నితమైన రాగాన్నాలాపిస్తోంది. అసీత్ తన

పని పూర్తికాగానే బైటికి వచ్చాడు. అందరూ అతని చుట్టూ చేరి అతని ప్రతిభని కొనియాడసాగారు. బ్రిడ్జి ఆటగాళ్ళు మళ్ళీ ఆటలో నిమగ్నమయ్యారు. విశాఖ, ధనంజయ్ సగంలో ఆపేసిన వారి ప్రేమ గోష్ఠిని కొనసాగించడానికి, అక్కడున్నవాళ్ళ కళ్ళుగప్పి, మేడమీది గదిలోకి దారితీశారు. బృందావన్ దాసుగారి భాగవత పారాయణం ముందుకు సాగింది. జయావతీ శేఠాని మేల్కొలుపు పాట అందుకుంది.

"జాగో.. నంద్ కేలాల్.. జాగో"

●●●

కాంజీ, దేవ్ జీ తమ గుడిసెలకి తిరిగి వచ్చేసరికి, మాణిక్ తన కొడుకు కోసం వేయికళ్ళతో ఎదురు చూస్తోంది.

"ఒక్కపాలి నా పిల్లడిని నా కల్లతో చూసుకోనివ్వండి. నా సిన్ని కిట్టప్పని, నా కిసన్ కన్నయ్యని."

దేవ్ జీ దగ్గర పావచ్చీ అన్నాడు.

"ఎర్రిమొకమా! నీ కిసన్‌ని రాచ్చసులెత్తుకుని పోలేదులే. ఇదుగో! పిల్లోడు. నువ్వే ఎత్తుకుని ముద్దులాడుకో!"

కాంజీ కళ్ళెదుట భవిష్యత్తులోని ఒక దృశ్యం సాక్షాత్కరించింది.

మండుటెండలో, మాణిక్ ఒక రేకుల బండిలో, అంగవైకల్యం ఉన్న పసిబాలుడిని పెట్టుకుని, రోడ్డు మధ్య నుంచి లాక్కుంటూ పోతోంది. తాను స్వయంగా అంధురాలు. కొడుకు సొట్టవాడు. ప్రపంచం అంతా చూస్తోంది. భగవంతుడు కృపాసంద్రుడు. నోట్లో అన్నం ఉంది. భూమి మీదే వైకుంఠం ఉంది. శ్రీకృష్ణ భగవానుడు గోకులం వదిలిపెట్టి, మధురా నగరం రాజధానిగా రాజ్యం చేశాడు. అందరూ సుఖంగా ఉన్నారు.

తల్లి ఒళ్ళో హాయిగా పడుకుని, ఆమె అశ్రు ధారల్లో స్నానం చేస్తున్న 'కిషన్'కి తండ్రి తన సమక్షంలో చూస్తున్న దృశ్యం గోచరమైందో ఏమో! ఒక్కసారిగా నవ్వసాగాడు. కానీ వర్షపు రాత్రి సృజించిన భీభత్సంలో అంధకారంలో, మాణిక్ ఆ భువమోహనమైన చిరునవ్వుని చూడలేకపోయింది.

●●●




## *ఉపేక్షిత* *గుజరాతీ మూలం: కీ.శే. సురేశ్ జోషి*

**ఆదివారం నాడు చేసిన ఓవర్ టైముకి** ప్రతిఫలంగా అందిన అయిదు రూపాయల నోటు అతని కోటు జేబులో వ్రేళ్ళ మధ్య నాట్యం చేస్తోంది. ఆ నోటు అతని మనసులోని తరంగాలలాగే సుళ్ళు తిరుగుతూ, రకరకాల రూపులు దిద్దుకుంటోంది. భార్యకి కొత్తచీర. ముసలి తండ్రికి కోటు కుట్టించు కోవడానికి సరిపడ్డ ఉలెన్ గుడ్డ. వృద్ధమాతకి ఎప్పటినుంచో కొనాలనుకుంటున్న గిరిధర రామాయణం. చెల్లెలికి స్కర్టు గుడ్డ. తమ్ముడి చేతికి రిస్టు వాచీ. చంటిపిల్లాడికి ఆడుకోవడానికి బొమ్మలు. ఇలా ఎన్నో అవసరాలు. అతని జేబు 'పండోరా బాక్సు'లా ఉంది. అతని చేతివ్రేళ్ళు కల్పవృక్షం శాఖల్లా విస్తరిస్తున్నాయి. అతను కళ్ళారా చూడలేకపోతున్నాడు కాని, జేబులో తిరుగాడుతున్న ఆ వైభవాన్ని అనుభవించగలుగుతున్నాడు. ఆ సాయంత్రపు వేళ అతని మనోభావాలు ఆకాశ వీధుల్లో అశ్వాల మాదిరి పరుగులెత్తుతున్నాయి. ముఖం మీద మందహాసంతో, ఉల్లాసంతో మెరుస్తున్న కళ్ళతో అతను ఇంటివైపు నడుస్తున్నాడు.

ఇంటికి వచ్చి చూస్తే, అప్పటికే చీకటి పడిపోయినా, ఎవరూ ఇంట్లో దీపం వెలిగించలేదు. లోపల ఎవరూ నడయాడుతున్న అలికిడి కూడా లేదు. అక్కడ నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. అతను మెట్లెక్కుతుండగా, చీకటి ముద్దలాంటి తల్లి ఎదురైంది. కానీ ఆమె ఏమీ మాట్లాడలేదు. ఇంట్లో వ్యాపించి ఉన్న నిశబ్దతని భంగం చేసేందుకు ధైర్యం చాలలేదామెకు. జేబులో కల్పవృక్షపు శాఖలు తునాతునకలైపోయాయి. అలా విరిగి పడిన శాఖల మధ్యలో, జేబులో ఓ మూలన ఇరుక్కుపోయింది. అయినా అతను జేబులోంచి చేయి పైకి తీసే ధైర్యం చేయలేకపోయాడు. అతనలాగే మెట్లమీద నిలబడి ఉండిపోయాడు. తరువాత తల్లిని ప్రక్కకి నెట్టినంత పని చేసి, అతను మెట్లెక్కాడు. తల్లి మరోసారి అతన్ని ఆపుచేసే ప్రయత్నం చేసింది, ఎండిపోయి, ముడుచుకుపోయిన ఆమె చేయి. అతని భుజం మీద గ్రద్ధకాలిలా వ్రాలింది. అతనికి కించిత్తు భయం లాంటిది కలిగింది. ఇంట్లోని చీకట్లోంచి ఒక గబ్బిలం దూసుకుంటూ వచ్చి, అతని ప్రక్కనుంచి ఎగిరిపోయింది.

అతను లోపలికి వెళ్ళాడు. వరండాలో ఒక మూలన అతని తమ్ముడు కూర్చుని ఉన్నాడు. రెండోమూలని ముసలి తండ్రి ముడుచుక్కూచున్నాడు. చిన్నప్పుడు గారాబం చేసి నెత్తికెక్కించుకున్న కొడుకునే ఈ రోజు ఆయన కళ్ళెత్తి చూసేందుకు కూడా ఇష్టపడడంలేదు. ఆ చీకట్లో ఎండిపోయిన రెండు వృక్షాల్లా ఆ తండ్రి కొడుకులిద్దరూ కూర్చుని ఉన్నారు. వారిద్దరి మధ్యా మౌనం వరదలైపారుతోంది. ఇంకా అక్కడే ఉంటే అతనా ఉప్పెనలో కొట్టుకుపోయే వాడేనేమో! అక్కడి నుంచి కదిలాడు.

తమ్ముడు పసితనంలో అతని నిర్మలమైన నవ్వు, మెరిసే కళ్ళు, ముద్దు ముద్దు మాటలు. వాడిని ఎత్తుకున్న వాళ్ళెవరూ క్రిందికి దించడానికి ఇష్టపడేవారు కాదు. ఈరోజు అవేమీ మిగల్లేదు. కళ్ళకింద నల్లని చారలేర్పడ్డాయి. చైతన్యం శూన్యం. బుగ్గలమీది చర్మం

మొద్దుబారిపోయింది. జుత్తు అకాలంలోనే తెల్లబడిపోయింది. అతిగా సిగరెట్లు తాగడం వల్ల పెదాలు నల్లగా మాడిపోయాయి. చేతుల్లో మృదుత్వం లేదు. నోరువిప్పితే, మాట ఎండిపోయిన పక్షి గొంతులా ఉంటుంది. వాడిని చూస్తేనే మనసంతా సంతోషంతో నిండిపోతుంది. ఇంట్లో వాడేమీ మాట్లాడడు. ఇష్టం వచ్చినప్పుడు వెళతాడు. ఇష్టం వచ్చినప్పుడు వస్తాడు. ఓనాడు ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇంటికి వచ్చి వాడు చేసిన అప్పు విషయం బైట పెడితే డొంక అంతా కదిలింది. మొన్న మొన్ననే పది రోజుల క్రిందట, కోపం అణచుకోలేక తానే వాడిని చితకబాదాడు. ఆ చేతి వ్రేళ్ళు ఇంకా వాచి ఉన్నాయి. కానీ వాడిలో మాత్రం ఏమార్పూ లేదు. ఇంట్లో అందరూ వాడిని వెలివేసినట్టు చూస్తారు. అయినప్పటికీ, పెంపుడు కుక్కని తరిమి, తరిమి కొట్టినా అది తిరిగి ఇంటికే చేరుకున్నట్లు, ఇల్లు వదిలిపెట్టడు. ఒక్క తల్లిమాత్రం వాడినింకా ఆదరిస్తుంది. ఆమె ఒడిలో స్థానం అలాగే ఉంది. కాని, నాన్న. ఆయన మాత్రం వాడి మీద విరుచుకు పడతాడు. వృద్ధాప్యం ఆయన్నింకా లొంగదీయలేదు. అందరికీ ఆయనంటే భయం. ఆయనింకా భగవధ్యానంలో పడలేదు. తులసిమాల జపం మొదలు పెట్టలేదు. గుళ్ళూ గోపురాలూ దర్శించాలని కోరుకోడు. భక్తుడిగా మారవలసిన సమయంలో ఆయన భగవంతుడి మీద యుద్ధం ప్రకటించాడు. ఆ కారణంగా వారిద్దరి మధ్యా దూరం ఎక్కువైంది.

లోపలి గదిలో అంధకారం ఇంకా చిక్కగా ఉంది. లోపల అడుగు పెడుతూనే, అతనికేదో షాక్‌లా అనిపించింది. ఉన్నదగ్గరే ఆగిపోయాడు. చీకటి నీడలాంటి అతని భార్య, దీర్ఘవిశ్వాసం విడుస్తూ అక్కడ నిలబడి ఉంది. అతను చేతివ్రేళ్ళని సరిచేసుకుని జేబులో ఉన్న నోటుని గట్టిగా పట్టుకునే ప్రయత్నం చేశాడు. ఆమె ఏమీ మాట్లాడకుండా అలాగే నిలబడింది. చీకట్లో ఆమె ముఖం స్పష్టంగా కనిపించడంలేదు. ఇంట్లో అందరూ బ్రతికి ఉండికూడా, చచ్చినవారిలా ఉన్నారనిపించింది. ఏవో కదలికలున్నాయి. అవి సమాధిలో పురుగులు కదులుతున్నట్టుంది. మూలమూలల్నీ, దుఃఖమనే నాగుపాము మఠం వేసుక్కూచున్నట్టుంది. ఉండుండీ, ఇంట్లో ప్రవేశించే గాలి చేసే రొద ఎవరో రోదిస్తున్నట్టుంది.

పుట్టెడు కోరికలతో, మెట్టినింటికి వచ్చిన కోడలు వాడిన పూవులా అయిపోయింది. ఆమె అసలిప్పుడు, ఎక్కువగా మాట్లాడదు. మాట్లాడినా, అదింకా మాటలురాని కడసారపు సంతానంతో. ఆమె, ఆ పసివాడూ, వారిద్దరూ, వారిలోకంలో వారుంటారు. ప్రస్తుతం వాడు నిద్రలో ఉన్నాడు. మౌనం, అంధకారం అనే గుట్టల క్రింద అణగారిపోయిందామె. ఆ అంధకారపు తెరవెనక మరుగుపడిపోయిన తన భార్య స్వరూపాన్ని చూసేందుకు అతను దృష్టిని కేంద్రీకరించాడు. దూరంగా ఒక మూలన రెండు మూడు ఎలుకలు కీచులాడుకుంటున్నాయి. కొంచెం సేపయ్యాక గదిలో గాలి పిసరంత కదలాడింది. దానితో, తన భార్య అక్కడే ఎక్కడో ఉండి ఉండాలని ఊహించాడతను. పుట్టి, పెరిగి, నడయాడిన ఇంట్లోనే, తనవాళ్ళని వెతుక్కుంటున్నాడతను. బొగ్గుగనిలో ద్వారం మట్టితో కప్పుకుపోతే, లోపల ఊపిరి సలపక బాధపడే కార్మికుడిలా ఉంది అతని పరిస్థితి. అతను రెండో వైపుకి తిరిగాడు. అక్కడ కిటికీ ఉండట్టి కాస్త తక్కువ చీకటిగా ఉంది. అక్కడ చూస్తే, అతని చెల్లెలు. నేలమీదే పడుకుని ఉంది. ఆ సన్నని వెల్తురులోనే ఆమె గుండెలు ఎగిసిపడడం స్పష్టంగా తెలుస్తోంది. రేపు ఉదయమే ఆమెను నవ్వించగల ధైర్యం చేయగలడా తను?

ఇలా ఆలోచిస్తూ, దిగ్భ్రమతో నిలబడ్డాడతను. అంతలో పిల్లాడి ఏడుపు వినిపించింది. ఆ ఏడుపు ఇంట్లో రాజ్యం చేస్తున్న అంధకార వాతావరణాన్ని ఒక్క ఊపు ఊపింది. లోపలి గదిలో దీపం వెలిగింది. ఆ వెల్తురు అంధకారాన్ని చీల్చుకుంటూ, రెండోగది వరకూ వ్యాపించింది. తల్లి బైటినుంచి లోపలికి వచ్చింది. చెంబులో నీళ్ళు నింపి. అవి తీసుకుని వరండాలోకి వెళ్ళింది. పిల్లాడిని లేపి నిలబెట్టింది. లోపలికి తీసుకొచ్చి నీళ్ళు త్రాగించింది. ముసలాయన కూర్చున్న దగ్గరనుంచి లేచాడు. నీళ్ళ గదిలోకి వెళ్ళి గొంతు క్లియర్ చేసుకున్నాడు. కొంచెం సేపు దివాన్ దగ్గర నిలబడ్డాడు. చలికాలం కాబట్టి, చలిగి తట్టుకోలేకనో లేక హృదయంలో చెలరేగే సంక్షోభం వల్లనో ఆయన బాగా వణుకుతున్నాడు.

అతను లోపలికి వెళ్ళి ఏడుస్తున్న పిల్లాడిని ఎత్తుకుని బైటికి తీసుకొచ్చాడు. ఆ పిల్లాడు వాడికే అర్థంకాని, అర్థంలేని చిలక పలుకుల్తో ఏదేదో మాట్లాడుతున్నాడు. ఇంట్లో ఉన్న మనుషులందరూ కూడా, ఇలా అర్థంపర్థం లేని భాష మాట్లాడడం నేర్చుకుంటే ఎంత బాగుండును! ఏ చీకూ చింతా ఉండదు అనిపించిందతనికి. తరువాత తానే ఆ భాష నేర్చుకునే ప్రయత్నంలో ఉన్నాడా అన్నట్టు, ఆ మాటల్ని శ్రద్ధగా వినసాగాడు.

తల్లి లోపలి గదిలోకి వచ్చింది. దేవుడి పటం ముందు నేతి దీపం వెలిగించింది. చేతులు జోడించి చాలాసేపు. ఏదో అస్పష్టంగా గొణుగుతూనే ఉంది. తరవాత ఆమె వంటింట్లోకి వెళ్ళింది. వెనకాలే అతని భార్య కూడా వెళ్ళింది. ముసలాయన వచ్చి, అతని చేతిలోని కుర్రాడిని తీసుకుని వెళ్ళిపోయాడు. వరండాలో కూర్చుని వాళ్ళిద్దరూ ఏదో సంబాషణలో పడ్డారు. నెమ్మది, నెమ్మదిగా నిస్తేజమనే వజ్రపు కోటగోడలు కూలసాగాయి ఇంట్లో, చిన్న, చిన్నగా చప్పుళ్ళు, కదిలికలూ మొదలయ్యాయి.

అతను తన గదిలోకి వెళ్ళాడు. కోటు విప్పేముందు, జేబులోంచి, ఆ అయిదు రూపాయల నోటు జాగ్రత్తగా తీసి టేబులు మీద ఒక పుస్తకం క్రింద ఎగిరిపోకుండా పెట్టాడు. భార్య ఒకటి రెండుసార్లు గదిలోకైతే వచ్చింది కానీ ఏమీ మాట్లాడలేదు. భోజనానికి ఇంకా చాలా టైము ఇంది. అతను నెమ్మదిగా ప్రక్కనున్న ట్రంకు పెట్టెకు జేరగిలబడి కూర్చున్నాడు. అలసటతో అతని కళ్ళు మూతలు పడుతున్నాయి. అతను మరో ప్రపంచంలో ప్రవేశిస్తున్నాడు.

అందులో....

వెల్తురే వెల్తురు. ఆ వెల్తురులో ధగధగా మెరిసిపోయే రాజమహలు. నాలుగువైపులా గోడలకి నిలువెత్తు అద్దాలు. చక్కని సువాసనలు వెదజల్లే ఫౌంటెన్. కానీ అక్కడేమీ నరసంచారం లేదు. సింహాసనం ఖాళీగా ఉంది. దర్బారులో మంత్రుల, సామంతుల ఆసనాలు ఖాళీ. అతను వాళ్ళంతా వస్తారని ఎదురుచూస్తున్నాడు. ఎదురుగా పెద్ద పెద్ద ఎర్రని ముఖమల్ తెరలు వ్రేళ్ళాడుతున్నాయి. వాటిమీద పెద్ద సైజులో అయిదు సంఖ్య రాసి ఉంది. అతను దానిమీద దృష్టిని నిలిపాడో లేదో, వెనువెంటనే అది నడి సముద్రంలో తుఫానులో చిక్కుకున్న నావలా ఊగిపోసాగింది. అమ్మా, నాన్నా, తమ్ముడు. భార్య. చెల్లెలు, కొడుకూ అందరూ దానిని అంటిపెట్టుకుని ఉన్నారు. కానీ, నీళ్ళు - నల్లని నీళ్ళు సుడిగుండంలా గిరగిరా తిరుగుతున్నాయి. అందులో పడి ఆ నావ మునిగిపోతోంది. అంతే "రక్షించండి! రక్షించండి!" అని అరుస్తూ అతను ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా చూస్తే, ఏముంది? ప్రక్కనే నిలబడి అతని ముద్దుల కొడుకు అప్పటికే, పుస్తకంలోని నాలుగైదు పేజీలు చించిపారేశాడు. సరికదా! దాన్క్రింద ఉన్న అయిదురూపాయల నోటు చేతిలోకి తీసుకుని దాన్ని చింపడానికి తయారుగా ఉన్నాడు. అతనికి నోటు చిరుతుగున్న "ఫర్! ఫర్" మన్న శబ్దం వినవస్తోంది.

●●●




**వటవృక్షం** గుజరాతీ మూలం: భూపేష్ ఆధ్వర్యు

**రామ్‌రతన్, లచ్చుమన్ సుమారు** ఒక సంవత్సరం నుంచీ ముంబైలోనే ఉంటున్నారు. టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ఊళ్ళోని చిన్నా పెద్దా, శిధిలమైనవి, శుభ్రమైనవి ఇళ్ళు, పచ్చని శాఖలున్న చెట్లు. రైల్వే బ్రిడ్జి క్రింద, ముసలవ్వ శరీరంలా వంకరలు తిరుగుతూ ప్రవహిస్తున్న అస్థిరమైన నదీ, అది నిత్యమూ దిశలు మారుస్తూండడం వల్ల వంకరటింకరగా మారిన దాని ఒడ్డులు, వాటిపైన మామిడి చెట్లు ఇవన్నీ క్షణాల్లో కనిపించి మాయమౌతున్నాయి.

రైలు పరుగెడుతోంది. దూరాన ఉన్న మామిడితోపులు దానివెంట పరుగెడుతున్నాయి. వాటి మధ్యలో చిన్న ఊరు. క్రింద రెక్కలల్లార్చుకుంటూ ఎగిరే బాతుల్లాంటి ఓడలతో నిండిన నదులు. ఆకాశంలో పచ్చటి దుప్పటి పరచినట్టు దట్టమైన చెట్ల ఆచ్ఛాదన. ఈ పరుగు పందెంలో అన్నిటికంటే ముందు ఆ గ్రామం ఉంది. ఆఖర్న, అన్ని గ్రామాలూ నదులూ తోపులూ దాటాక ముంబై వస్తుంది.

ముంబై ఫుట్‌పాత్, సముద్రతీరం, నియోన్ సైను బోర్డులు, పానీపూరి, రోడ్డుమీద మోటారు కార్ల హారన్‌ల మధ్య, రణరంగంలా నాలుగు రోడ్ల కూడలి కానవచ్చాయి. ఒక చిన్న సైజు హిమాలయాల్లాగ, ఖాదీధర్ కాంగ్రెసు నేత శరీరంలాగ ఉప్పుకొటార్లతో నిండిన 'వసయి' చవిటి పర్రలు వచ్చాయి. ఇంతలో సూర్యోదయమైంది. మబ్బుల్లోంచి సూర్య భగవానుడు తొంగి చూశాడు. అప్పటివరకూ గడగడ మాట్లాడుతున్న పార్సీ పెద్దాయన ఒక్కసారిగా మౌనం వహించి, బంగారు బంతిలా వెలిగిపోతున్న సూర్యబింబానికి రెండు చేతులూ ఎత్తి నమస్కరించి భక్తితో ధ్యానించాడు. ఈలోగా వసయీ కూడా వెళ్ళిపోయింది.

రైలు ఆగుతూ నడుస్తూ, నడుస్తూ ఆగుతూ, మధ్యలో కూస్తూ, ప్లాట్‌ఫారాల మీద కోలాహలాన్ని సృష్టిస్తోంది,. స్టేషన్ల పేర్లున్న పసుపు పచ్చటి సైన్ బోర్డులు వస్తున్నాయి. పోతున్నాయి. ఒక్కో బోర్డుని లెక్కచేయకుండా ముందుకి సాగిపోతోంది రైలు. దాని వేగానికి వీచేగాలికి స్టేషను పైకప్పు మీది పావురాలు బారులు బారులుగా ఎగిరిపోతున్నాయి. ఛుక్, ఛుక్ చప్పుడు లయబద్ధంగా తాళం వేస్తున్నట్లుంది. కొంత ప్రయాణికులతోనూ, మరికొంత పాన్‌బీడా, సిగరెట్టు, కాఫీ, పాలసీసాలు అమ్ముకునేవాళ్ళతోనూ, యూనిఫామ్‌లో డైనింగు కారు భోజనాలూ టిఫిన్లు అందించే నౌకర్లతోనూ, ఎర్రబట్టల పోర్టర్లతోనూ ప్లాట్ ఫారాలు క్రిక్కిరిసి ఉన్నాయి. రైలు పెట్టె ఫుట్‌బోర్డ్ మీద వ్రేళ్ళాడుతూ, రాంరతన్, లచ్చుమన్, రైలాగిన ప్రతీ స్టేషన్‌లోనూ ప్లాట్‌ఫారం మీద దిగుతూ, టి.టి.ఈలు ఏ డబ్బాలో ఎక్కుతున్నారో జాగ్రత్తగా గమనించి, వారు లేని పెట్టెలో ఎక్కుతున్నారు. ఒక్కోసారి మఫ్టీలో ఉన్న టి.టి.ఈ.కి దొరికిపోతుంటారు. 'టికెట్ చూపించం'డని అతను నిలదీస్తే, ఓ జాలి చూపు పారేస్తారు. "పదండి నాతో! తియ్యండి జేబులో ఎంతుంది?" అని అతను గదమాయిస్తాడు. వాళ్ళేం మాట్లాడరు. అలాగే నుంచుంటారు. రైలు బయలుదేరుతుంది. "మళ్ళీ నా బండిలో ఎక్కారా! జాగ్రత్త!" చెకర్ దాటుకుంటాడు. వాళ్ళు మళ్ళీ ఫుట్ బోర్డుమీద వేళ్ళాడుతూ.

ఎరుపు ఆకుపచ్చ రంగుల ఒంటికాలి సిగ్నల్ రెక్కల్ని దాటుకుంటూ, ముందుకి సాగిపోతుంది రైలు. అక్కడక్కడా అది వంకరలు తిరిగినప్పుడల్లా, ముందుప్రక్క ఇంజనులో ఎర్రరుమాలు తలకి కట్టుకుని డ్రైవరు కనిపిస్తాడు.

అలా బోరివలీ దాటాక ముంబై ప్రారంభం అవుతుంది. నేలమీద ప్రాకే జెర్రుల్లాగ ఎలక్ట్రిక్ ట్రైన్లు కనిపిస్తాయి. పేకట్లు ఒకదానిమీద ఒకటి పేర్చినట్టు ఇళ్ళు. రైలు పట్టాలతో సమానంగా పరుగెత్తుకుంటూ ద్రాక్షపళ్ళు గుత్తుల్లా ఒకదానిపై మరొకటిగా కాలనీలు. ట్రైనులో భజనపాటలు పాడుకుంటూ, ఒకరి వెంట మరొకరు బిచ్చగాళ్ళు, చెట్లు, నదులు, మామిడితోపుల స్థానంలో, గడ్డిమేటుల్లా ఒకదానిలో ఒకటి, ఒకదానిపై మరొకటి. క్రిందా పైన 'ధాబా' ఇళ్ళు, మెరిసే కార్లు, మచ్చలేని మాసిపోని స్వచ్ఛమైన పల్చని పాము కుబుసాల్లాంటి చీరలు, రంగు రంగుల ప్యాంట్లు, పంజాబీ డ్రస్సులు. బుష్ షర్టులతో, కపుల్సు. వాళ్ళంతా రైలు పెట్టెల్లో ఎక్కుతున్నారు దిగుతున్నారు. ఫుట్ బోర్డుమీద వ్రేళ్ళాడుతూ, మఫ్టీలో ఉన్న చెకర్‌ని కళ్ళలో కళ్ళు పెట్టి ధైర్యంగా చూస్తున్నారు.

ఈ పంచరంగుల ప్రపంచం ముందు, పల్లెటూళ్ళ విలువ ఏమాత్రం? ఆ సందుగొందులు ఆ మనుషులు. ఆ గుడిసెలు, పొలాలు, నాగేటి చాళ్ళు, గోధుమలు. ఆ గాలి ఆ పాటా ఆ తీరేవేరు.

మహిమ్, దాదర్, బోరివలీ, పర్లే, బోరీబందర్, మటుంగా, బంద్రా. ఒక్కొక్కపేరు చదివినా చదవకపోయినా, దాటుకుంటూ పోతుంటే, వాళ్ళ స్వగ్రామం, దాని వ్యక్తిత్వం తెరమరుగై, కేవలం శ్మశానంలో భగభగలాడే మంటలయ్యాయి. మనసంతా ముంబైతో నిండిపోయింది. మహిమ్ - ముంబై, దాదర్ - ముంబై, పర్లే - ముంబై, ముంబై - ముంబై.

ముంబై వచ్చాక, నిత్య భయకంపితమైన జీవితంలో, ఫుట్ బోర్డు ప్రయాణాలతో, జరుగు - ముందుకు జరుగు అనే తోపులాటతో, ప్లాట్ ఫారాల మీద పడుతూ, లేస్తూ, అలిసిన శరీరం కార్చిన చెమటలతో తడుస్తూ రోజూ ఏ సాయంత్రానికో చౌపాటీ, భుల్లాభాయ్, నారిమన్ పాయింట్, అప్సరా, నయాగరా, మెరైన్ డ్రైవ్‌లోని ఆకాశహర్మ్యాల నీడల్లో, చల్లని బీచ్ గాలి నాస్వాదిస్తూ, ఇన్‌కమ్ టాక్స్ దొంగల ఏర్ కండిషన్ బంగ్లాల్లో, రేడియోలూ, కెమెరాలూ, లిఫ్టుల్లో ఉన్న ఎందరో ధనవంతుల్ని, చూస్తూ వారి జీవితం ప్రారంభం కాబోతోంది. రైలు ఆగవచ్చు, ఆగకపోవచ్చు. నెమ్మదిగా వెళ్ళొచ్చు. వేగంగా వెళ్ళొచ్చు. ఇలా ప్లాట్‌ఫారమ్ రాగానే మాత్రం వారి కాళ్ళు అక్కడే ఆగిపోతాయి. ఆ పరుగెత్తే రైలు వెంటే, వారి పల్లెటూరూ, దాని స్మృతులు కూడా పరుగెత్తుకు వెళ్ళిపోయాయి. మిరుమిట్లు గొలిపే కొత్త ప్రపంచం వారి కళ్ళల్లో, చెవుల్లో రక్తంలో, ప్లాస్మాలో, అంతఃకరణలో, హృదయంలో దాని స్థానం సుస్థిరం చేసుకుంది.

ప్లాట్‌ఫారం మీద దిగాక బైటికి ఎలా వెళ్ళాలా అన్నదో పెద్ద సమస్య అయింది. ఎలాగో, నెమ్మదిగా, చెక్కర్ కంటపడకుండా, ఆకలి కడుపులతో బైటపడ్డారు. చెకర్ టికట్టు అడగలేదు. అతని ధోరణిలో అతనున్నాడు. స్టేషను బైటకి రాగానే, నెమలి పురి విప్పినట్టు ముంబై మహానగరం రంగులీనుతూ కనిపించింది. అంతలోనే ఆకలి నేనున్నానంటూ ముంచుకొచ్చింది. తలుపు దగ్గర నిలబడి చేసిన ప్రయాణపు బడలిక కాళ్ళకి బేడీలు వేసినట్టుగా ఉంది. అడుగు ముందుకుపడలేదు.

కానీ.

ఇదంతా ఏడాది క్రిందటిమాట. ఇప్పుడు కూడా ఇద్దరూ కలిసే ఉన్నారు. వారితోనే వారి కడుపులూనూ. ఆ పొట్టల మీద తొడిగిన చిరుగుల చడ్డీల జేబుల్లో 'సెవనో క్లాక్' బ్లేడులున్నాయి. ఇంకా కొంచెం చిల్లర డబ్బులు కూడా. ఇద్దరి నోళ్ళలోనూ. ముంబై వచ్చేముందు నేర్చిన తిట్లు అలాగే ఉన్నాయి. ముంబై వచ్చాక మరికొన్ని క్రొత్తవి వచ్చిచేరాయి. నోట్లో, పాన్, సిగరెట్టు కూడా వచ్చాయి. ఊళ్ళో ఉన్నప్పుడు. చెమటలు పట్టేలా కట్టెలుకొట్టి ఒకటీ అరా డబ్బు సంపాదించేవారు. ఒకవేళ అదీ లేకపోతే, ఆకలితో పడుకునేవారు. ఖాళీ కడుపుల్లో నదిలోని నీరు నింపి, ఒకళ్ళు నొకళ్ళు అదిమి పెట్టి పట్టుకుని పడుకునేవారు. ఇప్పుడు చౌపాటీ ఇసకలో, ఫుట్‌పాత్ మీద మైదానంలో పోలీసుల దృష్టినుంచి తప్పించుకుని, గార్డెన్సులో ఎవరికంటా పడకుండా, చర్చిగేటు స్టేషనులో మారుమూల, గేట్‌వే ఆఫ్ ఇండియా దగ్గర ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నారు. పడుకోడానికి పైకప్పు ఊళ్ళోనూ లేదు. ఇక్కడా లేదు. కాకపోతే ఊళ్ళో

రోటీ ఉండేది కాదు. ఇక్కడుంది. పానీపూరీ, భేల్, మరమరాలు పావ్‌బాజీ. ఎన్ని రకాలో దొరుకుతాయి. కొంచెం నేర్పరితనంతో 'సెవనో క్లాక్ బ్లేడ్' వాడడం తెలిస్తే చాలు. ఎన్నో రకాల కరెన్సీ నోట్లు. చిల్లరపైసలు. ఎర్రని, నీలిరంగుని, పచ్చని కంపెనీవాళ్ళు ఉద్యోగాలకోసం ఇచ్చిన ప్రకటనల కటింగ్స్. చక్కని పాలిష్ చేసిన అమెరికన్ లెదర్ పర్సులోని బస్‌పాస్, గురుగ్రహం, సాయిబాబాల మహిమల తాయెత్తులు, ఇలా ఎన్నో రకాలు అన్నీ దొరుకుతాయి.

పోలీసులు జైలు శిక్ష, చెంప దెబ్బలు, గుంపులు గుంపులుగా జనం పోగై వేసే వీపు గుద్దులు కూడా అప్పుడప్పుడూ దొరుకుతూంటాయి. వీటిలో కటకటాల వెనక్కి వెళ్ళడం కూడా ఉంది. కానీ, బైటికి వచ్చిన వెంటనే, మళ్ళీ చెప్పుదెబ్బలు, పర్సులు ప్యాకెట్లు. సెవనో క్లాక్ బ్లేడులూ, షరా మామూలే ఏమైనా చెప్పండి. వాడకంలో మాత్రం సెవనో క్లాక్‌ని మించిన బ్లేడులేదు.

ఆ పల్లెటూళ్ళోనే ఉంటే, ఏ ధర్మశాల అరుగుల మీదో, అర్ధాకలితో, చారికలు కట్టిన నోళ్ళతో, జీవంలేని కళ్ళతో పడి ఉండేవారు. ఆ ప్రక్కనే ఉన్న దేవాలయంలో, హారతి ఇచ్చాక దొరికే ప్రసాదం కోసం ఉభయ సంధ్యలూ కాసుక్కూచుని ఉండేవారు. బహుశా ఓ నెల తరవాత, ఓ శుభోదయాన, ఆ అరుగులమీద, లోతుకు పోయిన కడుపుల్లో చేతులు దాచుకుని, నోళ్ళు తెరిచి, కళ్ళు పగిలి, పడున్న రెండు శవాల్ని, శుచిగా స్నానం చేసి వస్తున్న పూజారి చూసి, మైలపడి ఉండేవాడు.

ఈ వ్యాపారం నడపడానికి అన్నిటికంటే చర్చిగేటు మెరుగు. స్టేషను, చౌపాటీ, అక్వేరియం, హేంగింగ్ గార్డెన్సు, కమలా పార్కు. రీగల్, ఈరోస్, రాజాబాయి టవర్ ప్రాంతాల్లోని ఆఫీసులన్నీ అక్కడికి దగ్గర, పరుగెత్తే లోకల్ ట్రైను రద్దీలో హేంగర్‌ని పట్టుకుని వ్రేలాడేవాళ్ళు. తలుపు దగ్గర నిలబడి ఏరియల్ పైకిలాగి. ట్రాన్సిస్టర్ వినేవాళ్ళు. కాస్త వాల్యూమ్ తగ్గించమని వాళ్ళని బ్రతిమాలే వాళ్ళు, ౹, చౌపాటీలో నేతల బహిరంగ సభలో కూర్చుని, రాత్రి చూసిన సినిమా గురించి చర్చించుకునే ఇద్దరు మిత్రులు, హేంగింగ్ గార్డెన్సు మీద నిలబడి ముంబై మనుష్యారణ్యాన్ని చూసి, విస్తుపోయే విదేశీయుడు, గేట్‌వే, ఆఫ్ ఇండియా దగ్గర ఓపెనెయిర్ కఫేలో ప్రవేశించే లావుపాటి పార్శీ యువతులు - ఇలాంటి వాళ్ళదగ్గర వాళ్ళ చలాకీతనం పరీక్షించుకోవడం తేలిక అవుతుంది.

ఈరోస్‌లో నడుస్తున్న ఎవార్డు విన్నింగ్ సినిమా కోసం త్రాచుపాములాంటి క్యూలో ఆఖర్న నిలబడి, కాలక్షేపం కోసం స్క్రీన్ పేపరు తిరగేస్తున్న కాలేజియను వెనక నిలబడి అతి లాఘవంగా అతని జేబు కొట్టేసి, 'అరెరె! పర్సు ఇంటిదగ్గరే మరిచిపోయాను' అని క్యూలోంచి బైటపడటంలాంటి నేర్పు ఇప్పుడు వారికి బాగా అబ్బింది.

ఆ పల్లెటూళ్ళో పెరిగిన నాటి వారి బాల్యం ఇప్పుడు సగం యవ్వనలోకి ప్రవేశించింది. చలికాలపు రాత్రులు సిగరెట్టు పొగ వదలడంలో గడుస్తున్నాయి. నింగినంటే మేడలు, నియోన్ లాంపు, కఫేలు, చిక్కుకుని, ముంబై మహాపట్టణం నాలుగు ప్రక్కలా ఆవరించిన సముద్రం మధ్యలో ఈదుతూ ఉంటుంది. ఆ ఈదులాడే ముంబై మధ్య వీధుల్లో వీళ్ళిద్దరూ ఈదుతుంటారు. ఫాక్ లాండ్ రోడ్డులో తగిలి 'రాత్రి ఆనందం' వెతుక్కుంటున్న రసికుడికి దారి చూపించి, కమిషన్ సంపాదించుకుంటారు. జుట్టు నెరిసే బట్టతలల్తో ఉన్నప్పటికీ, యవన సంబంధమైన చిత్రాలతో కూడిన పుస్తకాల కోసం తపించే వృద్ధయువకుల్ని ఆదుకుంటారు. అలా ముంబైలో ఈదులాడే వారి జేబుల్లో చిల్లర డబ్బులు ఈదుతూంటాయి. సిగరెట్లతో నిండిన పేకెట్లు కూడా ఈదుతుంటాయి. వాచ్ గేటు దాటి, కొంకణ్ ఘాట్‌లో ఓ ఊరూ పేరూ లేని పల్లెటూళ్ళో లంగరు వేసిన, స్టీములాంచిలోని వాచీలు, టెరిలిను బట్టలు, ఒక చేతిలోంచి మరొక చేతిలోకి ఈదుకుంటూ వచ్చి, వీరి చేతుల్లో పడతాయి, అక్కడినుంచి, ఇంకా ముందుకి ఈదుకుంటూ పోయి ఏ ఎపార్టుమెంటు రూములోనో, మెకానిక్కు గేరేజిలోనో, స్టోరుకీపరు చేతిలోనో, ఎక్కడో ఓ దగ్గర స్థిరపడతాయి.

అరే మిల్కు బాటిల్సు, నిర్ణీత స్థలాలకి, నిర్ణీత సమయంలో ముంబై అంతా చేరుకునేలోపలే నాటుసారా సీసాలు కూడా, నిర్ణీత సమయంలో చేరవేయడంలో భాగంగా, సైకిలు పెడల్సు మీద వీరి పాదాలు చకచకా తిరగడం మొదలుపెడతాయి. గడియారంలోని ముళ్ళు గుండ్రంగా తిరుగుతూ, వర్తమాన క్షణాన్ని మరుక్షణంలో భూతకాలంలోకి నెట్టేస్తున్నాయి. ప్రస్తుత వర్తమానక్షణంలో 'గ్లేన్స్ డౌన్

స్ట్రీట్ నాలుగు రోడ్ల కూడలి దగ్గర వెలిగే పచ్చలైటు కోసం నిరీక్షిస్తున్న రామ్ రతన్, అది వెలగ్గానే కూడలి దాటి నోట్లో నములుతున్న కిళ్ళీలోని రసం అంతా పీల్చేసి, పిప్పిని తుపుక్కున రోడ్డుమీద ఉమ్మాడు. అదిపోయి, అక్కడే 'అల్లా కే నామ్ సర్' అడుక్కుంటున్న బికారి మీద పడింది. అతని నోట్లోంచి నాలుగైదు తిట్లు, శాపనార్థాలు వినవచ్చాయి.

హర్తాళ్ళు, అల్లర్లు, ఘొరావోలు, నినాదాలు, ఎన్నికలు వారికొక క్రొత్తరకపు ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. బిజినెస్ కోసం కాని, అలాగే యధాలాపంగా కాని, రోడ్ల మీద తిరుగుతున్నపుడు వాళ్ళ కళ్ళు, చెవులు, నాలుక, చేతులు, కాళ్ళు ఫ్రీగా ఉంటాయి. ఏ విధమైన పన్నులు, టాక్సులు, కట్టనవసరంలేదు. అలా ముంబై వీధులు అరిగేలా తిరిగితే చాలు. అంతే రాత్రులు, పచ్చని లాన్సు మీద, పడుకుంటూ, లేస్తూ పడి ఉండాలి, ఇంకా ఒకళ్ళనొకళ్ళు వదిలిపెట్టకుండా ఉండే అవసరం మాత్రం మిగిలి ఉంది.

'ఫ్లోరా ఫౌంటెన్' దగ్గర, ఆఖరి స్టాపులో, డ్రైవర్లందరూ గుమికూడారు. రోడ్డుమీదపడి ఉన్న ఒక సబ్బుల ప్రకటన ఉన్న కాగితాన్ని ఎత్తిపటుకుని, దానిపైన ఉన్న అందాల సినీతార ఫోటోని చూస్తూ, దానికి కన్నుకొట్టి - పెదాల మీద నాలుక త్రిప్పి పారేశాడు లచ్చుమన్. ప్రక్కనున్న డ్రైవర్లవైపు. కార్లలో పోతున్న ఎగిరే జుత్తున్న వాళ్ళవైపు. ఆఖర్న రామ్ రతన్ వైపు చూసి, వీళ్ళంతా ముసలివాళ్ళైనా అయి ఉండాలి. లేకపోతే ఆర్నెలల పసిపిల్లలైనా అయిఉండాలి అనుకున్నాడు మనసులో. అక్కడినుంచి లంబకోణంగా విడిపోతున్న రోడ్డువైపు మళ్ళారు వాళ్ళిద్దరూ. అక్కడొక భేల్ పూరీ వాలాని మంచినీళ్ళడిగిన కుర్రాడిని. అతను "నా భేల్ పూరీ తిన్నవాళ్ళకే ఇక్కడ మంచినీళ్ళు దొరుకుతాయి ఫో!" అంటూ బెదిరిస్తున్నాడు. ఆ భేల్ బండి ప్రక్కనే ఒక పెద్దమాను కట్టిన చెట్టొకటుంది. దానిమీద చౌపాటీలో మర్నాడు ఓ దేశనాయకుడి బహిరంగ సభ గురించిన ప్రకటన, మరాఠీలో రాసింది. అంటించి ఉంది. రామ్‌రతన్ దృష్టి ముందుగా దానిమీదపడింది. తరువాత పైకి పైపైకి వెళుతూ మొత్తం చెట్టునంతా ఆక్రమించింది. పాన్ నమలగా మిగిలిన పిప్పిని మళ్ళీ నేలమీద ఉమ్మి అన్నాడు "మన ఊళ్ళో కూడా ఇలాంటి పెద్ద పెద్ద చెట్లు వీధి చివర్న ఉండేవి. "

"ఉండొచ్చు! ఉండొచ్చు!" అన్నాడు విసుగ్గా లచ్చుమన్.

●●●




# రాధ - కృష్ణ గుజరాతీ మూలం: జయశ్రీ జె. చౌదరి

**నల్లని బేక్ గ్రౌండులో, బంగారు రంగు** అక్షరాలు "బంగ్లా నెం 122 శ్రీ సునీల్ పావాగఢీ" అని రాసి ఉన్న బోర్డు, నియోన్ లైటు వెలుతురులో ధగధగా మెరిసిపోతోంది. వేటాడే జంతువు. ఎరని అందుకోవడానికి వెళ్తోందా అన్నట్టు, అతను అడుగులో అడుగులేసుకుంటూ, నిశ్శబ్దంగా గేటువద్దకు చేరుకున్నాడు. గేటు తెరిచాడు.

నికీ షవర్ బంద్ చేసింది. తువ్వాలుతో శరీరాన్ని తుడుచుకుంది. ఒళ్ళంతా పౌడరు అద్దుకుంది. తెల్లని పాము కుబుసం లాంటి నైటు గౌను వేసుకుంది. జుత్తు భుజాల మీద వ్రేలాడుతోంది. 'ఓహ్! ఈ శరీరం ఎంత అందంగా ఉండేది. 36-28-38 ఫిగర్. బేబీ ఫేస్. నలల్ని కుంకుడు పిక్కల్లాంటి కనుగ్రుడ్లు. యూనో! నల్లని కనుగ్రుడ్లున్న వాళ్ళు ఎక్కువ సెక్సీగా ఉంటారుట. ఈ పిల్ల ఎవరి భాగ్యంలో రాసిపెట్టి ఉందో' అని చుట్టుప్రక్కలవాళ్ళు అసూయపడడం తనకు తెలుసు. అయిదేళ్ళ నిషేధ్ మంచం మీద గాఢనిద్రలో ఉన్నాడు. ఆ బెడ్ రూము తలుపులు ఆమె బైటినుంచి లాక్ చేసింది

అతను పోర్టికోలోకి వచ్చాడు. డోర్ బెల్ బొటన వ్రేలితో నొక్కాడు. "కిచ కిచ"మని పక్షిలా అరిచిందది. 'ఐ విండో'లోంచి తొంగి చూసింది నికీ. పారదర్శకంగా ఉన్న గౌనులోంచి, లోపలి బట్టలమీది మడతలు కానరాకుండా సరిచేసుకుందామె. తలుపు తెరిచింది.

"మోస్ట్‌వెల్ కమ్ సహానీ"

"..."

డ్రాయింగు రూము తెల్లని విద్యుద్దీపపు కాంతిలో మెరిసిపోతోంది. ఆ కాంతిలో నికీ దేవకన్యలా ప్రకాశిస్తోంది.

"మీకు కేవలం రెక్కలు మాత్రమే తక్కువ. అదే నా ఉద్దేశం, దివినుంచి దిగివచ్చిన దేవతలా ఉన్నారు" అన్నాడతను.

"ఐ నో! థేంక్యు"

"......."

"ఏం తీసుకుంటారు? వేడి వేడిగానా? లేక చల్లగా"

"నిజనికి నాకు చాలా వేడిగా, కావాలి. మీలా" మనసులోని మాటని మనసులోని మాటని మనసులోనే దాచుకుని, మొహం మీద మాత్రం చిరునవ్వు చిందిస్తూ "నేను మీకీ స్పెషల్ ప్రసాదం అందిద్దామని వచ్చాను. రాత్రి ఝూలా దర్శన్‌లో చూశాను మిమ్మల్ని. ప్రసాదం తీసుకోకుండానే వచ్చేశారు మీరు. ఇవ్వాళ ఇంట్లో ఎవ్వరూ లేరు కూడా. సరయూ 'పల్నాడ్' వెళ్ళింది. పుట్టింటికి అమ్మా నాన్నలని చూడాలని. అదొక నెపం."

"హుఁ ఐ థింక్ ఆమెను డయాబిటిస్ బాగా కృంగదీసిందనుకుంటాను. పాపం కాలం కూడా తీసేసి, జైపూర్ ఫుట్ పెట్టాలట కాదూ? అదామె కంత ఇష్టంలేదు. మీరామె నెంతో ప్రేమగా చూసుకుంటారు. ఆమె అదృష్టవంతురాలు."

"అవును నిజమే మరి నా సంగతి?"

"......"

"సునీల్ అవుటాఫ్ స్టేషను అనుకుంటాను?"

"అవును. ప్రతి అష్టమికీ అతను ఆ పల్లెటూరి ఇంటికి వెళతాడు. రేపు వచ్చేస్తాడు."

షో కేసులో కృష్ణుడి భుజాల మీద వ్రాలిపోయి నిలబడ్డ రాధ పటం వైపు చూస్తూ, మిస్టర్ సహానీ ఒక పుస్తకం చూపించే నెపం మీద, నికీకి దగ్గరగా వచ్చి, ప్రక్కనే కూర్చున్నాడు. స్త్రీ సహజమైన సంకోచంతో, నికీ కొంచెం ప్రక్కకి జరిగింది. సహానీ ఒత్తైన జుట్టు ఆమె కపోలాన్ని తాకుతోంది. ఆ వెలుతురులో అతను దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. అర్ధరాత్రి సమయంలో, పరపురుషుడి ప్రక్కన కూర్చుని, ఇలా సంభాషించేందుకు ముందుగానే తయారుగా ఉన్న నికీకి అదేమీ వింతగా అనిపించలేదు.

మొట్టమొదటిసారిగా, ఆమె పాపిట్లో సిందూరం అద్దుకోలేదు. నుదుట బొట్టు పెట్టుకోలేదు. మంగళ సూత్రం తీసి, డ్రాయర్లో పడేసింది. గాజులు బీరువాలో.. ఆమె తన నెత్తిమీదనుంచి ఒక పెద్ద భారం దించినట్టు ఫీలవుతోంది. ఆరేళ్ళుగా, మౌనంగా తాననుభవిస్తున్న బందిఖానాకి స్వస్తి చెప్పాలని నిర్ణయించుకుంది. గత ఆరు నెలలుగా పక్కింటికి వచ్చి, కాపురముంటున్న మిస్టర్ సహానీ మీద ఆమె అర్జున నేత్రం కేంద్రీకరించింది. ఓర చూపులు, చిరునవ్వులు, ఇచ్చి పుచ్చుకోవడాలూ, 'హాయ్ హలో'లూ ఉబుసుపోక కబుర్లు ఇలా అంకురించిన స్నేహం దిన దిన ప్రవర్ధమానమై, ఇదుగో ఈనాటికి పండబోతోందిలా.

"ఇదుగో ఈ కృష్ణ - రాధల ఓహ్ ఐయామ్ సారీ రాధా కృష్ణుల సుపర్బ్ పెయింటింగ్సు ఉన్న పుస్తకం. అర్ధరాత్రి సమయంలో, కొలను ఒడ్డున, అర్ధనగ్నంగా రాధ, ఆమె ననునయిస్తూ కృష్ణుడు. రాసక్రీడలో గోప, గోపికలు,మధ్యలో విరాజమానులై రాధాకృష్ణులు, ఈ ప్రపంచాన్నే విస్మరించి వారిలోకంలో "ఇలా అంటూ, అతనామెకు మరింత దగ్గరగా జరిగి, పెదవుల మీద ముద్దుపెట్టుకుంటూ, "ఐ లవ్ యూ నికీ డు యూ లవ్ మి?" అని అడిగాడు.

"యస్. ఐ లవ్డ్ యూ ఎట్ ఫస్ట్ సైట్" ఆమె అతనిపైకి ఒరిగిపోతూ అంది.

"ఇక్కడ బాగోదు"

"బెడ్రూమ్"

తెల్లవారు ఝామునే లేచి, మిస్టర్ సహానీ బంగ్లా నెం.121లోకి వచ్చేశాడు. నికీ ఇంకా నిద్రపోతూనే ఉంది. నిబిడాంధకారంలో, సొరంగంలోంచి, పెద్దరొద చేసుకుంటూ దూసుకు వెళ్ళిపోయింది రైలు. అడ్డంకులు, చింత, భయాందోళనలు, మానసిక పీడనం అన్నీ దూరమయ్యాయి. బాహాటంగా పచ్చని వృక్షజాలల మధ్యనుంచి రైలు పరుగెత్తుతోంది. పిల్లగాలి, తేలికైన జుత్తుని ఎగరగొడుతోంది. నికీ కళ్ళు తెరుచుకున్నాయి. ఆమెకు చాలా ఆనందంగా ఉంది. నిషేధ్ బెడ్రూం తాళం తెరిచింది. వాడు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ఆ నిష్కల్మషమైన ముఖాన్ని చూసి ఆమె అనుకుంది' ఈ నిషేధ్ ఎంత్ అందంగా ఉన్నాడు. అచ్చం నా పోలికే. ఇక వీడు ఆనందంగా బతకగలడు.'

●●●

"నువ్వు అష్టమి నాడే ఊరికెందుకు వెళ్ళడం? అదంత అవసరమా?" ఆమె మాటలు గాలిలో కలిసిపోయినట్టున్నాయి.

"నేను వెళ్ళక తప్పదు. రేపు మధ్యాహ్నానికల్లా వచ్చేస్తాను."

నికీ కళ్ళలో ముంచుకొచ్చిన కన్నీళ్ళు, ప్రకటించలేని రోషం. అన్నిటినీ తృణీకరించి సునీల్ వెళ్ళిపోయాడు. వివాహం అయినప్పటి నుంచీ క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరమూ ఆరునూరైనా కృష్ణాష్టమికి ఆ ఊరు వెళ్ళితీరాల్సిందే అతనలా వెళుతూనే ఉన్నాడు.

ఆ పల్లెటూళ్ళో, పల్లెటూరి పిల్ల రోమా తయారు చేసిన రుచికరమైన వంటకాలు తింటేగాని తోచదతనికి. పొలంలో పచ్చి పచ్చిగా ఉన్న బొప్పాసకాయలు కోస్తాడు "అవింకా పచ్చిగా ఉన్నాయి. కోసేశావేం?" అని మందలిస్తుంది ముసలి తల్లి. సునీల్‌కి కోపం వచ్చి, ఓ కాయ తీసుకుని దానిమీద గోటితో నాటు పెడతాడు. తెల్లని పాలలాంటి ద్రవం ఉబికి వస్తుంది. దాన్నతను చేత్తో తుడిచి పారేస్తాడు.

ప్రతీ సంవత్సరం, అష్టమికి పదిపదిహేనురోజులు ముందు నుంచీ, సునీల్‌ని ఎలాగైనా ప్రయాణం నుంచి విముఖుడిని చేయాలని తన ప్రయత్నం తను చేస్తూ ఉంటుంది నికీ. కానీ, సునీల్ ఆ మాయాజాలంలో పడకుండా నేర్పుగా తప్పించుకుంటాడు. తన ప్రయాణం మాత్రం మానుకోడు. అష్టమి వెళ్ళిన మర్నాడు అతనింటికి తిరిగి వస్తాడు. అలవాటుగా నికీ రాత్రివరకూ కోపంగానే ఉంటుంది. సునీల్‌తో మాట్లాడదు. అతన్ని దగ్గర చేరనీయదు. తరువాత గాలివాన సద్దుమణుగుతుంది. వాతావరణం చల్లబడుతుంది. ఈ విషయంలో సునీల్ సిద్ధహస్తుడు. ఇంకేముంది? పరిస్థితి యధాతథం.

ఊళ్ళో..

ఏదో ఆలోచిస్తూ, బొప్పాసకాయమీద నెమ్మదిగా చేత్తో రాస్తున్న అతని చూపు రోమా మీద పడింది. అతని చేయి ఆగిపోయింది. అతని మనసు, వ్రేళ్ళ చివరి వరకూ వచ్చి అక్కడాగిపోయింది. సున్నితమైన మార్దవం నింపిన మత్తులాంటిది అతన్నావరించింది.

వివాహానికి ముందురోజు రాత్రి, సునీల్ తనని తాను రోమాకి అప్పగించుకున్నాడు. వెన్నల రాత్రిలో, ఆ పల్లెటూళ్ళో, చెరుకు తోట మధ్యలో, కొన్ని క్షణాల ఆనందం అతనలా సొంతం చేసుకున్నాడు.

"నీ పెళ్ళై, పెళ్ళాంవచ్చాక నువ్వు నన్ను మరిచిపోవుకదా"

"నువ్వు నా రాధవి. నిన్నెప్పుడూ మరిచిపోను."

"నేను నీ రాధనే కదా"

"అవును. అవును. అందుకు సందేహమా" అంటూ సునీల్ రోమని తనపైకిలాక్కున్నాడు.

"అయితే, ప్రతీ అష్టమి రాత్రీనాది. నువ్వు నా వాడిగానే ఉండాలి. నేను బ్రతికి ఉన్నంతకాలం"

"నీ మీద ఒట్టు. ఇదే నా ప్రమాణం."

"ఇదిగో ఇది నీ పెళ్ళికి నా బహుమతి" అంటూ రోమా అతనిపై వాలిపోయింది.

వివాహం తరువాత, సునీల్ ఆడినమాట తప్పకుండా ప్రతీ అష్టమీ, ఆ ఊళ్ళోనే ఆమె సరసన గడుపుతున్నాడు.

సునీల్ అప్పుడప్పుడూ ఆ రోజు నెమరవేసుకుంటూ ఉంటాడు. ఆ రోజు, తన వదినగారు, కేవలం తన 'రోమా'గా మారిన రోజు. ఇంటరు సైన్సు పరీక్షలై అతను హాయిగా ఊపిరి పీల్చుకున్న రోజు. ఓ స్నేహితుని ఇంట్లో టి.వీలో శకుంతలా దుష్యంతుల గాంధర్వ వివాహం సినిమా చూసి, మంచులా నీరుగారిపోయాడతను. అది మధ్యలో ఆపుచేసి, ఆ మిత్రుడతన్ని, రాకేశ్ ఇంటికి లాక్కుపోయాడు. అక్కడ గదితలుపులన్నీ మూసేసుకుని కుర్రకారంతా గుంపుగా చేరి సీ.డీ చూశారు. అదొక బ్లూ ఫిల్మ్. అలా దేన్నంటారోఅతనికి కాలేజీలోనే తెలుసు. ఫిల్మ్ పూర్తయ్యింది. అతని శరీరం అంతా లావా ప్రవహిస్తున్నట్టు వేడిగా అయిపోతోంది. అతనిప్పుడు నివురు గప్పిన నిప్పులా ఉన్నాడు.

అన్నయ్య ప్రొద్దుటే ఏదో పనిమీద, 'వాంసదా' వెళ్ళాడు. అమ్మానాన్నా అక్క అత్తారింటికి చుట్టరికానికి వెళ్ళారు. బజారు కెళ్ళడానికి వదిన బీరువాలోంచి, చీరా, జాకెట్టూ తీసి కట్టుకుంటోంది. గది తలుపులు వేసిలేవు. సునీల్ అలానే నిలబడి చూస్తున్నాడు.

అతని హృదయంలో అసంఖ్యాకమైన అశ్వాలు దౌడు తీస్తున్నాయి. టబక్..టబక్..టబక్ ఉడుకు రక్తం పొంగి పొరులుతోంది. సునీల్ ఓ గుర్రాన్నెక్కాడు. అది అతని అదుపాజ్ఞల్లో లేదు. అడ్డూ ఆపూ లేకుండా అతను పయనిస్తున్నాడు. అతనేం చేస్తున్నాడో అతనికే తెలియని స్థితి.

"చాలు. ఇక చాలు. సునీల్ వదిలిపెట్టు. పిచ్చిగానీ ఎక్కిందా ఏమిటి?"

నిజంగానే సునీల్ పిచ్చివాడయ్యాడు. మొదటిసారిగా వదినని, 'వదినా' అని కాకుండా, 'రోమా' అని పిలుస్తూ తమకంతో ఒళ్ళంతా ముద్దుపెట్టుకున్నాడు.

ఆ తరువాత ప్రపంచం కన్నుగప్పి వారిద్దరూ ఇంటా, బయటా, పొలంలో, తోటల్లో ఎక్కడ పడితే అక్కడ జీవితాన్ని అనుభవించి, ఆనందించసాగారు.

ముగ్గురు సంతానాన్ని కని, పెంచి ముసలి వయసులో ఉన్న తల్లి ఆ విషయం పసికట్టనే కట్టింది. ఓ రోజు మధ్యాహ్నం రోమా గదిలోంచి వస్తూండగా, చిందరవందరగా ఉన్న జుత్తుమీద, ముళ్ళకంపలాంటి ఆమె దృష్టి పడింది. ఆ వెనుకనే గదిలోంచి పిల్లిలా బైటపడిన సునీల్ కూడా ఆమె కంటపడ్డాడు.

అయినా, తల్లి ప్రపంచం పోకడ బాగా అర్థం చేసుకున్న మనిషి. ఈ ఇంట్లోనే 'రతూకాకా' వస్తూ పోతూ ఉండడం పరిపాటి. కాలిలో గుచ్చుకుని, కలుక్కుమంటున్న ముల్లుని, సునీల్ సేఫ్టీ పిన్నుతో కెలికి, బైటికి తీయబోయాడు. కానీ, ఆ తుమ్మముల్లు ఇంకా లోతుల్లోకి పోయి, మరింత బాధించసాగింది. సందు, గొందుల్లోనూ, ఊళ్ళో అమ్మలక్కలు కలుసుకునే నీలాటి రేవులోనూ, సూటిపోటీ మాటలు వినబడుతూనే ఉండేవి. రేఖా పిన్నమ్మ అయితే ఓ చిన్న సైజు పంచాయితీయే పెట్టేది. "నాకు తెలిసినంత మీలో ఎవరికీ ఏమీ తెలియదు. అసలనవలసింది సునీల్ తండ్రిని. పెళ్ళయిన తరువాత పదేళ్ళు సునీల్ తల్లి కన్యగానే ఉండిపోయింది. ఆఖరికెలాగో, రతూకాకా తారసపడ్డాడు. ఆమె జీవితంలో సుఖపడింది. ఎవరి అదృష్టం వారిది. పాపం రతూకాకా భార్య అయితే గొడ్రాలుగానే పోయింది. కానీ, ఇక్కడ ముగ్గురేసి సంతానం. అందుకే, ఆ తల్లి రతూకాకానే భర్తగా భావించింది. అతను మాత్రం పరాయివాడా ఏమిటి? స్వంత మరిదే కదా! ఇంకా మీకు నమ్మకం కుదరడంలేదా? చూడండి. ఆ పెద్దకొడుకు రూపు రేఖలు ముమ్మూర్తులా రతూకాకాని పోలిలేవూ? ఈ సునీల్ .. వీడు అద్దంలో మొహం చూసుకుని రతూకాకాతో పోల్చుకుంటూ ఉండడూ?"

సునీల్, రోమాల ఉదంతం అలాగే రహస్యంగానే సాగుతోంది. అతను ఎమ్.ఎస్సీ. చేసి, వై.సి.వై.సి.వై బేంకులో ఆఫీసరయ్యాడు. మహిళా కాలేజీలో చదువుకున్న నవనాగరిక యువతితో వివాహం అయింది. ఉద్యోగరీత్యా ఊరు వదిలిపెట్టి, సూరత్‌లో కాపురం పెట్టవలసి వచ్చింది.

పెళ్ళయిన కొత్తలోనే, సునీల్‌కి ఇష్టమైన పదార్థాలు వండడం, అతని భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, ఇత్యాది విషయాల్లో వదినగారు అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో ఆసక్తి కనపరచడం గ్రహించింది కొత్త పెళ్ళికూతురు నికీ.

అంతే కాదు ఆమెకు నచ్చనివి ఇంకా చాలా ఉన్నాయి. పళ్ళరసాలో, పాలో ఇచ్చే నెపం మీద బెడ్రూములోకి వదినగారు చొచ్చుకు రావడం, సునీల్ ఆమెను 'వదినా' అని కాకుండా పేరు పెట్టి, 'రోమా!' అనిపిలవడం. చదువులోనూ, అందచందాల్లోనూ తనకంటే తీసికట్టే అయిన ఆ పల్లెటూరి వదినకి, సునీల్ అంత ప్రాముఖ్యం ఇవ్వడంలో ఏదో అంతర్యం ఉందని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు నికీకి.

రోజులు గడిచిన కొద్దీ, అవకాశం చిక్కినప్పుడల్లా, ఆ విషయంలో విరోధం ప్రకటించడానికి కూడా ఆమె వెనుకాడలేదు. "ఇలా ఉండుండీ ఆ పల్లెటూరికి పారిపోవడం ఎందుకు? ఆ పల్లెటూరిపిల్ల రోమా దగ్గర ఆధునిక యువతినైన నేనివ్వలేనిదేముంది? అందమా? ఆనందమా?"

అటువంటి సమయంలో కోపంతో మండిపడేవాడు. రోమా విషయంలో నికీ ఈ విధంగా ఎలా మాట్లాడగలదు? అసలు రోమాకూ ఈమెకూ పోలికే లేదు. నికీ చదువుకున్నదయితే కావచ్చు. కానీ, రోమా రోమాయే! ఆమె ముందు ఈమె దిగదుడుపే. తన భావాలని తనలోనే అదిమి పెట్టుకుని, సునీల్ పైకి అనేవాడు. ''నువ్వు అనవసరంగా అనుమానిస్తున్నావు. అక్కడ నా తల్లితండ్రులు కూడా ఉన్నారు. వాళ్ళకోసమైనా వెళ్ళాలి కదా. నువ్వూ నాతో రావచ్చు. కానీ, నీకా పల్లెటూరి వాతావరణం నచ్చదు. చక్కగా పారే నదీ, ఆ నది ఒడ్డున దేవాలయం, ఆ దేముడి పూజలూ ఇవన్నీ నీకు కిట్టవు.''

''అవునవును. ఆ పూజల్లో రోమా కూడా భాగస్తురాలే. అదే, మీ వదినగారు.''

''భగవంతుడు, భజనల విషయంలో కూడా నువ్వెంత నీచంగా ఆలోచిస్తావు''

చినికి చినికి గాలివాన అవుతుంది. ఆ రాత్రి సునీల్ నికీని నానా మాటలూ అంటాడు.

ఏమయితేనేం. సునీల్ ఆడే నాటకం అర్థం చేసుకోలేనంత తెలివి తక్కువదికాదు నికీ. నిషేధ్ అయిదేళ్ళవాడయ్యాడు. ఇంతవరకూ నడిచినదంతా ముళ్ళదారే అయింది. నికీలో ప్రతీకార వాంఛ చెలరేగుతోంది. తగిన అదనుకోసం ఎదురు చూస్తోంది. రిస్క్ తీసుకునేందుకు వీలులేదు. ఏ మాత్రం తొందరపాటు పనికిరాదు. అలాగని ఉపేక్షించి కూర్చోవడమూ సమంజసం కాదు. అది అతనికి మరింత అలుసు అవుతుంది. తాను ఇరవై ఒకటో శతాబ్దపు మహిళ. సతీ సావిత్రి ఏమీకాదు. తప్పుదారి పట్టిన భర్తకి బుద్ధిచెప్పాలి. ఎంతకాలమని ఇలా మొసాన్ని మనసులోనే దిగమింగుకుని, బ్రతకడం? మోసాన్ని మోసంతోనే తెగనరకాలి. నికీ గాఢనిద్రలోంచి మేల్కొంది. ఎప్పుడు సమయమూ సందర్భమూ కలిసి వస్తుందా అని ఆతురతతో ఎదురు చూడసాగింది. అటువంటి వ్యాకుల భరిత వాతావరణం ఆవరించి ఉన్న రోజుల్లోనే, మిస్టర్ సహానీ పక్కింటిలోకి కాపురానికి రావడం జరిగింది. వస్తూపోతూ ఉన్న సమయాల్లో ఏదో మిషమీద పలకరించుకోవడం, పరిచయం పెరగడంతో, ఆమె అతనివైపు ఆకర్షితురాలైంది.

సునీల్ ఆలోచనల్లో మునిగి తేలుతూ, మెట్లెక్కుతున్నాడు. 'ఈ స్త్రీ జాతే అంత. రాత్రి దారి తప్పి దెబ్బలాడినా, తెల్లారి కొంచెం ముద్దుచేసి, మస్కా వేస్తే చాలు నీరుగారిపోతారు. ఎన్నాళ్ళ నుంచి చూడడంలేదు తను ఈ నాటకం?' ఇంట్లో ప్రవేశించగానే ఏడుపు మొహంతో, ఎడమొగం పెట్టుకుని ఎదురయ్యే నికీ రూపాన్ని ఊహించుకుంటున్నాడు సునీల్. కానీ ఆశ్చర్యకరంగా ఆ నికీ ఏమైంది? చక్కని ఎర్రగులాబీలతో అలంకరించిన ఫ్లవర్ వేజ్ టేబులు మీద కళకళలాడుతోంది. పల్చని మేకప్పులో, సుగంధ భరిత శరీరంతో, నవ్వు ముఖంతో, చేతిలో చల్లని మంచినీళ్ళ గ్లాసుతో, ఎదురైంది నికీ, ఆమెలోని ఆ పరవర్తనకి అవాక్కయిన సునీల్ ఆమెనే చూస్తూ నిలబడిపోయాడు.

''ఏంటలా చూస్తున్నావు?'' నికీ ప్రశ్నలో ఆతురత.

సునీల్ మాట్లాడకుండా కూర్చున్నాడు. 'టీ' టైము, రాత్రి భోజనం అన్ని పనులూ హుటాహుటీన సీతాకోక చిలుకలా ఆనందంగా ఎగురుకుంటూ చేసుకుపోతూంది నికీ. ఇక రాత్రి బాకీ ఉంది. ఏదో ఏదో మార్పు వచ్చింది. ఏంటది? ఏమై ఉంటుంది? ప్రళయానికిదొక నాంది కాదుగదా? ఆలోచనలో పడ్డాడు సునీల్.

నిషేద్ నిద్రపోయాడు. సునీల్ అతి ప్రేమగా నికీని పిల్చాడు. ''నికీ పడుకుందాం.రా''


''రేపు ఆదివారం కదా! ఇంత వేగంగా నిద్రపోయే మూడ్ లేదు నాకు. ఇదుగో ఈ 'మర్డర్' సినిమా చూస్తాను. నువ్వు చూసే ఉంటావు దీన్ని. ఎంతకాలమైందో, నేను పూర్తి సినిమా చూసి ఇవ్వాళ పూర్తిగా చూద్దామని ఉంది.''

సునీల్ చికాకుగా లేచినిలబడ్డాడు. నికీ, టీపాయ్ మీద ఉన్న పుస్తకాన్ని అతనికి వ్రేలితో చూపిస్తూ అంది. ''నిన్న మిసెస్ శర్మ ఇంట్లో 'ఝూలాదర్శన్' పూజలో అందరికీ పంచారు దీన్ని. అద్భుతమైన పెయింటింగ్సు. ఎంత బాగున్నాయో రాధాకృష్ణుల ప్రేమోదంతం''

సునీల్ చింతాక్రాంత హృదయంతో, బెడ్ రూములో కూర్చుని, నికీ కోసం ఎదురు చూస్తున్నాడు. అతని ధ్యాస పుస్తకం మీదికి మళ్ళింది. దాన్నతడు టేబులు మీదికి విసిరి కొట్టాడు. ఆ చప్పుడు సినిమా చేసే రొదలో విలీనం అయిపోయి, నికీకి వినిపించడంలేదు.

చెల్లా చెదురైన పేజీల్లో ఊయలలూగుతున్న రాధాకృష్ణుల పెయింటింగు.

దాన్ని స్థబ్దుడై చూస్తున్నాడు సునీల్.



# అనువాద కథలు

## - పాలెపు బుచ్చిరాజు



## అసంతృప్తికి అసలు కారణం గుజరాతీ మూలం: హిమాంశీ శేలత్

**ఇవ్వాళ్టిలాగానే ఆరోజు కూడా పెద్ద వర్షం.** ప్రొద్దుటినుంచే నల్లని మేఘాలు ఆకాశాన్నావరించేశాయి. ఉన్నట్టుండి ఇల్లెగిరిపోయేఅట్టు గాలితో, వర్షం ఆరంభం అయింది. ఆధాటికి భూదేవత తట్టుకోలేక పోతూంది. తను అన్నదమ్ములిద్దరితోనూ బడికి వెళ్ళింది. కానీ, బడికి సెలవివ్వడంతో, తిరుగు టపాలో, నఖశిఖ పర్యంతం తడిసిపోయి, ఇంటికి వచ్చారు ముగ్గురూ.

"నేను ముందరే చెప్పాను. ఈ రోజు పిల్లల్ని బడికి పంపొద్దూ, ఒకనాడు చదువుపోతే కొంపేం మునిగిపోయిందని. కానీ, వింటేగా! ఇంత పెద్ద వర్షంలో పిల్లలెలా తడిసిపోయారో!" నాన్నగారి మీద అమ్మ విరుచుకుపడింది. తరవాత తులసి, పుదీనా వేసి, వేడివేడిగా 'టీ' ఇచ్చి, దానితో బాటు మరమరాలు వేయించి పెట్టింది వారికి. పొడి తువ్వాలుతో తలలు బాగా ఆరేవరకు తుడిచింది. 'నీరు బుర్రలోకి ఇంకిపోతే జలుబు చేస్తుం'దంటూ. సాయంత్రందాకా వర్షం ఆగకుండా పడుతూనే ఉంది. గోడలన్నీ తడిసి చెమ్మగిల్లాయి. అయినా ఇంటిలోపల మాత్రం వెచ్చగనే ఉంది. ఆ చల్లదనంలోనే అదొకలాంటి వెచ్చదనం.

తను భరత్, నయన్‌ల వెనకాలే తిరుగుతూంది. ఇంట్లోకీ, బైటికీ, డాబామీంచి నేలమీద పడే నీళ్ళు తూలి మొహాలమీద తుంపర్లు పడుతున్నాయి. భరత్, నయన్‌లు చేసిన కాగితపు పడవలు వర్షపు నీటిలో మునిగి తేలి కొట్టుకుపోతున్నాయి. నాన్నగారికిదేమీ పట్టదు. ప్రశాంతంగా కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. రాత్రి భోజనానికి అమ్మ ఉల్లిపాయలు వేసి, వేడివేడిగా కిచడీ తయారు చేస్తోంది. అదీ గతంలో..!

ప్రస్తుతం అమ్మ భరత్ నయన్‌లతోనే ఉంటుంది. తన ఇంటికి రమ్మన్నారాదు. 'ఆడపిల్ల ఇంట్లో స్థిరంగా ఉండిపోకూడదు' అంటుంది.

కానీ, తను అసలు పెళ్ళే చేసుకోలేదు కదా! మొగపిల్లాడిలాగానే ఉద్యోగం చేస్తోంది. స్వంత ఇల్లు, అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. అయినప్పుడు వచ్చి ఉండడానికేం? అయినా ఆమె వప్పుకోదు. దానికామె వెయ్యికారణాలు చెప్తుతుంది. భరత్ పిల్లల్ని ఎవరు చూస్తారు? నయన్ ఆరోగ్యం అసలు బాగుండదు. నాన్నగారికి అక్కడి వాతావరణం సరిపడదు. ఇలా ఎన్నో కుంటిసాకులు ఆమె దగ్గరగ తయారుగా ఉంటాయి. అమ్మ ఎప్పుడూ కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ మాట్లాడదు.

భరత్, నయన్‌ల విషయం వేరు. వారిద్దరూ ఎవరి సంసారం, కష్టాల్లో వారు మునిగి తేలుతూంటారు. అమ్మ బాగోగులు కనుక్కునే టైము వారికుండదు.. మనుమలు, టీ నూని, వాసవ్‌నీ పడుకోబెట్టి వారికి రాకుమార్తె, రాక్షసుడూ కథలు చెప్తుతూ, హాయిగా ప్రశాంతంగా కాలం గడిపేస్తూందమె.

'నాకింతకంటే ఏం కావాలి? దైవచింతన, ఈ బాలగోపాల సేవ చేయడం తప్పిస్తే! నీ దగ్గరైతే, నువ్వు ఆఫీసు కెళ్ళిపోతే, ఇంట్లో ఒక్కర్తినీ దెయ్యంలా కూర్చుని ఏం చేసేది?' అంటుందామె. అయినా భర్త, నయన్‌లతో ఉంటే మాత్రం ఆమెకు కాలం ఎలా గడుస్తుంది? వాళ్ళైతే ఈమెనసలు పట్టించుకోరు. అమ్మనెలా... తన ఆలోచనలు మళ్ళీ గతంలోకి దారితీశాయి.

ఆ రోజు మధ్యాహ్నం కూడా వర్షం కుండపోతగా పడుతోంది. ఉదయం మాత్రం కొంచెంసేపు మబ్బులు విడి, కొంచెంసేపు ఆకాశంలో కరిగిన బంగారంలా ఎండకాసింది. మళ్ళీ నల్లటి మేఘాలు కమ్మేశాయి. "బృందా! బైట ఆరేసిన బట్టలు లోపలికి తీసుకొచ్చేయ్. మళ్ళీ పెద్దవాన పడేట్టుగా ఉంది."

అమ్మ మాటవిని తను పెరట్లోకి వెళ్ళింది. దండెంపైన గాలికి రెపరెపలాడుతున్న బట్టలన్నీ పోగుచేసింది. వాటిని తెచ్చి లోపలపడేసింది.

అమ్మ పాత బీరువా ఒకటి తెరచి కూచుంది. పచ్చపచ్చగా పాలిపోయిన పాత ఫోటోలు, సంవత్సరల తరబడి మూటలు కట్టి, నిలవ వాసన వేస్తున్న పాతబట్టలు, తుప్పుపట్టిన డబ్బాలు, పెళ్ళిళ్ళలో బంధువులిచ్చిన బహుమతులు, వస్తువుల చిత్రాలు, చిరిగిపోయిన పాత డైరీలు, శుభాశుభ కార్యక్రమాలకి బజారునుంచి తెప్పించిన వస్తువుల వివరాలు, అలుక్కుపోయిన అక్షరాలతో ఉన్న పాత ఉత్తరాలు, ఇవన్నీ చూస్తూ, ఆమె ప్రపంచాన్ని మరిచిపోయి అక్కడే కూర్చుని ఉండిపోయింది.

ఆ వస్తువుల్లో రెండు మూడు పుస్తకాలు కూడా బైటపడ్డాయి. ఎప్పుడో బాపూజీ చదువుకున్నప్పటివై ఉండాలి. షేక్స్పియరు నాటకాలు కూడా - రోమియో - జూలియెట్, హేమ్లెట్ వగైరా. తను యధలాపంగా ఆ పుస్తకం తిరగేసింది. వాటిలోంచి ఒక చిన్న ఫోటో ఒకటి జారి క్రిందపడింది. ఒక అపరిచిత, అతిసుందరమైన స్వరూపం తనవైపు చిరునవ్వుతో చూస్తోంది. ఇంత అందమైన రూపం ఈ కుటుంబంలోకి ఎవరు వచ్చి ఉంటారబ్బా?! బహుశా అమ్మకు తెలిసి ఉంటుంది అనుకుంటూ, ఆఫోటోని అమ్మకి చూపించి," ఈ ఫోటోలో ఉన్నదెవరో ఎరుగుదువా?" అని అడిగింది.

అప్పటికే అమ్మ చేతిలో ఉన్నపట్టుపంచె తనకి చూపిస్తూ, "ఈ ఉత్తరీయం మీ బాపూజీ పెళ్ళినాటిది. ఇంకా ఎంతబాగా ఉందో చూశావా?" అని, అంతలోనే తన చేతిలో ఉన్న ఫోటో చూసి అవాక్కయింది.

"ఇదెవరో నీకు తెలియదా?" ఎవరో అపరిచితురాలిదై ఉంటుందనుకుంది తను. అమ్మ దగ్గరనుంచి సమాధానం లేకపోవడంతో.

ఆ క్షణంలో ఆ రహస్యం విప్పే పూర్తి అవకాశం అమ్మ చేతిలో ఉంది. 'ఆ ఫోటో ఎవరిదో నాకు తెలియ'దంటే, విషయం అక్కడితో ముగిసిపోయేది. కాని అమ్మ అలా చేయలేకపోయింది. ఎన్నేళ్ళుగానో, మనసు పొరల్లో దాచిపెట్టుకున్న ఆ విషయం ఇప్పుడు బైటపెట్టడం భావ్యం అనిపించి ఉంటుంది అమ్మకి. అందుకే ఆమె ఏమాత్రం సందేహించకుండా, నిశ్చలంగా నిలకడగా చెప్పింది.

"ఇది పుష్ప ఫోటో, మీ బాపూజీకి ఈమెతో పెళ్ళికావలసింది. ఇంట్లో అంతా గోలగోల అయింది. పిచ్చి పిచ్చిగా దెబ్బలాడుకున్నారు. కానీ, మీ తాతగారు మాత్రం పెళ్ళికి ససేమిరా అంగీకరించలేదు. ఉండొచ్చు. ఏదో కారణం. బలవత్తరమైనదే కావచ్చు. కానీ, ఆయన కాదంటే కాదు. అంతే! అదే ఆఖరిమాట" తను అమ్మచెప్పే మాటలు స్థబ్దురాలై వింటూ ఉండిపోయింది.

"నేనంటే ఇష్టంలేని వాడికి భార్యనై, పిల్లల్ని కనే యంత్రంగా మారిపోయి, జీవితంలో సుఖపడలేనని నాకు బాగా తెలుసు. ఈ విషయంలో కుటుంబంలో చాలా రాద్ధాంతం జరిగింది. బ్రతికినంతకాలం అసంతృప్తితో గడపాలి. అప్పుడప్పుడూ ఇల్లొదిలి పారిపోయి, సన్యాసుల్లో కలిసిపోదామనిపించేది ఆ రోజుల్లో. కానీ, తరువాత్తరవాత, భరత్ పుట్టాక.." అమ్మ మాటలు తడబడుతున్నాయి.

"అప్పట్లో నువ్వు పుట్టినప్పుడు ఎంత క్లేశం అనుభవించానంటే" అమ్మనోరు మరి మాటలు రాలేదు. తను మరింకేమీ అడగలేదు కూడా. అనుకోకుండా ఎండలో మండిపోతున్న ఇసుకలో కాళ్ళు పెట్టినట్టయింది.

"తలుపులు మూసెయ్! ఇల్లంతా తడిసిపోతోంది" తను తలుపులు మూయడానికి వెళ్ళింది. బైటకి చూస్తే, మేఘాలు కమ్మిన ఆకాశం, మేఘాలు కమ్మిన ఆకాశం, ప్రపంచమంతా అంధకారంలో మునిగి ఉంది.

ఆ వర్షం కురిసిన మధ్యాహ్నం తరువాత, జీవితంలో అనుకోని మార్పువచ్చింది. ఆ రోజు మొదలు, ఏనాడూ కళ్ళలో కళ్ళు పెట్టి, తిన్నగా తనవైపు చూస్తూ, అమ్మ  తనతో మాట్లాడలేదు. ఏదో విషయంలో భయం భయంగా ఉండేది. ఎదో చెప్పాలని అనుకుని, చెప్పలేకపోయేది. ఆమె ఎందుకు బయపడుతోందో, ఆ విషయం ఎప్పుడూ బైటికి చెప్పదని తనకు తెలుసు. బాపూజీ పుష్పని వివాహం చేసుకోలేదన్న విషయం మాత్రం వాస్తవం. కానీ భరత్, నయన్, తాను ఈ ప్రపంచంలోకి ఎలా వచ్చినట్టు? అసందర్భమైన వేళలో అనాహూతంగా వచ్చిన అతిధులువారు. అక్కరలేదనుకున్నా కంఠానికి చుట్టుకున్న ఉరితాళ్ళు, కావాలని భగవంతుడిని కోరుకుంటే వచ్చిన భాగ్యం కాదది. గాఢమైన అసంతృప్తి అనే పొలంలో అసూయాద్వేషాలనే విషం పోసి నాటిన విత్తనాలవి. అమ్మమాటే చెల్లి ఉంటే ఎప్పుడో వాటిని మొక్కలోనే త్రుంచివేసి ఉండేది. తప్పించుకోలేని అసహాయతలేవో ఆమెను బంధించి ఉండాలి. ఆ కారణంగానే, భరత్, నయన్, విషపు పురుగులా తానూ, ఇక్కడ పెరిగిపెద్దవారయ్యారు.

భరత్, నయన్‌లకీ విషయం అర్థంకాదు. భరత్‌కి చిన్నప్పటినుంచీ డబ్బు పిచ్చి. అతనికెప్పుడూ సంపాదనమీదే దృష్టి. నయన్ క్రొత్తగా కేతకితోనే అతని ప్రపంచం ఆరంభమూ, అంతమూను. ఇంటి విషయాలు వాళ్ళకేమీ పట్టవు.

అమ్మ ఈ ముగ్గురి భారాన్నీ తప్పనిసరిగా భరిస్తోంది. అందరికంటే తనే ఆమెకెక్కువ భారమై ఉండొచ్చు. ఎందుకంటే, తను అందరికంటే చిన్నది. అమ్మకి సుతారమూ ఇష్టంలేకుండా పుట్టింది. అయిష్టంగానే పెంచవలసి వచ్చింది. ఈ అయిష్టపు విషాన్ని తను రక్తంలో జీర్ణించుకునే పుట్టింది. పుడుతూనే, ఏడుస్తూ పుట్టి ఉంటుంది. ఆ ఏడిచే పిల్లని ఎంత నిరాసక్తంగా చూసిందో అమ్మ అప్పుడు.

ఏమీ అర్థంకానట్టున్నా, ఒక్కొక్కటీ ఇప్పుడు అర్థం అవుతున్నట్టనిపిస్తోంది. రహస్యం మంచు విడినట్టు విడిపోతోంది. బాపూజీ ఎదుట అమ్మ మౌనవ్రతాలూ, ఇంటిలో ఉదాసీన వాతావరణం, బాపూజీ అంటే ఒకవిధమైన తిరస్కారభావం, అప్పుడప్పుడూ చిన్న చిన్న స్వగతాల్లోంచీ వెలువడే క్రోధం. అందుకే ఆనాటి వర్షపురాత్రి తన మనసులో తిష్ట వేసుక్కూచుంది.

ఇంత జరిగినా అమ్మ పిల్లల పెంపకంలో లోటు చేయలేదు. పాపం ఇందులో వాళ్ళ దోషమేముందనే భావనతోనో ఏమో! ప్రళయం వచ్చి, ప్రపంచం అంతా మునిగిపోయినా పోవచ్చు. కానీ తన ఇల్లు మాత్రం ఇలా సురక్షితంగానే ఉంటుంది. వెచ్చగా సుఖంలో తేలుతూ, ధైర్యంగా పడిలేస్తూ నుదుటిమీద అమ్మ చేతివ్రేళ్ళు సుతారంగా రాస్తూ, చేతిలో సుగంధాన్ని వెదజల్లే మల్లెపూలు, కళ్ళలోనూ, బుగ్గలమీదా చలల్ని నీళ్ళు, పరిపూర్ణ సుఖాన్నిచ్చే ఆ క్షణం తనను ఆప్యాయంగా కౌగలించుకుంది. దానితో, ఆకాశంలోని మేఘంలా తన మనసు తాజాగా అయిపోయింది.

ఈ రోజు కూడా అప్పటిలాగే, ఎడతెరిపిలేని వర్షం. ఇంట్లో ఫోను పనిచేయడం లేదు. ఎవరో తెలిసిన వారికి ఫోను చేసి, తన ఎడ్రసూ, వివరాలూ ఇచ్చి, వార్త అందేట్టు చేశాడు నయన్. డోర్ బెల్ మ్రోగడం విని, 'ఇంత వర్షంలో ఎవరు వచ్చి ఉంటారబ్బా!' అని ఆశ్చర్యపడిందామె ముందుగా. తడిసి నీళ్ళు కారుతున్న గొడుకు ప్రక్కనపెట్టి, ఆ వచ్చిన అపరిచితుడు విషయం చెప్పాడు.

ఆ సందేశంలో ఏమీ సందేహంలేదు. ఇలాంటి విషయాల్లో నయన్ చాలా స్పష్టంగా ఉంటాడు. తిన్నని వార్త. 'అమ్మ ఈ ఉదయమే పోయింది. మధ్యాహ్నం తీసుకెళ్ళాలి. నీకోసం ఎదురు చూస్తున్నాం' - అమ్మ ఎన్నాళ్ళుగా ఎదురుచూసిందో!

వెంటనే బయలుదేరలి. వాహనాలేవీ దొరికే ఆస్కారంలేదు. ఆలస్యంగానే వెళ్ళింది. అందరూ ఆమె కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. అప్పటికీ, ఇంకా చిన్న చిన్నగా వర్షం పడుతూనే ఉంది.

అమ్మ నేలమీద పడుకునిఉంది. బాపూజీ, నయన్, భరత్‌లు, వదినలు అంతా ఉన్నారు. పెద్దదైపోయింది అమ్మ. పండిన తమలపాకులా ఎవరూ ఎవరికీ ఆశ్వాసనిచ్చే పరిస్థితికాదు. తను నిశ్శబ్దంగా అమ్మ శరీరానికి దగ్గరగా కూర్చుంది. చల్లని శరీరం మీదా, కళ్ళమీదా, బుగ్గలమీదా, చేతితో నిమిరింది. అమ్మ చేతి వ్రేళ్ళు బిగుసుకు పోయినట్టున్నాయి.

"వర్షం ఎక్కువైపోతోంది. తీసుకెళ్ళడం కొంచెం కష్టమే." బాపూజీ బొంగురు గొంతుకతో అన్నారు.

"గంటా, గంటన్నరలో ఆగితే ఫరవాలేదు. లేకపోతే, ఈ పరిస్థితిల్లో, వాహనాలు కూడా రోడ్డుమీద వెళ్ళడం కష్టం" నయన్ అన్నాడు.

"దారంతా నీళ్ళతో నిండి ఉంది. నాలుగురోజుల క్రిందటే నాకు బాగా అనుభవం అయింది. ఎక్కడైనా గోతిలో పడితే వాహనాలు బైటపడడం కష్టం." భరత్.

తరవాత అంతా నిశ్శబ్దం. అంతా అమ్మని తీసుకెళ్ళే అవకాశం కోసం, ఎదురుచూస్తున్నారు.

"కబురు సమయానికి అందింది కదా?" తన దగ్గరిగా వచ్చి, మెల్లగా అడిగాడు భరత్, తను తలూపింది. అంతకుమించి ఏమీ ప్రశ్నించవలసిన అవసరమేలేదు.

"ఏమైంది? ఎలా జరిగింది? అమ్మ ఎప్పుడు లేచింది? ఏం కంప్లైంటు చేసింది? సమయానికి వైద్య సహాయం అందిందా? " లాంటి ప్రశ్నలు ఆమె మనసులో ముసురుతున్నప్పటికీ అడిగి చేసేదేమిటి?

"నీకు రావడానికి బండి దొరికిందా?" బాపూజీ యధాలాపంగా అడిగారు.


ఇది, ఏదో అడగాలని అడిగిన సంబంధం లేని ప్రశ్న. తను, ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్న అమ్మ రూపాన్ని నిశ్చలంగా చూస్తోంది. ఇది అమ్మకి పుట్టినరోజు పండుగ కాకపోవచ్చు. ఆమె ఈ ఇంట్లోకి పిలవక వచ్చిన అతిథి. అయినప్పటికీ వర్షాకాలం ప్రథమ దినాల్లో కొద్ది క్షణాలు మాత్రం పిడికెడు సుఖాన్ని అనుభవించింది అమ్మ.

కారుమేఘాలు ఆకాశాన్ని కమ్ముతూ తిరుగుతున్నటు, ఆ క్షణాల్ని తల్చుకుని, ఆ వాసనల్ని అనుభవించడంలో ఆనందం ఉంది. వాటిలో మల్లెల సువాసన మిళితమై ఉంది. ఆ వేగం, కంటికి కనిపించకుండా మెరుపులా మాయం కావడం, చెట్లమీంచి ధారాపాతంగా కారే వర్షపునీరు, వంటింట్లో నులివెచ్చని వేడిని అనుభవిస్తున్న అమ్మ.

"ఇలారా నీ జుత్తు ఆరబెడతాను. లేకపోతే జలుబు చేస్తుంది" ఆ క్షణాలు మాత్రం నిత్య సత్యాలు. అందులో ఏమీ సందేహం లేదు. ఆ ప్రేమ కృత్రిమం అయి ఉంటే, అమ్మ చేతుల్లో ఆ వెచ్చదనం ఎక్కడినుంచి వస్తుంది? అంతటి సుఖాన్నిచ్చినందుకు అమ్మకి తాను ఋణపడి ఉన్నమాట మాత్రం వాస్తవం. అమ్మకాక మరెవరూ అంతటి ఆనందపు క్షణాల్ని ప్రసాదించలేరు.

చిన్నపిల్లలా ఆమె అమ్మ శరీరాన్ని కౌగలించుకుని ఏడిచింది. ఇంక వర్షాకాలంలో తనని పట్టించుకునే వారెవరూ లేరీ లోకంలో.

●●●



# అనువాద కథలు

**- పాలెపు బుచ్చిరాజు**



## రెండు ముద్దులు

**గుజరాతీ మూలం: సురేశ్ జోషి**

అంజూ ఆ పిచ్చుకని తరిమీ, తరిమీ అలిసిపోయింది. కానీ దానిని మాత్రం గదిలోంచి బైటికి పంపించలేకపోయింది. కిటికీ తలుపు మీంచి కొడితే పంఖా రెక్క మీదికి వచ్చివాలేది. అక్కడి నుంచి కొడితే మళ్ళీ తలుపు మీద వాలేది. బహుశా చీకటి పడిపోతోంది కాబట్టి దానికి దారి తెలియడం లేదేమో. రాత్రంతా ఇలా అది గదిలోనే ఉండిపోతే. ఇంక నిద్రపట్టడం హుళక్కే. అందుకే అంధకారం బాగా ఆవరించే లోపునే దాన్నెలాగైనా బైటికి తగిలేద్దామని అంజూ విశ్వప్రయత్నం చేస్తోంది. కానీ అంతలోనే దానిమీద జాలిపుట్టుకొస్తోంది. పాపం గూడు ఎక్కడో మరిచిపోయిందేమో! అందుకే ఎంత కొట్టినా పోకుండా ఇక్కడిక్కడే తచ్చాడుతోంది.

***

ప్రక్కనే హాలులో , అంజూ తండ్రి , శ్రీపత్ రాయ్ కొంచెం చికాకుగా ఇటూ అటూ పచార్లు చేస్తున్నాడు. కాలేజీకి సెలవులిచ్చారు. ఉదయం లేచిన దగ్గరనుంచీ ఇంట్లో వాతావరణం ఏం బాగులేదు. అంతా అస్తవ్యస్తంగా ఉన్నట్టనిపిస్తోంది. అకారణంగా విసుగూ, విహ్వలతా ఆయన మనసుని కలచి వేస్తున్నాయి.

పరిపరివిధాల పోతున్న మనసుని కట్టిపడేయడానికి, ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. అరగంటలో పది సిగరెట్లు ముట్టించి, సగం తాగీ తాగకుండానూ, విసిరేశాడు. వుడ్ హవుస్ నవల ఒకటి చేతిలోకి తీసుకుని, నాలుగైదు పేజీలు ఇటూ అటూ త్రిప్పి తిరిగి యధాస్థానంలో పెట్టేశాడు. రేడియో స్విచ్ ఆన్ చేశాడు. కానీ ఆ సితారు నాదం కర్ణకఠోరంగా అనిపించింది. దాని నోరు నొక్కేశాడు. ఆఖరికి తన పెంపుడు పిల్లి 'కేట్'ని ఒళ్ళోకి తీసుకున్నాడు. దాన్ని కాస్త బుజ్జగించి గారాం చేశాడు. ఇంతలో ఆ పిల్లికి ఏం అయిడియా వచ్చిందో, ఒక్క దూకు దూకి వరండాలోకి పారిపోయింది. ఇంకేం చేయాలో తోచక శ్రీపత్ రాయ్ మళ్ళీ హాలులో పచార్లు చేయసాగాడు.

శ్రీపత్ రాయ్ భార్య, అంజూకి అమ్మ, మంజూబేన్, గుమ్మానికెదురుగా ఉన్న లైటు స్విచ్ వేసింది. అది వెలగ్గానే, తిరిగి తను చేస్తున్న పనిలో చలించని ఏకాగ్రతతో, నిమగ్నమైపోయింది. ఆమె ఏదో అల్లుతోంది. ఆమె చేతివ్రేళ్ళు అతిలాఘవంగా ఆ పని చేస్తున్నాయి. ఆమె కళ్ళు ఆ వ్రేళ్ళనే చూస్తూ, అదే వేగంతో కదులాడుతున్నాయి. ఆమె అంత దీక్షగా పనిచేయడం శ్రీపత్ రాయ్‌లో చికాకుని మరి కొంచెం రేకెత్తించింది.

***

అంజూ ఆఖరికి అలసిపోయి, పిచ్చుకని వదిలిపెట్టి, ముందున్న ఈజీ ఛెయిర్‌లో కూలబడింది. ఆ మాత్రం వ్యాయామానికే ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి. నుదుటిమీద పట్టిన చిరుచెమటని ఆరబెట్టుకోవడాని కామె చీర చెంగుతో ముఖంపై విసురుకోసాగింది.

ఇంటిముందు పూదోటలో మల్లెలు విరబూశాయి. ప్రక్కనున్న వేపచెట్టు మీంచి సుగంధం నిండినగాలి వీస్తోంది. మరోప్రక్క పూసిన శిరీష వృక్షం మీంచి వచ్చే పవనం మత్తెక్కిస్తోంది.

***

శ్రీపత్ రాయ్ తను కూర్చునే కుర్చీని తలుపు దగ్గరున్న లైటుకి దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు. ఆ ఎలక్ట్రిక్ లైటు వెల్తురులో ప్రకాశిస్తున్న తన భార్య ముఖాకృతిని, తమకంతో తిలకిస్తున్నాడాయన. ఆమెది నిండు శరీరం. యవ్వనంలో కూడా ఆమె శరీరం చాలా ఆకర్షణీయంగా ఉండేది. ఆనాటి యవ్వనవతి, మంజూ శరీరం మీద ఈనాడు మరింత మాంసం, చర్మం లేపనం వేసినట్టుగా ఉంది. ఆమె నడవడిలో లాలిత్యానికి బదులు, ఒక విధమైన గౌరవ భావం చోటుచేసుకుంది. కంఠంలో వార్ధక్యంలో వచ్చే పరుషత తన ప్రభావాన్ని ఇప్పుడిప్పుడే చూపుతోంది.

ఇదంతా ఆలోచిస్తూ, శ్రీపత్ రాయ్ ఆమెను గమనిస్తూండగానే, ఆమె చేతిలోని దారం పుటుక్కున తెగిపోయింది. ఆమె వెంటనే, ఆ దారం కొస నోటిలో పెట్టి తడిచేసి, పురెక్కించి తిరిగి సూదిలో ఎక్కించడానికి ఉద్యుక్తురాలైంది. ఆ దృశ్యం శ్రీపత్ రాయ్‌ని చాలా ఆకర్షించింది. వెనువెంటనే అతని స్మృతిపథంలో ఒక గత సంఘటన మెరిసింది.

వివాహానికి ముందు అతనొకనాడు ఒక మిత్రునితో కలిసి మంజూ ఇంటికి ఇలానే వెళ్ళాడు. అప్పుడు కూడా ఇలాగే మంజూ ఇంటి ముందు ఉయ్యాలలో కూర్చుని, పూలదండ అల్లడం కోసం సూదిలో దారాన్ని ఎక్కిస్తోంది. ఆ తరవాత హారం అల్లుతూ, అల్లుతూ...

శ్రీపత్ రాయ్ తనచేయి నెమ్మదిగా ఆమెవైపు చాపాడు. ఆమె చేతికందేంత దూరంలో లేదు. శ్రీపత్ రాయ్ చేతిని ఇంకొంచెం సాగదీశాడు. అతని చేతి వ్రేళ్ళు వణకసాగాయి. ముంజేతిమీద చెమట బిందువులు అవతరించాయి. అతను చటుక్కున చేయి వెనక్కి లాక్కుని ఆప్రయత్నం విరమించాడు. మంజూ తనకిదేమీ పట్టనట్లు, తన పనిలో నిమగ్నమైపోయింది. ఆ చేతులు అతి లాఘవంగా తిరుగుతూ చేసే అల్లికపని, ఆ సూదినే అనుసరిస్తూ అటూ ఇటూ తిరుగుతున్న ఆమె కళ్ళూ, ఆమె ధ్యాస అంతా చేస్తున్న పనిమీదే ఉంది. శ్రీపత్ రాయ్ ఒక దీర్ఘవిశ్వాసం విడిచి, మంజూ వైపు చూశాడు. ఆమె అలానే నిశ్చలంగా నిర్మలంగా ఉంది. ఆయన కుర్చీ మీంచి లేచి, ఎదురుగా టీపాయ్ మీదున్న కూజాలోని మంచినీళ్ళు గ్లాసులో పోసుకుని త్రాగుతూ, ఆ సుఖాన్ని, రుచిని ఆస్వాదించసాగాడు.

***

పిచ్చుక తను కూర్చునే స్థలం మార్చింది. దానికి చీకట్లో పంఖా రెక్కలు నచ్చినట్టులేదు. ఎగిరి వెళ్ళి బీరువా మీద కూర్చుంది. అంజూ కుర్చీమీద కూర్చునే, బైట క్రమ క్రమంగా అలుముకుంటున్న చీకటిని గమనిస్తోంది. కొంతసేపు అలా ఊరికినే బద్ధకంగా కూర్చునే కంటే, కాస్త సింగారించుకుని కూర్చోవడం మంచిదేమో ననిపించిందామెకు. ఆనంద్ మొట్టమొదటిసారిగా తన ఇంటికి వస్తున్నాడు. అదీ అమ్మా నాన్నల అనుమతితో. కానీ అంతలోనే మళ్ళీ అనిపించింది. ఈ విషయంలో ఇలా ఒక ప్రత్యేకత చూపించడం వల్ల, ప్రతినిత్యం అతను ఇటువంటి ప్రత్యేకతనే ఆపేక్షిస్తాడేమో! అలా ఎందుకు చేయాలి? అతి సాధారణంగానే ప్రవర్తిస్తూ, దానిలోనే ఏదో ప్రత్యేకతని చూపించడంలోనే ఉంది మజా. అలా నిశ్చయించుకుని, ఆమె ఏ ఆడంబరాలూ లేకుండా మమూలుగానే, కుర్చీమీద కూర్చుని, తన అస్థిరమైన విహ్వాల హృదయపు ధ్వని వింటోంది.

***

పిల్లికేం పాలుపోవడం లేదులా ఉంది. మళ్ళీ లోపలికి వచ్చి, ముందు శ్రీపత్ రాయ్ కూర్చున్న కుర్చీ ఖాళీగా ఉండడం చూసి అదెక్కి కూర్చుంది. ఆనందంగా రెండు కాళ్ళ మధ్య తలపెట్టి కళ్ళుమూసుకుని నిద్రకుపక్రమించింది.

శ్రీపత్ రాయ్ మంజూకి వెనకవైపుగా వచ్చి ఆమె మెడవంపు సొంపుల్నీ, సౌందర్యాన్నీ వీక్షిస్తూ నిలబడ్డాడు. ఆ మెడమీది పుట్టుమచ్చ ఇప్పటికీ లాగే ఉంది. ఆయన విడిచే ఉఛ్వాసనిశ్వాసాల వెచ్చదనానికి మంజూ మెడ కొద్దిగా ప్రక్కకి త్రిప్పింది. ఆ క్షణంలో ఆ పుట్టుమచ్చ మాయమైంది. తిరిగి ఆమె తలనటు తిప్పగానే అది యధాస్థానంలో ప్రత్యక్షమైంది. శ్రీపత్ రాయ్ తిరిగి తన కుర్చీ దగ్గరికి వచ్చాడు. పెంపుడు పిల్లిని చేతిలోకి తీసుకుని, తాను కుర్చీలో కూర్చున్నాడు. పిల్లి వీపు మీద ప్రేమగా నిమురుతూ, దాన్ని ముద్దుచేస్తూ, మంజూ కంఠాన్నే కన్నార్పకుండా చూస్తున్నాడు. పిల్లి, యజమానిని కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ 'మ్యావ్' అంది.

***

ఆనంద్ కోసం ఎదురుచూస్తున్న అంజూ సన్నని స్వరంలో ఓ రాగాన్ని ఆలపించసాగింది. దానికి తగ్గట్టు, కుర్చీ చేతులమిద లయబద్ధంగా తాళం వేయసాగింది. ఆ స్వరంలో వెన్నెల రాత్రిలో, పంకజాలు చల్లగాలికి ఆనందంగా తలలూపుతున్న మంద్రగతి ఉంది. ప్రేమాతిశయంతో, ప్రియురాలు, ప్రియుడి భుజస్కంధాలమీద వాలిపోయి, చెందే తన్మయత్వం ఉంది. ఆ రాగపు చంచల ధ్రుతి, దూరంగా ఆకాశంలో ఉన్న తారకలు మినుకు, మినుకు మంటున్నట్టుంది. అంజూ తనని తాను మరిచిపోయి, ఆనందపుటంచుల్లో విహరించసాగింది.

***

ఉన్నట్టుండి శ్రీపత్ రాయ్ మంజూని అడిగాడు.

"మంజూ! నీకు జ్ఞాపకం ఉందా? మనం మొట్టమొదటిసారిగా ఎక్కడ కలుసుకున్నామో?"

కొంచెం సేపు ఆమె జవాబిస్తుందనే ఆశతో ఎదురు చూశాడు. మంజూ తను కూర్చున్న దగ్గర నుంచి, ఇటు అటూ కదిలి మళ్ళీ తన పనిలో మునిగిపోయింది.

ఇక తప్పదని, శ్రీపత్ రాయ్ తన ప్రశ్నకి తానే సమాధానం చెప్పుకున్నాడు.

"మనం అంతా ఎలిఫెంటాకి చిన్న బోటులో వెళుతున్నాం. నువ్వూ, నీ స్నేహితులూను, నేనూ, నా స్నేహితులూనూ అకస్మాత్తుగా కలుసుకున్నాం మనం. అప్పుడు నువ్వు చాలా పెంకిపిల్లవి ఎంత అల్లరి చేసేదానివనీ! బోటులో ఓ చివర కూర్చుని, వంగి, వంగి నీళ్ళు చేత్తో తీసి, లోపలున్న వాళ్ళమీద జల్లేదానివి. ఇంతలో, నువ్వు మరింత ఎక్కువగా వంగడం వల్ల, నీళ్ళలోకి జారిపడబోయావు. నేను వచ్చి, నీ చేయి పట్టుకుని నిన్నాపు చేశాను. నిన్ను పైకిలాగిన నా చేయి, నీ చేతిని పట్టుకుని అలాగే ఉండిపోయింది. అందరూ మనిద్దరినీ ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు. అది గ్రహించిన వెంటనే నువ్వు నీ చేతిని నా నుంచి విడిపించుకున్నావు. అది మన 'ప్రధమ పాణిగ్రహణం' జ్ఞాపకం లేదూ?"

మంజూ చిన్నగా నవ్వింది.. ఆమె కళ్ళముందు ఆ దృశ్యం సాక్షాత్కరించింది. నిజమే అప్పట్లో తను చాలా అల్లరిపిల్ల. ఆమెకంతా జ్ఞాపకం ఉంది. తను నీళ్ళలో పడిపోతానన్న మిష రక్షించింది కానీ, లేకపోతే ఆ చేయి పట్టుకున్నవాడి చెంప ఛెళ్ళుమనేదా రోజు, ఏమైనా, 'పాణిగ్రహణం' అన్నమాట ఆమెలో తెలీని ఉత్సాహాన్ని రేకెత్తించింది.

పిల్లి, శ్రీపత్ రాయ్ ఒళ్ళోంచి లేచి వచ్చి, మంజూ కాళ్ళదగ్గర తన శరీరం, తోక రాసుకుంటూ తిరగసాగింది. మంజూ తనకాళ్ళు వెనక్కి తీసుకుంది. పిల్లి తిరస్కార భావంతో, 'మ్యావ్' అని అరిచి, వెళ్ళి ద్వారబంధం మీద కూర్చుంది.

***

అంజూకి తన గీతం ఎప్పుడు గాలిలో కలిసి పోయిందో తనకే తెలియదు. ఆమె లేచి టేబులు మీద పుస్తకాలు చిందరవందరగా పడి ఉంటే. వాటిని ఒక వరుసలో సర్దిపెట్టింది. తాను భరతనాట్యం భంగిమలో తీయించుకున్న ఫోటో ఎక్కడపెట్టాలా అని, సరైన స్థలం కోసం వెతకసాగింది. అలా చూస్తూ, చూస్తూ ఆమె బీరువా దగ్గరకి వెళ్ళింది. అక్కడ కళ్ళు తెరిచే నిద్రపోతున్న పిచ్చుక మీద ఆమె దృష్టి

పడింది. దాని నిద్ర చెడగొట్టకూడదని, నెమ్మదిగా అడుగులో అడుగులేసుకుంటూ, ఆమె టేబులు వైపు నడుస్తూండగా, వెనకనుంచీ, ఆనంద్ పిలుపు వినవచ్చింది.

"అంజూ!"

ఆ పిలుపు అక్కడి వాతావరణాన్ని మాధుర్యంతో నింపివేసింది. ఆనందంలో మునిగి తేలుతూ, ఆమె ఆనంద్ వంక చూసింది. అదే సమయంలో గడియారం ఏడుగంటలు కొట్టింది.

***

మంజూ చేతి వ్రేళ్ళు మాత్రం నిర్విరామంగా తమ పని తాము చేసుకుపోతున్నాయి. ఆ వ్రేళ్ళ కదలికల్ని, శ్రీపత్ రాయ్ తదేకంగా గమనిస్తున్నాడు. అవే ఆగిపోతే ఇల్లంతా కూలిపడిపోతుందేమో అన్నట్లు అవి పనిచేస్తున్నాయా అనిపించింది శ్రీపత్ రాయ్‌కి. ఆయనకున్నట్టుండి వాటిమీద దయాభావం పుట్టుకొచ్చింది. వాటికి కొంత విశ్రాంతి కల్పించాలనే పురుష సహజమైన భావం మనసులో మెదిలింది. శ్రీపత్ రాయ్ కొంచెం ముందుకు వంగి, మంజూ చేతులు పట్టుకోబోయాడు.

సరిగ్గా అదే సమయానికి అంజూ హాలులోంచి వస్తూ "అమ్మా! ఆనంద్" అంది.

ఆ ఆనంద్ అన్న శబ్దంలో, అంజూ హృదయంలోని విహ్వలత, మాధుర్యం, ప్రేమలో ప్రథమావస్థలోని ఆశంక, భీతి, అన్నీ ఒక్కసారిగా ధ్వనించాయి. ఎంతోసేపటి నుంచో, ఆ ఇంట్లో 'ఆనంద్' శబ్దం గాలిలో తేలియాడుతోంది. కానీ దాని ధ్వని మాత్రం చెవిని సోకలేదు ఇంతవరకూ.

శ్రీపత్ రాయ్ కొంచెం వెనక్కితగ్గి, మళ్ళీ యథాస్థానాన్నలంకరించాడు. మంజూ వ్రేళ్ళు పనిచేస్తూనే ఉన్నాయి. ఆమె కళ్ళు కూడా పైకెత్తలేదు. ఆనంద్ రాకని గుర్తించలేదు. అంజూకి అది కొంచెం కోపాన్ని తెప్పించింది. ఆమె ఆనంద్ వైపు చూసింది. అతను మంజూ చేతి వ్రేళ్ళ కదలికల్ని పరీక్షగా చూస్తున్నాడు. అంజూ దృష్టి కూడా అటే పడింది.

మంజూ రెండు మూడు ముఖ్యమైన మాటలు మాట్లాడింది.

శ్రీపత్ రాయ్ కూడా పలకరించి, కుశలమడిగాడు. తరువాత 'టీ' వచ్చింది. అంతా లేచి టేబులు దగ్గర కెళ్ళారు.

మంజూ అల్లిక పని పక్కన పెట్టింది. బద్ధకంగా లేచి టేబులు దగ్గరకు వచ్చింది.

అంజూ చూపులు ఆనంద్ నుంచి తప్పించుకుని, అమ్మ వ్రేళ్ళని తాకాయి. ఆ వ్రేళ్ళు ఇంకా అలానే కదుల్తూన్నట్టే ఉంది.

కేటీ ఆనంద్ కాళ్ళ దగ్గరకొచ్చి కూర్చుని, 'మ్యావ్' అంది. తన ఉనికిని తెలియజేయడానికా అన్నట్టు.

ఆనంద్ దృష్టి దానివైపు, టేబులు క్రిందికి, సారించాడు. అక్కడ శ్రీపత్ రాయ్ కాళ్ళు, మంజూ కాళ్ళని మాటిమాటికీ తాకుతూ, బిజీగా ఉన్నాయని గమనించాడు. మంజూ వాటిని విసుగుతో వెనక్కితోసేస్తోంది.

ఆనంద్‌కి చాయ్ కప్పు అందిస్తూండగా, అంజూ చేయి అతని చేతికి తగిలింది. ఆమె చటుక్కున చేయి వెనక్కు లాక్కోవడంతో, కొంచెం చాయ్ ఆనంద్ బట్టలమీద ఒలికింది.

అది చూసి, మంజూ కూతుర్ని, "అంజూ!" అని మందలించింది. ఆ సంబోధనలో ఉన్న వాడి, వేడి, తీక్షణత ఆనంద్‌ని కూడా భయపెట్టాయి.

శ్రీపత్ రాయ్ లేచాడు. పైపు తీసుకుని దానిలో పొగాకు కూరాడు. దాన్నాయన వెలిగించకుండా, అలానే నోట్లో కొంచెం సేపు ఉండనిచ్చి, తరువాత అంటించాడు. ఆ పైపులోంచి వచ్చిన పొగ టేబులు మీదంతా వ్యాపించింది. చాయ్ తాగే ఆనవాయితీ పూర్తయింది. మంజూ కూతుర్ని పిలిచి, "అంజూ! ఆనంద్ కి మనతోట చూపించుకురా!" అని పురమాయించింది.

***

అంజూ, ఆనంద్‌లు ఆరుబయట తోటలోకి వచ్చారు. వారి మనసులు వికసించాయి. మల్లెపూల గుబాళింపు వారిని ఆనందంలో ముంచెత్తింది. ఇద్దరూ ఒకరితో మరొకరు మాట్లాడాలనే ఉబలాటంతో, మాటల కోసం వెదుక్కోసాగారు. సన్నజాజి పందిరికింద సువాసనలు వెదజల్లే వాతావరణంలో వారొకింతసేపు ఇవీ, అవీ మాట్లాడుకున్నారు.

***

మంజూ మళ్ళీ తను వదిలిపెట్టిన అల్లిక పని మొదలు పెట్టలేదు. సోఫాలో కూర్చుని, ఎదురుగా టేబిలు మీదున్న ఒంటె బొమ్మని తీసుకుని దానికున్న ధూళిని దులిపి శుభ్రం చేసి, మళ్ళీ యథాస్థానంలో పెట్టింది. ఆ ధూళిని ఎగరకొట్టడానికి ఆమె బుగ్గలు పూరించినప్పుడు చూసిన, శ్రీపత్ రాయ్ హృదయం ఎగిసిపడింది. ఆయన నెమ్మదిగా చప్పుడు చేయకుండా, ఆమె కూర్చున్న సోఫా వెనక్కి చేరుకున్నాడు.

పిల్లి, ఖాళీగా ఉన్న అంజూ గదిలోకి వెళ్ళింది. అక్కడ దానికి పసందైన వాసనని పసిగట్టింది. గది నాలుగువైపులా కలయజూసింది. బీరువా మీద స్థిరంగా ఉన్న పిచ్చుకమీద దాని దృష్టి పడింది. నెమ్మదిగా చప్పుడూ చేయకుండా అది అటువైపుగా ముందుకు సాగింది.

***

అంజూ తోటలో ఎత్తుగా ఎదిగిన పూలమొక్కలనుంచి పూలగుత్తులు కోయడానికి కాళ్ళు పైకెత్తి ప్రయత్నిస్తోంది. ఆమె అంగాంగ సౌందర్యం ఆ వాతావరణంలో ఆనంద్‌లో మోహాన్ని ప్రేరేపించింది. ఆనంద్ నెమ్మదిగా గుట్టుచపుడు కాకుండా వచ్చి, అంజూ కెదురుగా నిల్చున్నాడు. అతనికి దగ్గరగా, అత్యంత సన్నిహితంగా, ఆమె కంఠం, బుగ్గలూ వచ్చాయి. అతను పరవశంతో ఆమె కర్ణమూలాల్ని ముద్దాడాడు. అంజూ చేష్టలిడిగి, అలాగే నిలబడిపోయింది.


***

శ్రీపత్ రాయ్ మంజూకు తెలియకుండా, సోఫా వెనక, ఆమెకు దగ్గరగా చేరాడు. ఆమె కబరీభాగం, ఆమెడ వంపుసొంపులూ, ఆ బాహుమూల రుచి, అతడిని వివశుణ్ని చేశాయి. అతను సాహసించి, ఆమె మెడమీద ఒక గట్టి ముద్దు పెట్టుకున్నాడు. మంజూ, "ఓహ్! మా" అని అరిచింది.

ఆ అరుపు విని, ఆనంద్, అంజూ తోటలోంచి హాల్లోకి పరుగెత్తుకు వచ్చారు.

అక్కడ చూస్తే ఇంకేముంది? పిచ్చుకని నోట్లో కరుచుకుని, ఎక్కడికిపోయి విందారగిద్దామా అని పిల్లి ఆలోచిస్తోంది.

శ్రీపత్ రాయ్ ఏమీ ఎరగనట్లు కేలండరు కాగితం చింపుతున్నాడు.



# అనువాద కథలు

## - పాలెపు బుచ్చిరాజు



## *కే.వై.సీ.ఆఫీసు* *గుజరాతీ మూలం: జయశ్రీ జె.చౌధరి*

**జారిపోతున్న చున్నీని భుజాలపై** సర్దుకుంది అనూ. త్రివేదీ సాహెబ్ చెప్పిన మాటల్ని మళ్ళీ నెమరువేసుకుంది. 'కే.వై.సీ. ఆఫీసు, జీన్ వాలా స్కూలుకి ఎదురుగా, విశ్వకర్మా హవుస్, సేష్టన్ రోడ్డు'.

కే.వై.సీ ఆఫీసు దేశంలో సుప్రసిద్ధమైన జీవిత భీమా సంస్థ వారి ఆఫీసు. బ్రతికి ఉన్నప్పుడూ, చనిపోయిన తర్వాత కూడా మనిషికి విలువల్ని నిర్ణయించే కంపెనీ. 'నువ్వు కూడా ఏజంటువి కావచ్చు. నీలో ఆ సమర్ధత ఉంది. నీ సర్టిఫికెట్లు, ఫోటోలూ, ఫీజూ.. మొదట్లో ఒక వెయ్యి రూపాయలు'.. ఆ మాటల మీద అనూ ఆలోచనలు బెల్లం మీది ఈగల్లా అంటుకుపోయాయి. ఆమె మనోఫలకం మీద అయిదు, పది, ఇరవై, ఏభై, వంద, ఐదువందల రూపాయల నోట్ల కట్టలు నాట్యం చేయసాగాయి.

అనూ, వస్తూన్న రిక్షాని ఆగమని చేత్తో సైగ చేసింది. రిక్షా ఆగింది. 'తీన్ రాస్తా' అంటూ లోపలికి తొంగి చూసింది. వెనక సీట్లో, లావాటి మనిషి ఆక్రమించగా మిగిలిన స్థలం తనకి చాలదు. సందేహిస్తూ అలాగే నిలబడింది. రిక్షా అతను వెనక్కి తిరిగి చూశాడు. ఆ కూర్చున్నామెతో, "జాగా ఇయ్యి. లేకపోతే, మూడురెట్లు చార్జీ అవుతుంది" అన్నాడు. మంత్రం పనిచేసింది. ఆమె కాళ్ళు రెండూ దగ్గరగా చేర్చి, కొంచెం ఒదిగి కూర్చుంది. అనూ కుడికాలు లోపల పెట్టి, బుర్ర కొంచెం వంచి, రిక్షాలో ఎక్కింది. వెంటనే రిక్షా ఒక్క కుదుపుతో బయల్దేరింది. ఆ కుదుపుతో, ప్రయాణికులిద్దరూ ఎత్తి కుదేసినట్టయి, ఉన్న స్థలంలో ఇమిడిపోయారు.

'కే.వై.సీ.ఆఫీసు. జీన్వాలా స్కూలు కెదురుగా', ఒక్కొక్క అక్షరమూ విడివిడిగా ఉచ్చరిస్తూ, మాట్లాడడం త్రివేదీ సాహెబ్కి అలవాటు. అలా ఆయన సాగదీస్తూ నెమ్మదిగా ఎడ్రసు చెప్పుతుంటే, పాములవాడి బుట్టలోంచి పాము బైటికి వస్తున్నట్టుగా అనిపించింది అనూకి.

"ఏయ్! ఆ ప్రక్కన ఆపుచెయ్!" అలావాటి ఆమె కర్కశ స్వరానికి హడలిపోయి, పాముల బుట్టమూత పెట్టేసింది అనూ.

"ఏయ్ పిల్లా! నన్ను దిగనీ." ఆ మాటల జోరుకి ఎగిసి పడినట్టుగా ఒక్కసారిగా రిక్షాలోంచి బైటికి దూకిందామె. తరువాత దిగిన ఆ స్త్రీ తనపాదం నేలమీద మోపిన ధాటికి భూకంపం వచ్చినట్టయి అనూ పాదాలు కంపించాయి. మరో పాసెంజరు వచ్చేవరకూ, సీటంతటికీ తానే మహారాణి కనుక, అనూ సీట్లో సావకాశంగా కూర్చుంది. ఒక పెద్ద బరువు నెత్తిమీదనుంచి దింపినట్టుంది. ఒకొక్కరూ విడివిడిగానూ, గుంపులు గానూ మనుషులు ఎదురుపడి, మళ్ళీ విడిపోయి వెళ్ళిపోతున్నారు. ఏదో హై-ప్రొఫైల్ పార్టీలో ఒకరిద్దరు మధ్య తరగతి వాళ్ళు ఇరుక్కు పోయినట్టు, సంకోచిస్తూ సైకిలు తొక్కేవాళ్ళు, మిగతా వాహనాల్ని శ్రద్ధగా తప్పించుకుంటూ పోతున్నారు.

చికెన్ సెంటర్, పోలీస్ స్టేషన్, నగరపాలిక, బేకరీ వివిధ స్థలాల పేర్లు చదివి అర్థం చేసుకుంటోంది అనూ. ఒక ఆటో గేరేజి పైన మాత్రం ఏదో దక్షిణ భారతీయ భాషలిపిలో ఉన్నాయి అక్షరాలు. అక్కడామె దృష్టి నిలిచింది. కేవలం అక్షరాలు విడివిడిగా రాసినట్టు

తెలుస్తోంది కాని, మొత్తం ఆ రాసిన దానికి అర్థం ఏమిటో తెలిసి రాలేదు అనూకి. ఆమె ఆలోచనలో పడింది. లిపి అర్థమయితేనే కదా ఆ అక్షరాలు అర్థవంతం అవుతాయి.

ఒకేలాంటి యూనిఫామ్‌లో ఉన్న చిన్నా పెద్దా స్కూలు పిల్లల గుంపుని చూడగానే అనూకి హఠాత్తుగా జ్ఞాపక వచ్చింది. 'జీన్ వాలా స్కూలుకి ఎదురుగా, ఎడం ప్రక్కన' ఆమె కొంచెం ముందుకు వంగి బైటికి తొంగి చూసింది. చేతిలోని పర్సులోంచి అయిదు రూపాయలు నాణెం తీసి రిక్షావాడిచేతిలో పెట్టింది. అదందుకుని అతను బండినాపగానే, చటుక్కున దిగింది. రిక్షా వెళ్ళిపోయింది.

'ఆ ఆఫీసు ఈ చుట్టుప్రక్కలనే ఎక్కడో ఉండాలి' అనుకుంటూ, సి.ఐ.డి. ఆఫీసర్లా నాలుగు దిక్కులా కలయ జూసింది. ఏమీ ఆచూకీ తెలియడంలేదు. ఎవర్నేనా అడుగుదామని వెనక్కి తిరిగింది. ఎదురుగానే మేడమీద రెండో అంతస్తుపైన, కే.వై.సీ ఆఫీసు బోర్డు వ్రేళ్ళాడుతూ కనిపించింది. నల్లని బోర్డుమీద తెల్లని అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇద్దరు ముగ్గురు మనుషులు వస్తూపోతూ ఉండడం గమనించిన అనూ, మేడపైకి వెళ్ళే మెట్లున్న స్థలం గుర్తించింది. కానీ ఆ మెట్లు చేరుకోవడానికామెకు చాలా సమయం పట్టింది. మూడు నాలుగు దుకాణాల మీంచి దాటి వెళ్ళాలి.

మెట్లెక్కబోతూండగా, ఆమె దృష్టి మెట్ల వెనకగా ఉన్న నిర్మానుష్యమైన స్థలం మీద పడింది. అక్కడొక మూలన యువకుడిలా కనిపించాలని తాపత్రయపడే, బట్టతల ఉన్న, ఒక నడివయస్సులో ఉన్నాయన కనిపించాడు. అక్కడ నిలబడి ఆయన రుమాలుతో చెమట తుడుచుకుంటున్నాడు. మెట్లెక్కుతూ అతన్నే గమనిస్తోంది అనూ. అతనూ ఆమె వెనకనే, కొంతదూరంలో ఉండి, మెట్లెక్కి వస్తున్నాడు.

మెట్లు మలుపు తిరిగే దగ్గర, ఆమె ఆగి, వెనక్కి తిరిగి చూసింది. అతనామె ననుసరిస్తున్నాడు. ఎండిన అక్రోట్‌లాంటి కఠోరత ఉంది అతని ముఖంలో. ఒక్కసారి ఆ కళ్ళలోకి చూడగలిగితే, అతని మనసులో ఏముందో తెలుసుకోవచ్చుననుకుంది అనూ. అలా మనుషుల్ని అంచనా వేయగల అనుభవం ఆమెకు ఉంది. అదొక హాబీ ఆమెకు.

కేవలం మానవుల ముఖాల్లోను, విశేషించి, కళ్ళలోనూ, మాత్రమే వారిప్రవర్తన ప్రతిబింబిస్తూ ఉంటుందని ఆమె గట్టి నమ్మకం. ఇతర జంతువుల కళ్ళలో కూడా వాటి భావాల్ని చదవాలని ప్రయత్నం చేసింది అనూ. కానీ ఆమె అనుభవంలో, జంతువుల కళ్ళలో ఆ భావప్రకటన అసాధ్యం అని తెలుసుకుంది. వాటి భావం వాటి ప్రవర్తనని బట్టి తెలుసుకోవచ్చును. గాడిదలాంటి పశువులు ఓండ్ర పెడతాయి. కట్టునుంచి తప్పించుకోవాలని చూస్తాయి. కుక్కలు తోక ఆడిస్తాయి. నేలమీద పడి పొర్లుతాయి. అలాగే, ఒక పిచ్చివాడి కళ్ళలో ఉన్మాదం మాత్రమే ఉంటుంది. ఒక్క మామూలు మానవుడి ముఖకవళికల్లోనూ, కళ్ళలోనూ మాత్రమే, అతని అంతరంగం ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఇలా అని ఆమె తోటి మిత్రులతో వాదిస్తే, వారింక వాదించలేక, 'నువ్వు చెప్తున్నావు కాబట్టి నిజమే అయి ఉండొచ్చు' అని ఒప్పేసుకుంటారు.

మెట్లు పూర్తయిన దగ్గర, రెండు ప్రవేశద్వారాలున్నాయి. ఏ ప్రక్కకి వెళ్ళాలనే సందిగ్ధంతో ఆలోచిస్తూ నిలబడిపోయింది అనూ. వెనక వచ్చిన నడివయస్కుడామెను తప్పించుకుని వెళ్ళి ఎడమవైపు ప్రవేశద్వారంలోంచి లోపలికి వెళ్ళాడు. అనూ అనాలోచితంగా కుడివైపు కాలు వేసింది. ఎదురుగా ద్వారం దగ్గర దీర్ఘ చతురస్రాకారపు టేబులు వెనక ముగ్గురు మనుషులు కూర్చుని ఉన్నారు. మధ్యలో కూర్చున్న తెల్లబట్టలాయన్ని అడిగింది అను. "అంకిత్ త్రివేదీ?" సగంలోనే సమాధానం వచ్చింది.

"ఎదురుగా! ఆ ఆఫీసులో".

అనూ ఎడమ వైపు తిరిగి, లాబీలో ప్రవేశించింది. ముందుభాగంలో కొందరు విజిటర్స్ ఎవరికోసమో నిరీక్షిస్తూ కూర్చున్నారు. ఒకరిద్దరు పత్రికల్లోని వార్తలు నమిలి మింగేసేటట్టు దీక్షగా చదివేస్తున్నారు. మరో ప్రక్క క్లాసు నడుస్తోంది. వయసులో పెద్దవాళ్ళయిన ట్రెయినీస్, జిరాఫీల్లాగ మోరలెత్తి, పాఠాల సారాన్ని ఆస్వాదిస్తున్నారు. ఓ వ్యాఖ్యాత పెద్ద బైండు పుస్తకం సగం తెరిచి, ఎడం చేత్తో పట్టుకుని ఏకధాటిగా చెప్పుకుపోతున్నాడు.

మూడోప్రక్క, చతురస్రాకారంలో ఉన్న ఎన్నో టేబుల్స్, ఎదురుగా కుర్చీలతో అందంగా అలంకరించబడి ఉంది. మనుషులు వచ్చి పోవడానికి మాత్రం రెండు మూడడుగుల ఖాళీ స్థలం వదిలి, ఆ భాగం అంతా కుర్చీలు టేబుల్సుతో అలరారుతోంది. ప్రతీటేబులు దగ్గరున్న కుర్చీలోనూ, ఫ్లవర్ వేజ్‌లో అందంగా అమర్చబడిన పూల గుత్తుల్లా, రంగు రంగుల దుస్తులను ధరించిన ఉద్యోగస్తులు కూర్చుని ఉన్నారు.

లాబీలో తనకెదురుపడిన ఒకయన్ను అడిగింది అనూ, "అంకిత్ త్రివేదీ సాహెబ్..?"

జవాబు తిరుగు టపాలా వెంటనే వచ్చింది.

"త్రివేదీ సాహెబ్ అయితే లేరు"

అనూకి ఏం చేయాలో తోచలేదు. "మరి ఇప్పుడాయన్ను కలవాలంటే?" జవాబు సుస్పష్టం. వేరే వివరించవలసిన అవసరం లేదు. ఆమె అలాగే నిలబడి ఉంది.

ఏదో ముఖ్యమైన పనిమీదే ఆమె వచ్చి ఉంటుందన్న విషయం ఆ పెద్దమనిషి గ్రహించాడో ఏమో, "అంకిత్ త్రివేదీ సాహెబ్‌కి అసిస్టెంటు ఒకామె, అదుగో! ఆ టేబిలు దగ్గర కూర్చుని ఉంది. ఆమే!" అన్నాడు అటువైపు వ్రేలుపెట్టి చూపిస్తూ.

"థేంక్స్" ఆయనకు కృతజ్ఞతలు చెప్పి, అటు వెళ్ళింది అనూ. అక్కడున్న మనిషి పేరూ, హోదా తెలియజేస్తూన్న 'నేమ్ ప్లేటు' ఆ టేబిలు మీద విరాజిల్లుతోంది. వచ్చినవాళ్ళు కూర్చోవడానికి ఎదురుగా వేసిన రెండు కుర్చీల్లో ఒకదానిమీద అప్పటికే ఒకాయన కూర్చుని ఉన్నాడు. అనూ అటుగా ఒక చూపు పారేసి, అక్కడ నిలబడింది. త్రివేదీ సాహెబ్ అసిస్టెంటు కళ్ళెత్తి చూసింది. అనూ అందమైన రూపం ఆమె కళ్ళలో క్షణకాలం పాటు ప్రతిబింబించి మాయమైంది. "త్రివేదీ సాహెబ్" అడగబోయింది అనూ.

"కూర్చోండి. బైటికి వెళ్ళారు. ఇప్పుడే వస్తారు."

అనూ ఆ రెండో చెక్క కుర్చీని తనవైపు లాక్కుని అందులో కూర్చుంది.

"మీరు ఏజన్సీ తీసుకున్నారా?" అసిస్టెంటు ప్రశ్న.

ఏజన్సీయా? అనూ ఇంకా ఇప్పుడే కే.వై.సీ.లో జాయినవడం గురించి ఆలోచిస్తోంది. క్షణంకాలం పాటు అనేక ప్రశ్నలు ఆమె మనసులో అంకురించాయి. అంతలోనే ఆమె సర్దుకుని, "లేదు. లేదు. నిజానికి ఫామ్‌లో కొన్ని వివరాల గురించి తెలుసుకోవాలి. ఇంకా నా ఫొటోగ్రాఫులూ అవీ ఇవ్వాలి."

"మేడమ్ నేను ముందునుంచీ ఇక్కడ కూర్చుని ఉన్నాను" ఆ మాటలు వచ్చినవైపు తిరిగి చూసింది అనూ. అతనే! తను మొదట్లో ఎడమవైపు వెళ్తూండగా చూసిన మధ్య వయస్కుడు. అతని కళ్ళు అసిస్టెంటు వైపు తీక్షంగా చూస్తున్నాయి.

"సరే! మీరు ఆఖరి ప్రీమియం ఎప్పుడు కట్టారు?"

ఆయనకి కోపం వచ్చింది. కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. "చూడండి మేడమ్ నా పేపర్లన్నీ తయారుగా ఉన్నాయి. ఈ రోజు మీరు నా చెక్కు రెడీగా ఉంచాల్సి ఉంది. మీ భీమా ఏజంటు నన్ను తన మాయా శబ్దజాలంలో ఇరికించేశాడు. బ్రతికి ఉన్నప్పుడు, చచ్చిపోయిన తర్వాతా కూడా వచ్చే లాభాల్ని, బేరీజు వేయించి, నా చేత లక్షలకి భీమా చేయించాడు. ఇప్పుడు మీరు నన్నిలా త్రిప్పి, త్రిప్పి చంపుతున్నారు. ఇదేమైనా బాగుందా?" ఔను కదా! అన్నట్టు ఆయన అనూ వైపు తిరిగి చూశాడు సపోర్టు కోసం. అన్ని విషయాలూ కళ్ళతో చెప్పకనే చెప్పుతున్నాడు ఆ నడివయస్కుడు. అత నంటున్నాడు. "భార్య, భారతీ ఖేర్ మృత్యువాత పడింది." అను అతని ప్రతీమాటా దీక్షగా వింటోంది. అతను 'నా భార్య' అని కాకుండా, 'భార్య' శబ్దం మాత్రమే వాడడం ప్రత్యేకంగా గమనించింది.

"ఏక్సిడెంటల్ డెత్ కారణంగా ఇవ్వవలసిన రుసుముకి మీ చెక్కు రెడీగా ఉంది. "

ఆ మాటలు వింటూనే ఆయన మనసులో ఆనందం ఏరులై పారింది. ఆయన పెదాలు, శరీరం దానిలో చెమ్మగిలాయి. కుర్చీ చేతుల మీదున్న చేతులు వణకసాగాయి.

అసిస్టెంటు ఫోనులో మాట్లాడుతోంది. ఆ బట్టతలాయన చూపులు అనూని నఖశిఖ పర్యంతం పరీక్షిస్తున్నాయి. తన వయసులో సగం కంటే తక్కువ వయసున్న స్త్రీని చూసి, ఆ కళ్ళలో ఆవేశం ఉబికి వస్తోంది. అనూ అతని కళ్ళలోకి ఒక దూకు దూకింది.

ఈ బట్టతలవాడు వ్యాధిగ్రస్తురాలైన తన భార్య పోవాలనే కోరుకున్నాడు. అదృష్టవశాత్తూ ఆమె పేర్న జీవిత భీమా పాలసీ తీసుకున్నాడు. చూస్తూ, చూస్తూ ఆమెను అకస్మాత్తుగా చంపలేడుకదా! అందుకు అతనొక పన్నాగం పన్నాడు. ఆమెకు ఏదో కఠోరమైన, ప్రాణాలు తీసే జబ్బు వచ్చేలా చేశాడు. తనకంటే సగం వయసులో ఉన్న మరొక స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అందమైన యువతి, భార్య చావుతో పెద్ద ఎత్తున వచ్చే భీమా రుసుమతో ఆ దుష్టుడు శేషజీవితాన్ని సుఖమయంగా గడపాలని ప్లానింగు చేశాడు. అతని కళ్ళలో అలా జీవించాలనే ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. చెక్కు చేత్తో అందుకుని మిగిలిన కార్యక్రమాలు పూర్తిచేసి అతను లేచి నిలబడ్డాడు.

'బ్రతికి ఉండగానూ, ఆ తరవాతా' వచ్చే లాభదాయకమైన బీమా పథకాల్ని అసిస్టెంటు చెప్పుకుంటూ పోతోంది. అనూకి ఇక అక్కడినుంచి లేవడం మంచిదనిపించింది. ఇంత రద్దీగా ఉండే ఈ స్థలంలో తాను తన పనికి న్యాయం చేకూర్చలేదు. విద్యుత్ బల్బులు, ఆ నకిలీ వెల్తురు, పంఖాలు తిప్పేగాలి రాజ్యం చేస్తున్న వాతావరణంలో, సగం, సగం పీల్చే శ్వాసతో ఆమె కంఠం నొక్కిపెట్టినట్టవుతోంది.

'ప్రాణం పోయిన తర్వాత వచ్చే కమిషను' మాటలామెను కుక్కల్లా వెంటబడి తరుముతున్నాయి.

అనూ లేచి నిలబడింది. ఎదురుగా ఉన్న అసిస్టెంటుతో అంది. "నేను మళ్ళీ వస్తాను." ఆమె అక్కడినుంచి కదిలి లాబీలోకి వచ్చింది. అసంఖ్యాకమైన టేబుల్సూ, కుర్చీలు, ఫైల్సు, బీరువాలు, ఇంకా, అక్కడ పనిలో నిమగ్నమైన మనుషులు.. వాళ్ళలో ఒకరిద్దరు అనూని గమనించి కూడా ఉండొచ్చు.

అనూకి మెట్లు ఒకంతట కనిపించలేదు. ఏమైపోయాయా అని ఆశ్చర్యపడింది. లాబీ చుట్టూ గోడ కట్టేసినట్టనిపించింది. ఆమె వెనక్కి తిరిగింది. ఎదురుగా దీర్ఘచతురస్రాకారపు బల్ల దగ్గర ముగ్గురు మనుషుల్లోనూ, తెల్లబట్టలాయన కనిపించాక ఆమె మనసు కాస్త కుదుటపడింది. అప్పటికి బాహ్య ప్రపంచంలోకి వచ్చిందామె. మెట్లు కూడా కళ్ళముందు ప్రత్యక్షమయ్యాయి. ఆమె నెమ్మదిగా మెట్లు దిగసాగింది.

మెట్లు మలుపు తిరిగే దగ్గర, నిర్మానుష్యమైన స్థలంలో, ఆ మధ్య వయస్కుడు నిలబడి మొబైల్‌లో మాట్లాడుతున్నాడు. "ఆఁ! దొరికింది. చెక్కు తీసుకున్నాను. ఏమీ చింతించే అవసరం లేదు. ఆమె పోతే పోయింది. కానీ లాభం చేసి మరీ పోయింది. జీవిత భీమా తీసుకున్నాను మంచిదయింది. లేకపోతే ఏముంది? బ్రతికి ఉండీ చచ్చినవాడినయేవాడిని నేను. అయినా నాకు నువ్వున్నావుగా! నాకేం భయం? మరి తరువాత ప్రోగ్రాం ఏమిటి? 'దమన్'కి పిక్నిక్ వేసుకుందాం. వచ్చేయ్!"

అనూకి ఎవరో వెనకనుంచి గట్టిగా నెట్టినట్టయింది. ఆమె పడబోతూ, మెట్ల రెయిలింగ్ పట్టుకుని ఆపుచేసుకుంది. "నేను మాత్రం ఇక్కడ ఉద్యోగం చేయనుగాక చేయను" అక్కడికక్కడే ఆమె గట్టి నిర్ణయం తీసుకుంది.

"యు హేవ్ గుడ్ పర్సనాలిటీ. గుడ్ స్పీచ్. యు కెన్ డు వెల్ ఇన్ జాబ్." త్రివేదీ సాహెబ్ మాటలామెను వెక్కిరిస్తున్నాయి. అనూ ఒక్కసారిగా వెళ్ళి ఎదురుగా ఉన్న రిక్షాలో కూలబడింది. రిక్షా బయల్దేరి మరొక పాసెంజరు కోసం పరుగుతీసింది.

అనూ ఇంటికి వచ్చాక మనసు కాస్త కుదుట పడింది. మొబైల్ రింగయింది. 'ఓమ్ త్ర్యంబకం యజామహే' అట్నుంచీ త్రివేదీ సాబ్ మాట్లాడుతున్నాడు. "మిస్ అనురాగీ! మీరు ఫోటో, ఇతర వివరాలూ ఇవ్వడానికి రావాల్సి ఉంది కదా!"

"అవును. నేను వచ్చాను కూడా. కానీ" క్షణం ఆగి, మళ్ళీ అంది అనూ, "ఇంట్లో వద్దన్నారు."

"మీ వంటివాళ్ళు ఈ ఫీల్డులో మంచి విజయం సాధించగలరని నా విశ్వాసం. మీరు సరేనంటే నేను మీ ఇంట్లో వాళ్ళతో మాట్లాడుతాను. మంచి అవకాశం."

"వద్దు. వద్దు. నేనే తిరిగి మీకు ఫోను చేస్తాను."

"సరే! మరిచిపోకండి. మీవంటి వాళ్ళు మాకు చాలా అవసరం."


"సరే!సరే!. కానీ.."

"ఓ.కే"

అనూ ఒక దీర్ఘ నిశ్వాసం విడిచింది. లేచి వెళ్ళి గది కిటికీ తలుపులు తెరిచింది. వెల్తురు లోపలికి చొచ్చుకొచ్చింది.

పెన్నూ, తెల్లకాగితాలూ, తీసుకుని ఆమె కుర్చీలో కూలబడింది. భారతీదేవి వీణానాదం నుంచి పుట్టుకొచ్చిన శబ్దాలు ఆమె చుట్టూ ముసురుతున్నాయి. ఎన్నో శబ్దాల్ని ఆమె సునాయాసంగా స్వీకరించింది. ఆ శబ్దాలు మనసులోంచి, బాహువుల ద్వారా చేతుల్లోకి ప్రసరించి, వ్రేళ్ళ చివరి వరకూ వచ్చాయి. అవి పెన్నులో అక్షరాలై కాగితాన్ని అలంకరించాయి. ఆ నీరవ నిశ్శబ్దంలో నిలబడి ఆమె ఒక ప్రకటన చేసింది.

"ఈరోజు నుంచీ నేను రాస్తాను..చాలా రాస్తాను."



# అనువాద కథలు

## - పాలెపు బుచ్చిరాజు



## *అగతి గమనం* *గుజరాతీ మూలం: కీ.శే.సురేష్ జోషి*

**ఇలా నెమ్మదిగా తయారైతే ఆలస్యం అయిపోతుంది.** అసలెంత తొందరగా బయలుదేరినా ఆలస్యమైపోతూనే ఉంది. అది అనుభవం వల్ల తెలిసివచ్చింది. కానీ నాకెందుకో ప్రతీదానికీ గాభరాపడిపోయే స్వభావం. ఏదైనా ఊరికి ప్రయాణం అంటే చచ్చేచావొచ్చి పడిందన్నమాటే! రైలొచ్చే సమయానికి గంట ముందుగానే స్టేషన్ చేరుకుంటాను. అక్కడ పుస్తకాల షాపులో పత్రికలు తిరగేస్తుండగానే రైలొచ్చేస్తుంది. నేను పరుగెత్తుకుంటూ వెళ్ళినా కూర్చోటానికి సీటు దొరకడం కష్టమవుతుంది.

ఇవాళ ప్రొద్దుటే లేచి నేను గడియారం చూసేసరికి అయిదున్నర అయింది. అయినా గడియారం మీద నాకొట్టే నమ్మకం లేదు. రేడియో వినే అలవాటు కూడా లేదు నాకు. కానీ దేశమంతా సర్కారు టైం మీద నడుస్తుంది. మా ఇంటిగుమ్మంలోంచి ఎదురుగా టవర్ క్లాక్ కనిపిస్తుంది. కానీ దానినీ పూర్తిగా నమ్మడానికి వీల్లేదు. ఒకసారి దాని గంటల ముల్లు మీదవాలిన చిన్నపిట్టను చూసి మోసపోయాను. అందుకే రాత్రి పడుకోబోయేముందు రిస్ట్ వాచ్ చేతికి పెట్టుకుని పడుకుంటాను. అదీ పెద్ద సమస్యే. ఈ మధ్య ఫాషన్‌లు ఎక్కువై డయిల్ మీద అంకెలకి మొదలు చుక్కలు పెట్టి వదిలేస్తున్నారు. అందువల్ల నాకు అయిదున్నర, ఆరున్నర ఒకలాగే కనిపిస్తాయి. నిద్రరాకపోయినా సరే ఇంకా గంట టైముందికదా అని పడుకునే ఉంటాను.

ఇంతలో కిటికీలోంచి చిక్కని సూర్యకాంతి లోపలికి వచ్చి పడటంతో నేను ఠక్కున లేచి నిలబడ్డాను. తొందరలో రేజర్‌లో బ్లేడ్ పెట్టకుండానే గెడ్డం చేసుకోబోయాను. వేడి వేడి టీ తాగబోతే నోరు కాలింది. సాక్స్ తిరగేసి వేసుకున్నాను. గబగబా బయటకు వచ్చి తాళం వెయ్యబోతే తాళం చెవి లోపలే మరిచానని తెలిసింది. ఇక ఈవేళ ఏడున్నర బస్సు మిస్సవడం ఖాయం అనిపించింది నాకు.

ఇలా బస్టాప్ దగ్గరకు వెళ్ళానో లేదో ఒక బస్సు వచ్చి ఆగింది. అది ఏ రూటు బస్సు? ఎటునుంచి ఎటు వెళ్ళేదీ? ఇవన్నీ చూసే టైమేదీ? అక్కడకీ చిన్న అనుమానం అయితే మనసులో మెదిలింది. ఎక్కనా? వద్దా? అని ఆలోచిస్తూ నిలబడ్డ నన్ను చుట్టూ గుంపుగా నిలబడ్డ ప్రయాణీకులే వాళ్ళతోబాటుగా బస్సెక్కించేశారు. బస్సు ఎంత రద్దీగా ఉందంటే నా ఎదుటి మనిషి వీపు తప్ప మరేమీ కానరావడంలేదు నాకు. బస్సు నడుస్తోందో లేదో కూడా తెలిసే పరిస్థితి కాదు. నేను రోజూ బస్ ఎక్కేటప్పుడు తరచూ నాతోపాటే బస్సెక్కే తోటి ప్రయాణీకుల్ని కొందరినైనా గుర్తుపట్టే ప్రయత్నం చేశాను. కనీసం వారిలో ఏ ఒక్కరి కంఠస్వరమైనా వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించుకుని వినే ప్రయత్నం చేశాను. కానీ అంతా రణగొణ ధ్వని తప్ప మరేమీ వినిపించలేదు.

నా మనసులో రకరకాల శంకలు నేను మరో బస్సేమీ ఎక్కేయ్యలేదు కదా! పోనీ దిగిపోదామంటే బస్సు దిగే మార్గం కూడా కనుచూపు మేరలో కనిపించడంలేదు. అసలు బస్సు ఏ దిశలో వెళుతుందో కూడా తెలిసే అవకాశం లేదు. అయినా నా ప్రయాణం ఎంత? నలభై అయిదు నిమిషాలే కదా! అని ఆలోచిస్తుండగా వెనకనుంచి ఎవరో ఒక తోపు తోసారు. ఎక్కడ ఎవరి మీద పడతానో అనే

భయంతో నేను కళ్ళుమూసుకున్నాను. తిరిగి కళ్ళు తెరిచేసరికి, నేను ఒక సీటు మీద ఇద్దరి మధ్య ఇరుక్కుపోయి కూర్చుని ఉన్నాను. వాళ్ళిద్దరూ ఎవరా? అని పోల్చుకునే ప్రయత్నం చేశాను. కిటికీ వైపు కూర్చున్న వ్యక్తి చేయి నా తొడమీద ఆన్చి ఉంది. ఆ చేతిమీది చర్మం మెరుస్తోంది. దానిమీద నీలిరంగు నీడ పడుతోంది. ఆ చేతి ఆకారాన్ని బట్టి ఆ వ్యక్తి చాలా లావుగా ఉండొచ్చునని ఊహించాను. కానీ, జాగ్రత్తగా చూస్తే ఆ చేయి, బలం కంటే, వాపుతో ఉండొచ్చుననిపించింది మళ్ళీ. కిటికీకి ఉన్న అద్దంలోంచి నెమ్మదిగా దృష్టిసారించి, అందులో నేనతని ప్రతిబింబాన్ని చూశాను. కాని, అతను పెట్టుకున్న నల్లకళ్ళద్దాల మీద ఎండపొడ పడుతూండడంతో, అతని కళ్ళు స్పష్టంగా కనిపించడంలేదు. అతని ఆకారం మాత్రం ఎందుకో నాకు విచిత్రంగా అనిపించింది. నేను ఆ చేయి ఆధారంగా వేసుకున్న అంచనాకి భిన్నంగా అతని నోరు చాలా చిన్నదిగా ఉంది. బుగ్గలు చిన్నపిల్లల పాలబుగ్గల్లా ఉబ్బి ఉన్నాయి. పెదవులు పల్చగా ఉన్నాయి. గెడ్డం అసలున్నట్టేలేదు. నుదురు కనిపించడంలేదు. ఉన్నట్టుండి అతని బుగ్గలు పొంగుతున్నట్టూ, కళ్ళుమూతలు పడుతున్నట్టూ అనిపించిద్మి. బహుశా అతను నవ్వుతూండడం వల్ల అలా అనిపిస్తోందేమో! కానీ, నవ్వుతూన్న శబ్దం మాత్రం ఏమీ వినరావడంలేదు. నా తొడమీద ఉన్న చేయి ఇప్పుడు బాగా బరువెక్కినట్టనిపించసాగింది. కాస్త చేయితీయమని చెప్పుదామంటే అతనికి వినిపిస్తుందా? ఏమైనప్పటికీ, నేను అడిగి చూశాను. కానీ నా మాటలు నాకే వినిపించలేదు.

నా రెండో ప్రక్క సీటుమీద కూర్చున్నది ఒక స్త్రీ. ముక్కు పగిలిపోయేటంత దుర్గంధం ఆమె శరీరం నుంచి వస్తోంది. ఆ బాహుమూలాలనుంచి, చెమట దారలు కట్టి కారుతోంది. ఆమె తనలో తనే ఏదో గొణుక్కున్నట్టుంది. ఉండుండీ, రుమాలుతో కళ్ళు తుడుచుకుంటోంది. బహుశా ఆమె ఏడుస్తోంది కూడా. ఒకటి రెండుసార్లు ఆమె గట్టిగా అరుస్తుందేమోనన్నట్టు విడివిడి ఉండిపోయాయి. నాకైతే, ఇంకామె ఆ నోరు మూయదేమోననిపించింది.

అక్కడి నుంచి నేను నా దృష్టిని మరల్చి, డ్రైవరుకి వెనకప్రక్కన సీట్లో కూర్చున్న వాళ్ళవైపు చూశాను. అక్కడ కొందరు ప్రయాణీకుల బృందం లయబద్ధంగా తలల్నీ శరీరాల్నీ ఊపుతున్నారు. అదేదో పాటకి అలా ఊగుతున్నారేమోననిపించింది నాకు మొదట్లో. వాళ్ళమీద నాకు చాలా అసూయకూడా కలిగింది. ఇక్కడసలు చీమ దూరడానికి కూడా ఖాళీలేదు. అక్కడ వాళ్ళు చక్కగా, విశాలంగా ఉయ్యాలలూగుతున్నారు. ఒక విషయం మాత్రం విచిత్రంగా అనిపించింది. వాళ్ళసలు నోళ్ళు మెదపడంలేదు. కళ్ళు మూసుకుని నిద్రపోతున్నట్టున్నారు. బహుశా బస్సు గతుకుల రోడ్డుమీదనుంచి పరుగెత్తుతూండడం వల్ల వారలా ఊగుతున్నారేమో! ఉండుండీ వాళ్ళమీద ఏదో నీడ పడుతోంది. అది రోడ్డు ప్రక్కనున్న చెట్లనీడ అయిఉండవచ్చు. ఏమైతేనేం, ఆ నీడ అలా పడినప్పుడు మాత్రం వాళ్ళ ఆకారాలు భయంకరంగా కనిపించేవి.

నా వెనక సీట్లోంచి ఉండుండీ, పావురం బుర్రు, బుర్రు మంటున్నట్టు శబ్దం వస్తోంది. బహుశా ఏ తల్లో పిల్లని సముదాయిస్తోందేమో. ఎడం ప్రక్కనుంచి, చుట్ట పొగ రింగులు, రింగులుగా రావడంతో, నా కళ్ళు మంటలెక్కి నీరుకారసాగాయి. నా కళ్ళెదురుగా ఉన్నవన్నీ, నీళ్ళలో ఈదుతున్నట్టుగా కనిపించసాగాయి. ఒక్కసారి కళ్ళు తుడుచుకోవాలనిపించింది. కానీ నా చేతులు రెండూ, ఎక్కడో అడుగున ఉండిపోయాయి. నాకాళ్ళు తిమ్మిర్లెక్కిపోయాయి. పిసరంతైనా కదలడానికి ఆస్కారం లేదాయె.

ఇంతలో ఎవరో నా కాలిమీద బూటుకాలితో తొక్కారు. బాధతో నేను 'అబ్బా' అని పైకి చూశాను. కండక్టరు అతను తన టోపీ కళ్ళు కనిపించనంత వరకూ పెట్టుకున్నాడు. అతనిది పెద్దనోరు. పెద్ద పెద్ద బూరి బుగ్గలు. నా దగ్గరనుంచి టిక్కెట్టు డబ్బులు తీసుకోవడానికి అతను చేయిచాపాడు. తరువాత ఏమైందో ఏమో! నేను గట్టిగా కళ్ళుమూసుకున్నాను. కళ్ళు వాటంతట అనే తెరుచుకుంటున్నాయి. మూతలు పడుతున్నాయి. నా ప్రమేయం లేకుండానే. ఎవరో గట్టిగా తోసినట్టయి, నేను కళ్ళువిప్పాను.

చూద్దునుకదా నిద్దట్లో కిటికీకి అంటుకుని ఉన్నాను. నా సీటు మీదకానీ, చుట్టుప్రక్కలగానీ, పిట్టలేదు. నేనింకా కళ్ళునులుముకుని సరిగ్గా చూసే ప్రయత్నంలోనే ఉన్నాను. ఉన్నట్టుండి కిటికీలోంచి ఇక గాలికెరటం విసురుగా వచ్చింది. దానితోబాటు ఎండుటాకులు


ఎగిరిపడ్డాయి. గాలితో వచ్చిన ధూళీ, ఆకుల మధ్యలో బస్సు ఏమీ తిన్నగా కనిపించడంలేదు. హమ్మయ్య కాస్త కాలు కదుపుకుని, విశాలంగా కూర్చునేందుకు చోటు దొరికింది కదా అని సంతోషించాను. మరోసారి ప్రక్కన ఎవరూ లేరని నిర్ధారించుకున్నాను. దూరంగా ఒకరిద్దరు, హాయిగా సీట్లమీద కాళ్ళుజాపుకుని పడుకున్నట్టనిపించింది. గాలి ఎక్కువగా వీస్తున్నందువల్ల నేను కిటికీ అద్దం మూసేశాను. ఆ అద్దంలో కనిపించే ప్రతిబింబం మీద నా దృష్టి పడింది. అక్కడ నాకు బదులు మరొక విచిత్రమైన మనిషి ఉన్నట్టుగా అనిపించింది నాకు. వాడికి ఒక కన్నే ఉంది. రెండో కంటి స్థానంలో ఒక గుండ్రని రంధ్రం మాత్రం ఉంది. క్రింది పెదవి వ్రేలాడుతోంది. నోట్లోంచి ఏదో ఎర్రటి ద్రవం కారుతోంది. ఒక్కసారి నేను నా కళ్ళని నమ్మలేకపోయాను. తడిమి చూసుకున్నాను. వాటి స్థానంలో అవి బానే ఉన్నాయి. నోటి దగ్గర చెయ్యి పెట్టి పెదవుల్ని తడిమాను. అక్కడేమీ తడిలేదు. ఒక్కసారిగా నేను భయకంపితుడనయ్యాను. అయితే మరి ఆ రూపం ఎవరిది? నేను కాదా? ఏమో? అద్దానికి అటువైపు నుంచి నన్నెవరో గమనిస్తున్నట్టున్నారు. లేక? ఇది కేవలం నా భ్రాంతి మాత్రమేనా? నేను గట్టిగా అరిచాను. "కండక్టర్" అని. కానీ ఆ మాటలు నాలుగుదిక్కులనుంచీ ప్రతిధ్వనించి, మళ్ళీ నాకే వినిపించాయి. నేను నిశ్చేష్టుడనై నిలబడి ఉండిపోయాను. పరిశీలించి చూస్తే, బస్సంతా ఖాళీగా ఉంది. నేను గాఢనిద్రలో ఉండి దిగడం మరిచిపోయానేమో? పోనీ దిగిపోదామని తలుపువైపు నడిచాను. కానీ, బస్సు అతివేగంగా పరుగెత్తుతోంది. ఆ కుదుపుకి వెనక సీటుమీద కూలబడిపోయాను. డ్రైవరు సీటువైపు చూశాను. అక్కడెవరూ ఉన్నట్టనిపించలేదు. అతను దేనికోసమో క్రిందకి దిగి ఉండవచ్చుననుకున్నాను. ఆ తరువాత భయంతో, నేనటు చూడటం మానుకున్నాను. అసలీ బస్సు నడుస్తోందా? లేక ఆగి ఉందా? అన్న విషయం అర్థం చేసుకోవడం కోసం, నేను కిటికీలోంచి బైటికి తొంగి చూశాను. నాలుగు ప్రక్కలా పెద్ద మైదనంలా ఉంది. ఒక్క చెట్టూ ఉన్న ఆనవాలు కూడా లేదు. ఉన్నట్టుండి ఒక పెద్ద పక్షులగుంపు కిలకిలా రావాలు చేసుకుంటూ, నా తలమీదుగా ఎగిరిపోయింది. వాటి నీడతో అక్కడ కటిక చీకటి ఆవరించింది. కంటికేమీ కానరావడంలేదు.

కొంచెం సేపు ఉన్నాక కళ్ళు తెరిచి చూస్తే, దూరంగా ఏదో ఊరున్నట్టనిపించింది. అక్కడ ఇళ్ళు ఒకదానిమీద మరొకటి పేర్చినట్టున్నాయి. అప్పుడప్పుడూ అవి గాలిలో ఊగుతున్నట్టు కూడా అనిపిస్తోంది. అవి ఇప్పుడే కూలిపోతాయేమో నన్నభయంతో నావళ్ళు కంపించసాగింది. ఇంతలో బస్సు ఒక లోతైన ప్రదేశంలోకి దిగసాగింది. అలా లోతుకి ఇంకా లోతుకి పోతూనే ఉంది. నాలుగు ప్రక్కలనుంచీ పర్వత శిఖరాలు దగ్గరై తరుముకొస్తున్నట్టుంది. అసలే స్లోపువల్ల బస్సు అతివేగంగా నడుస్తూండడం వల్ల అవి నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. వాటిలో ఒకటి రెండు, బస్సు క్రిందపడి కూడా ఉండొచ్చు. ఎందుకంటే నాకు దీనమైన అరుపులాంటిది, లీలగా వినిపించింది.

తరువాత నేను ధైర్యం చేసి డ్రైవరు సీటు వైపు చూశాను. అక్కడ నాకొక ఆకారం మసక, మసకగా కనిపించింది. టూరిస్టుబస్సుల్లో ఉండే లౌడ్ స్పీకర్ లాంటి సాధనం ఈ బస్సులో కూడా ఉంటుందని నేనూహించలేదు. దానిలో ఎవరో ఏదో మాట్లాడుతున్నారు. కానీ గాలివీచే చప్పుడులో, నాకేమీ వినిపించడంలేదు. కిటికీలోంచి బైటికి చూస్తున్నాను. అప్పుడప్పుడూ ఒకరిద్దరు మనుషులు కనిపించినట్టే ఉంటోంది. కానీ, వాళ్ళెవరో గుర్తుపట్టే లోపలే బస్సు ఝామ్మని ముందుకి దూసుకుపోతోంది. ఉన్నట్టుండి బస్సు ఇటూ అటూ ఊగసాగింది. ఏదో మలుపు తిరుగుతోందనుకున్నాను. చేతికందిన రాడ్ పట్టుకుని నన్ను నేను బాలెన్సు చేసుకున్నాను. అటు రోడ్డువైపు చూస్తే, కొందరు మనుషులు గుంపులు గుంపులుగా బస్సు వైపు వస్తూ కనిపించారు. ఎదురుగా బస్సు అంత వేగంతో వస్తున్నా సరే, వారు తప్పుకునే ప్రయత్నం చేయడంలేదు. బస్సు వాళ్ళకి మరీ దగ్గరగా వచ్చేసింది. నా ఒళ్ళూ కళ్ళూ తిరగసాగాయి. భయంతో కళ్ళుమూసుకున్నాను. బస్సు ఒక్క కుదుపు కుదిపింది. ఎక్కడో శూన్యంలోకి వ్రేళ్ళాడుతున్నట్టనిపించింది నాకు. కళ్ళు విప్పాను. చూస్తే ఏముంది? నేను బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణీకుల మధ్యలో నిలబడి ఉన్నాను. అప్పుడొచ్చింది బస్సు.

గుంపంతా నన్నొకసారి ఒక తోపు తోసింది. బస్సులో, నేనిద్దరు మనుషుల మధ్య ఇరుక్కుని నిలబడ్డాను. ఎదురుగా ఉన్నవాడి వీపు మాత్రమే నాకు కనిపిస్తోంది. బస్సు బయల్దేరిన విషయంకూడా నాకు తెలియలేదు.

●●●



# అనువాద కథలు
## - పాలెపు బుచ్చిరాజు



## నల్లకాకి

**గుజరాతీ మూలం:** కీ.శే.ఘనశ్యామ్

**కళ్ళు తెరిచి చూశాను.** ఎడం ప్రక్కన సముద్రం ఎగిరిపడుతోంది. కానీ ఎగిరి మళ్ళీ క్రిందపడిపోతోంది. ఉవ్వెత్తున లేచిన అలలు వంకరటింకర గీతలు గీస్తూ, మళ్ళీ సముద్రంలో కలిసిపోతున్నాయి. గాలి స్థంభించడంతో, కుడిప్రక్కన వరుసగా నాటిన సరుగుడు చెట్లు, ఆకాశం నుంచి మేకులు దిగ్గొట్టినట్టు నిటారుగా, నిశ్చలంగా నిలబడి ఉన్నాయి. ఒడ్డంతా చితికిపోయిన నత్తగుల్లలు, శంఖాల పెంకులతో కలిసి మెరుస్తున్న పసుపురంగు ఇసుక. కానీ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూసినా ఎక్కడా ఒక్క జీవ జంతువు కూడా కానరావడం లేదు. అక్కడి తడి మట్టిలో నేనొక్కడినే పడి ఉన్నాను. నా చేతులూ, కాళ్ళూ ఇసుకలో సగం కూరుకుపోయి కదలకుండా మెదలకుండా ఉన్నాయి. శరీరం మీద అక్కడక్కడా ఇసుక రేణువులు అంటుకుని ఉన్నాయి. ఒక ప్రక్క కాలివ్రేళ్ళు ఇసుకలోంచి బైటికి వచ్చి కనబడుతున్నాయి. అవి తెల్లగా పాలిపోయి, ఒకదానికొకటి దగ్గరగా చేరి, చివరిభాగం కొంచెం వంకర తిరిగి ఉన్నాయి.

ఇంతలో ఎదురుగా ఆకాశంలో కనిపిస్తున్న, చిన్న నల్లని చుక్కలాంటి దానిమీద నా దృష్టిపడింది. చిక్కటి వెలుతురులో అది ఈదుకుంటూ వస్తోంది. సముద్రపు నీళ్ళరంగులో కలిసిపోయి అది కూడా పచ్చనైపోతుందేమోనని నేను మొదట్లో భయపడ్డాను. దానివైపే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాను. మరింత ధ్యాసతో చూస్తే, ఆ చుక్క క్రమక్రమంగా పరిమాణంలో పెద్దదౌతున్నట్టనిపించింది. అందువల్ల అది నావైపే వస్తోందని నేను గ్రహించాను. నా కుతూహలం ఎక్కువైంది. చూస్తూ, చూస్తూ ఉండగానే అది ఇంకా ఇంకా పెద్దది కాజొచ్చింది. ఇంతలో రివ్వున పెద్దగాలి వీచింది. చెట్ల కొమ్మలూ ఆకులూ బాగా ఊగసాగాయి. సముద్రంలో కెరటాలు మరింత పైకెగసి పడ్డాయి. అది ఒకసారి వర్తులాకారంలో తిరిగి, సముద్రం మీద వచ్చి వాలింది. అదలా ఈదుతూ, ఈదుతూ నా వైపు రాసాగింది. తరువాత అది నీటి మీదనుంచి ఒడ్డుకి వచ్చింది.

అప్పుడు నా కర్థం అయింది. అది ఒక మామూలు నల్లకాకి అని. అది దేక్కుంటూ, దేక్కుంటూ నా దగ్గరకి వస్తోంది. అదెంత దర్జాగా బోరవిడుచుకు నడుస్తోందంటే ఆ సముద్రపు ఒడ్డుని అదే లాక్కొస్తున్నట్టుగా అనిపిస్తోంది. ముందు అదీ. వెనకాలే సముద్రపు అలలు. అలా కొంతసేపటికి అది నాకు మరీ దగ్గరగా వచ్చేసింది.

ఆ కాకి బాగా నల్లగా ఉంది. కొంచెం సేపు అలాగే బుర్రవంకరగా త్రిప్పి, నా వంక చూస్తూ నిలబడింది. కానీ దాని కళ్ళు మరెక్కడో చూస్తున్నాయి. దాన్ని చూస్తూంటే నాకు అమాయకుడైన చిన్నపిల్లాడిలా అనిపించింది. అంతలోనే అది ఫర్ ఫర్ర్ అని శబ్దం చేసింది. నాలుకని అదిమిపట్టి అది దాని భావాన్ని వ్యక్తం చేస్తోంది. ఉన్నట్టుండి అది ఒక్క దూకు దూకి, నా మొకాలి మీద కూర్చుంది. దాని కాళ్ళకున్న వాడిగోళ్ళు నా మోకాలికి గుచ్చుకుంటున్నాయి. టక్..టక్.. టక్ అని చప్పుడైంది. అది నా మోకాలి దుమ్ముల్ని పొడిచి ముక్కలు చేస్తూందేమోననిపించింది నాకు. నేననుకున్నట్టుగా అది సాధారణమైన కాకి కాదు. దాని పట్టు చూస్తే అదేదో రాక్షసగణానికి

చెందినదానిలా అనిపించింది. ఇప్పుడు దాని కళ్ళు భయంకరంగా ఉన్నాయి. ఏదో తీవ్రమైన వాంఛతో, దానికళ్ళు ఇటూ అటూ దేనికోసమో వెదుకుతున్నాయి. అది ముక్కు మూసుకుని ఉండి ఉంటే నేనంత భయపడేవాడిని కాను. ఇప్పుడు దాని బలం ఏమిటో నాకు బాగా తెలిసివచ్చింది. దాని వర్తులాకారపు భయంకరమైన కళ్ళు, నలని కొనదేరిన ముక్కు, తల దగ్గర నలుపు, ముళ్ళలా గుచ్చుకునే దాని కాళ్ళు – అమ్మో! నేను చాలా భయపడిపోయాను.

అదలా నా వైపు చూస్తూనే, అక్కడి నుంచి ఎగిరి వచ్చి, నా బొడ్డు దగ్గర ఒంటికాలిమీద నిలబడింది. నల్లటి బ్రహ్మదేవుడు నా బొడ్డునుంచి ఊడిపడ్డట్టు, కొంతసేపు అలాగే నిశ్చలంగా ఉంది. తరవాత మోర పైకెత్తి, ఆకాశం వంక చూసింది. ముక్కుని గుండెలమీద రాసుకుని సానపట్టింది. దాని ముక్కు అన్ని కాకుల ముక్కులా తిన్నగా ఏమీ లేదు. శస్త్రచికిత్స చేసే వైద్యుడి కత్తెరలా చివర్న కొంచెం వంగి ఉంది. ఇంకిప్పుడు దాని కళ్ళు ఇటూ, అటూ చూడడంలేదు. దృష్టిని నా మీద కేంద్రీకరించింది. దాని కళ్ళల్లో ఉన్న తీవ్రమైన ఆకర్షణ వల్లనైతేనేమి అవి తాగి మత్తెక్కినట్టుండడం వల్లనైతేనేమి, అది నన్నేమైనా చేస్తుందన్న భయం వల్లనైతేనేమి – కారణం ఏమైనా సరే – నేను మాత్రం నా దృష్టిని దాని కళ్ళమీద నుంచి, మరోవైపు త్రిప్పడానికి అశక్తుడనయ్యాను. క్రమక్రమంగా నేను దాని కళ్ళలోకి చొచ్చుకుపోయాను.

అతీతమైన బలంతో అది నన్ను ఆకర్షించసాగింది. నేను చుట్టుప్రక్కల స్థిరంగా నిల్చున్న సరుగుడు చెట్లని, ఇసుకలో పొర్లాడే కీటకాల్నీ, సగం పైకెగిరి నిలిచిపోయిన కెరటాల్ని, అన్నిటినీ మరిచిపోయాను. అలా నన్ను చూపుల్తో బంధించిన ఆ కాకి ఇంక నా పైకి వచ్చి, నా గుండెలమీద ముక్కుతో పొడిచి టక్.. టక్.. టక్.. మని శబ్దం చేయసాగింది. అది కట్టెలమీద ముక్కుతో పొడిచి కంపాలి పిట్టగానీ కాదుకదా అని మరోసారి పరీక్షగా చూశాను. కానేకాదు. అది నిజంగా కాకే. కారు నలుపు రంగులో ఉంది. అప్పుడు అర్థం అయింది నాకు దాని ముక్కు శస్త్రవైద్యుడి కత్తెరలా వాడిగా ఎందుకుందో.

మొదట్లో అది కత్తెరతో కత్తిరించినట్టుగా, దాని ముక్కుతో నా చర్మం కత్తిరించింది. చక్కగా తిన్నని గీతలు గీసినట్టుగా తరువాత ముక్కుతో ఒక దగ్గర తవ్వసాగింది. కొంచెం లోతుగా తవ్వాక, ఠక్కున రెండు నరాలు ముక్కుతో పైకిలాగింది. నాకు చాలా బాధ కలిగింది. కానీ ఒక్క అరుపు కూడా నా నోటినుంచి పెగల్లేదు. దాని ముక్కు ఆ నరాల నుంచి వేరుపడినప్పుడు, దానినుంచి ఎర్రని ద్రవం కారసాగింది. అప్పుడది ముక్కు తెరిచిపెట్టి, ఆకాశవైపు తలెత్తి చూసింది. దానితో, ఆ ద్రవం కొంతదాని గొంతులోకి దిగింది. గుటుక్కుమన్న శబ్దం వినిపించింది.


ఆ ముక్కు తెరిచి ఉన్నప్పుడు అది నవ్వుతోందేమో అనిపించింది నాకు. మళ్ళీ బుర్ర క్రిందకి దింపి, రెండు నరాల్లోనూ, ఒక నరాన్ని పుటుక్కున తెంపింది. దాన్ని గుండెలమీద పెట్టి ముక్కుతో పొడవసాగింది. నేను కెవ్వున అరిచాను. కానీ అది లోలోపలే అణగారిపోయింది. అసలా కాకి దాన్ని వినదే వినలేదేమో? ఎందుకంటే, అది ఆ నరాన్ని పీకుతూ, ద్రవాన్ని తాగుతూ, మహదానందాన్ని అనుభవిస్తోంది. ఒక్కసారి ముఖాన్ని పైకెత్తింది. చిన్న చిన్న ఎర్రని నరం ముక్కలు దానితోబాటు పైకి వచ్చాయి. వాటిలో ఒకటి ముక్కుకొసని వ్రేలాడుతోంది. దానునుంచి రక్తం బొట్టూ, బొట్టూ కారుతోంది. రక్తంతో దాని ముక్కు ఎర్రగా అయింది. ఒక మాంసం ముక్క దాని నోట్లోకి జారి సర్రున లోపలికి పోయింది. తరువాత అది ముక్కుని రెక్కలకి రాసుకుని శుభ్రం చేసుకుంది. అప్పుడు కొంచెం రక్తం దాని రెక్కలకి కూడా అంటుకుంది. ఇప్పుడు దాని ప్రవర్తనలో కొంత మార్పు వచ్చింది. ఉన్నట్టుండి సైజులో కొంచెం పెద్దదైందేమోకూడా అనిపించింది. మరింత భయంకరంగా కనిపించింది. ఉన్మాదం ఎక్కిన దానిలా రక్తనాళాల్ని ఒక్కొక్కటిగా ఊడబీకసాగింది. గుట్టగా పడిన నరాలు ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయాయి. అలిసిపోయి, తదేకంగా నన్నే చూడసాగిందది. అదేదో సమ్మోహనాస్త్రంలా నా కళ్ళు దానిమీదనుంచి కదలలేకపోతున్నాయి. లోలోపల్నుంచే నన్నెవరో లాగేస్తున్నట్టుగా ఉంది.

ఆ తరువాత అది రెక్కలల్లార్చింది. ఆకాశం అంతా మూసుకుపోయి. నా కళ్ళముందు చీకటికమ్మేసింది. ఆ చీకట్లో దాని కళ్ళు మాత్రం మెరుస్తున్నాయి. వాటి ఆకర్షణలో పాశవికత ఉందనిపించింది నాకు. నేను నిస్సహాయుడనై పోయాను. శరీరం నా వశం తప్పిపోయింది. అది నా గుండెల లోతుల్లోకి పొడిచి నరాలు పీకుతూంటే, బాధ భరించలేక ఛీత్కారం చేశాను. కానీ దాని చెవిటి చెవులకది వినిపిస్తేగా!

హఠాత్తుగా అది విసురుగా రెక్కలల్లారుస్తూ పైకెగిరింది. ఎవరో, నా నుంచి నన్ను వేరుచేసినట్టుగా, దానివెనకాలే నేనూ ఎగిరానేమోననిపించింది. ముందుగా అది సముద్రపు ఒడ్డునే ఎగురుతూ వెళ్ళింది. అతివేగంగా ఎగురుతోందది. దానివెనకే నేను. ఉన్మాదంతో నన్ను నేను మరిచిపోయి, రెక్కలు విచ్చుకుని దానివెంట ఎగురుతున్నాను. కానీ దాని వేగాన్ని నేను అందుకోలేకపోతున్నాను. సముద్రపు ఒడ్డుచుట్టూ తిరిగి, తిరిగి అది మేఘాల్లోకి అదృశ్యమైపోయింది. నేనా మేఘాలకి ఆవలివైపు వెళ్ళిచూశాను. కానీ అక్కడ నాకేమీ కనిపించలేదు. ఆ విశాలాకాశంలో నేనొక్కడినే విడివడిపోయి, ఒంటరిగా అనిపించింది.

ఇప్పుడు ధ్యానంగా నా వైపు చూసుకున్నాను. నా కడుపులో అగ్నిజ్వలిస్తోంది. నేను లోపలనుంచీ కాలిపోతున్నట్టుగా అనిపించింది. నేను తెగించి, రెక్కలు గట్టిగా ఊపాను. శబ్దం అయింది. సముద్రం మీదుగా, సరుగుడు చెట్ల మధ్యనుంచి నేను వెనక్కి వచ్చాను. అక్కడ సముద్రపు ఒడ్డున నాకొక చిన్న మచ్చలాంటిది కనిపించింది. నాలుగువైపులా ఆవరించి ఉన్న పసుపురంగులో కలిసిపోయి అదీ పచ్చగానే ఉందనిపించింది నాకు. కడుపుని దహించివేస్తున్న అగ్ని బాధకి తట్టుకోలేక, నేను సముద్రపు నీటిలోకి ఉరికేశాను. కెరటాలు నన్ను ఎత్తిపట్టుకుని, ఒడ్డుకి చేరవేశాయి. ఇసకలోకి ఉరికి ముందుకు నడిచాను. అక్కడ తడిసిన ఇసకలో సగం కప్పబడి ఉన్న మానవ దేహం ఒకటి కనిపించింది. ఇసకలోంచి కొంచెం బైటకి వచ్చి, కనిపిస్తున్న దాని కాలివ్రేళ్ళు, తెల్లగా పాలిపోయి ఉన్నాయి. ఒకదానికొకటి దగ్గరగా, పైభాగం కొద్దిగా క్రిందకి వ్రాలిపోయి. ఆ క్షణంలో నేను చాలా ఆనందం అనుభవించాను. కాని, నా భావోద్వేగాన్ని మనసులోనే అణచిపెట్టుకున్నాణు. దానిని సమీపించి మోకాలిమీద వ్రాలాను. పంజాతో దాని మోకాలుని అదిమి పట్టాను 'కడక్' మని శబ్దం అయింది. అప్పుడు నేను దాని ఆకారం గమనించాను. దానిని పసికట్టుతూనే క్షణం పాటు నివ్వెరపోయాను

●●●



# అనువాద కథలు

## - పాలెపు బుచ్చిరాజు



## *ఊసరవెల్లి*

*గుజరాతీ మూలం: కీ.శే.ఘనశ్యామ్ దేశాయ్*

**మెయిన్ రోడ్డు మీదనుంచి చిన్న సందులోకి తిరిగి,** కుడి చేతి వైపున్న రకరకాల ఆకారాల్ని దాటుకుంటూ లోపలికి వెళ్తోంది ఓ బస్సు. అలా పోయి పోయి, అయిదో బంగ్లా దగ్గర ఆగిపోయింది. అదే దాని గమ్యస్థానం. అది వాహనలేవీ వచ్చిపోయే మార్గం కాదు. మనుషులు తిరగడం కూడా అంతంత మాత్రమే. ఆకుపచ్చని చెట్ల మధ్య పచ్చిక మైదానంలో ఆలమంద కూర్చున్నట్టుగా అవి, రంగు రంగుల నాలుగైదు బంగ్లాలు. ఎదురుగా, ఎవరూ ఎప్పుడూ వాడని ఓ పచ్చిక మైదానం. అంతా నీరవ నిశ్శబ్దం. మధ్యాహ్న సమయంలో చెట్ల కొమ్మల సందుల్లోంచి పడే ఎండకి వేడెక్కిన తారు రోడ్డు మీద గాలికూడా, రాక్షసుల నోళ్ళలా తెరిచి ఉన్న ఆ ఇళ్ళ సింహద్వారాల్లోంచి లోనికి వెళ్ళడానికి సంకోచిస్తుంది. అందుకే అక్కడంతా శూన్యం ఆవరించి ఉన్నట్టనిపిస్తుంది. నెమ్మదిగా సాయంత్రానికి కొంత చలనం కనిపిస్తుంది. శూన్యంలోకి ప్రాణం వస్తుంది. వాతావరణపు నరాల్లో, రక్తం ప్రవహించసాగుతుంది.

●●●

అయిదో నెంబరు బంగ్లాలోకి కార్తీక్ అతని తలిదండ్రులూ వచ్చి, రెండు మూడు నెలలయింది. వారికా ఇల్లు బాగా నచ్చింది. మొదట్లో ఇల్లు సర్దుకోవడానికి కొంత సమయం పట్టింది. తరువాత ఇరుగు పొరుగు ఎవరో తెలుసుకోవాలనిపించింది. ముందుగా పక్కింటి మి.మహెతా, అతని పత్నీతో పరిచయమయింది. వాళ్ళు చాలా మంచివాళ్ళు. 'మా చేతనైన సహాయం ఏమైనా ఉంటే చెప్పండి తప్పకుండా చేస్తాం' అని ముందే చెప్పారు వారు. వారం రోజుల తరువాత ఓ సాయంత్రం పూట వాళ్ళింటికి కలవడానికి వెళ్ళారు. మి.మహెతా కాస్త లావుగా ఉంటాడు. భూతద్దాల కళ్ళజోడు అతని వయసుని మరింత ఎక్కువ చేసి చూపుతోంది. కుశలప్రశ్నలు అయిన తరువాత, మాటలు వివిధ విషయాల మీదికి మళ్ళాయి. పురుష పుంగవులిద్దరూ, తమ తమ బుద్ధి విశేషాల్ని చూపిస్తున్నారు.

ఆడవాళ్ళిద్దరూ, రంగు, రూపం, జుట్టు, ఆభరణాలూ వగైరాల విలువల్ని, తులనాత్మకంగా పరిశీలించుకుంటున్నారు. సంభాషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంతసేపూ కార్తీక్ నిశ్శబ్దంగా కూర్చుని వాళ్ళ మాటలు వింటున్నాడు. కొంచెం నెర్వస్‌గా కూడా ఫీలవుతున్నాడు. ఇక మాట్లాడడానికేమీ లేదన్న సమయంలో మి.మహెతా దృష్టి కార్తీక్ మీద పడింది. అవును. వారింకా అతన్ని పలకరించనేలేదు.

"ఏం చదువుతున్నావు బాబూ?" వీలైనంత ప్రేమపూర్వకంగా అడిగాడు మహెతా.

కార్తీక్ ఏమీ మాట్లాడలేదు. మి.మహెతా లేచి అతని దగ్గరగా వెళ్ళాడు. చేయిపట్టుకుని, ఒళ్ళోకి తీసుకున్నాడు. కార్తీక్ మౌనం వీడలేదు. అతని తండ్రికి కోపం అయితే వచ్చింది కానీ, దానిని లోలోపలే అణచిపెట్టుకున్నాడు.

"ఏం మాట్లాడవు?" మి.మహోతే మళ్ళీ అడిగాడు, "మీ కొత్త ఇల్లు నీకు నచ్చిందా లేదా?"

కార్తీక్ తల్లి మధ్యలోనే అందుకుని అంది. "అంకుల్ అడుగుతున్నారు. నువ్వు సమాధానం చెప్పాలి. ఏం చదువుతున్నావు?" "ఇతని నోట్లో నాలుకే లేదు" ఏదో పెద్ద జోకేసినట్టు హి..హి..హీ.. అని పెద్దగా నవ్వాడు. మి.మహోతా.

కానీ, కార్తీక్‌కి ఆ జోకేమీ అంతనచ్చలేదు. అతను మూతి ముడుచుకున్నాడు. అప్పుడతని తండ్రి అతనివైపు గ్రుడ్లురుమి చూస్తూ, గట్టిగా అన్నాడు. "చెప్పు నీకు ఆ పాట వచ్చును కదా! అది పాడు" ఆ స్వరంలో చెప్పకపోతే చూడు ఏం చేస్తానో అన్న బెదిరింపు స్పష్టంగా వినిపిస్తోంది. కానీ, అది కార్తీక్ మాత్రమే అర్థం చేసుకోగలడు. అతను తండ్రివైపు చూశాడు. ఆయన కళ్ళు చూశాడు. భయంతో వణికిపోయాడు. ఒక్కసారిగా లేచి నుంచున్నాడు. రెండుచేతులూ జోడించి నిర్జీవ ప్రతిమలా నిలబడి కళ్ళుమూసుకున్నాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది. బైట ఎక్కడో రేడియో ఒకటి కర్కశ స్వరంతో పాడుతోంది. బైటినుంచి వీచే గాలికి. పంఖాలు నెమ్మదిగా తిరుగుతున్నాయి. కార్తీక్ తను కంఠస్థం చేసిన పాట పాడసాగాడు.

"మై కంట్రీ ఈజ్ ఇండియా

అయామ్ ఎ బ్రేవ్ సన్..ఐలవ్.."

పాట కొంచెం పెద్దదిగనే ఉంది. పాడుతూ, పాడుతూ మధ్యలో కార్తీక్‌కి ఆయాసం వచ్చింది. పాట పూర్తికాగానే, మి.మహోతా అతని భుజం తట్టుతూ అన్నాడు. "ఇంత బాగా పాడుతున్నావు. సిగ్గుపడతావెందుకు?" కానీ, కార్తీక్‌కి అదంతగా నచ్చలేదు. అతను ముభావంగా శూన్యంలోకి చూస్తూ నిలబడ్డాడు. అతని నీలి, నీలి కళ్ళు వాసనలేని పుష్పంలా భావవిహీనంగా ఉన్నాయి.

●●●

కార్తీక్ ఉన్నట్టుండి హడిలిపోయాడు. అతని కాళ్ళదగ్గర్నుంచి ఏదో పాక్కుంటూ వెళ్ళి తుప్పల్లోకి పారిపోయింది. బంగ్లాల్లోని మిగిలిన పిల్లలు అక్కడ చేరి దొంగాట ఆడుకుంటూంటే అతనక్కడ నిలబడి చూస్తున్నాడు. అతనా ఆటపాటల్లో చేరలేదు. భయంతో అతనిటూ అటూ చూశాడు. పిల్లలందరూ ఎక్కడెక్కడో దాక్కుని ఉన్నారు. అతని నీలికళ్ళు ఆ తుప్పల్లోకే చూస్తున్నాయి. ఒక ఊసరవెల్లి ఎర్రపువ్వుల మొక్క కొమ్మమీదికెక్కి, అక్కడ కూర్చుని బుర్ర ఊపుతోంది. దాని ఎర్రని నాలుక లోపలికీ పైకీ ఆడిస్తోంది. దాన్ని చూసి కార్తీక్‌కి ఉడుకుమోతుతనం వచ్చింది. క్రిందికి వంగి ఒక రాయితీసి దానిమీదికి గురిచూసి విసిరాడు. ఊసరవెల్లి ఠక్కున క్రిందపడింది. దాని మూతి తెరుచుకుని ఉంది. వణికిపోతూ, శ్వాసకోసం గిలగిలా కొట్టుకోసాగింది. అది ఎగిరెగిరిపడుతోంది. దాని తోక ఇటూ అటూ కొట్టుకుంటోంది. అది చూసి, కార్తీక్ చప్పట్లు కొడుతూ, దానిమీదికి, మరోరాయి విసిరాడు. ఈ రెండో దెబ్బకి అది తట్టుకోలేక పోయింది. దాని తెల్లని కడుపులోపలికి పోయింది. నోరు మూతపడిపోయింది. తోక కొట్టుకోవడం ఆగిపోయింది. అదింక కదలలేదు.

"దొరికాడు.. దొరికాడు.. దొంగ దొరికాడు" పెద్ద కేక వినిపించింది. స్థంభాల వెనకా చెట్లచాటున దాక్కున్న పిల్లలంతా బైటికి వచ్చారు. ఎండ తీవ్రంగా ఉంది. అంతా చెమటతో తడిసి ముద్దలై ఉన్నారు.

"అయ్యయ్యో! పాపం చచ్చిపోయింది." అందొక అమ్మాయి ఊసరవెల్లిని చూసి.

"చావవలసిందే" మరొకరు అన్నారు." ఆవేళ మేడమీద ఆడుకుంటున్న పిల్లి పిల్లని తినేయబోయింది. పాపం అదెలాగో తప్పించుకుని, నేలమీదికి దూకేసింది. కాలు విరిగిపోయి ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉందా పిల్లిపిల్ల. ఆ పాపం అంతా తగలదూ మరి దీనికి?

"వచ్చే జన్మలో ఇది మళ్ళీ పిల్లిపిల్లై పుడుతుంది. అప్పుడు దీని కాలు కూడా ఇలాగే విరిగి, కుంటుకుంటూ నడుస్తుందిట. ఇలా అని చెప్పింది మా అమ్మ."

పిల్లలందరి చూపులూ కార్తీక్ పైనే ఉన్నాయి. అతను పరుగెత్తుకుంటూ లోపలికి పారిపోయాడు.

●●●

హఠాత్తుగా పెద్దగాలి వీచసాగింది. చెట్ల కొమ్మల మధ్యనుంచి వచ్చి, పరదాల్ని ఫట ఫటలాడిస్తున్న గాలి చేసే చప్పుడు చిత్రంగా ఉంది. కిటికీ దగ్గర పెట్టిన పూలకుండీ క్రిందపడి పగిలిపోయింది. గోడమీది ఆల్ఫ్స్ పర్వతాలమీద మంచు కురిసే దృశ్యం ఉన్న కేలండరు అయిదారుసార్లు టపటపా కొట్టుకుంది. మి.మహెూతా చికాకు పడ్డాడు. లేచి నిలబడ్డాడు. పై అంతస్తులోని కిటికీ గుండా బైటికి తొంగి చూశాడు. ఇది వర్షం పడేముందు వచ్చే సూచన. ఆకాశమంతా ధూళి ఆవరించింది. వాతావరణం మసక మసకగా ఉంది. ఆ ధూళిలోంచే మి. మహెూతా రోడ్డుమీద చెట్ల క్రింద ఒక నీలిరంగు స్కూలు బస్సు ఆగి ఉండడం గమనించాడు. ఆయన కళ్ళజోడు సరిచేసుకుని మరొక్కసారి పరీక్షగా చూశాడు. ఒక డ్రైవరు లాంటి మనిషి, సీట్లో అడ్డుగా పడుకుని నిద్రపోతున్నాడు. రెండోవాడు – ఇతను తప్పకుండా కండక్టరే అయి ఉండాలి. ఒక కుర్రవాడితో ఆడుకుంటున్నాడు. ఆ పిల్లవాడెవరై ఉండొచ్చునబ్బా? కార్తీక్‌లా కనిపిస్తున్నాడే అవును అతను కార్తీకే. కండక్టరతన్ని బలవంతంగా పట్టుకుని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. మి.మహెూతా జాగ్రత్తగా చూశాడు. ఇంతట్లో అతను పట్టు విడిపించుకుని, వెళ్ళి డ్రైవరు ప్రక్కన కూర్చున్నాడు. డ్రైవరు అతన్ని ఎత్తుకుని గుండెలకి హత్తుకుని ముద్దులతో నింపేశాడు. కార్తీక్ క్రిందికి దిగడానికి గింజుకుంటున్నాడు. అంతదూరం నుంచీ కూడా అంతా స్పష్టంగా కనిపిస్తోంది. కార్తీక్ ఇలా క్రిందికి దిగగానే డ్రైవరు గట్టిగా నవ్వసాగాడు. కార్తీక్ అక్కడినుంచి దౌడు లంకించుకున్నాడు. కానీ, కండక్టరు అతన్ని పట్టుకుని తన రెండు కాళ్ళ మధ్యా బంధించాడు. మి.మహెూతా ఇదంతా చూసి ఆశ్చర్యపోయాడు. 'అరెరే! ఈ అలగా జనాన్ని నమ్మడానికి వీల్లేదు. అదేంటి? అలా చేస్తున్నారు? ఈ కార్తీక్ ఎంత మంచి బాలుడు కాని, వీళ్ళ సాంగత్యంలో ఎలా చపలచిత్తుడుగా మారిపోయాడు' అనుకున్నాడు. ఆ తరువాత ఆయన తన కళ్ళతో చూసింది తానే నమ్మలేక కళ్ళు మూసేసుకున్నాడు. కొంచెం సేపయ్యాక కళ్ళు తెరిచి చూస్తే, డ్రైవరు తన స్థానంలో కూర్చుని బస్సు స్టార్ట్ చేస్తున్నాడు. ఆ బస్సు వెళ్ళిపోయిన తరువాత కూడా ఆయన అలా చాలాసేపు కిటికీ దగ్గర కూర్చుని బైటికి చూస్తూనే ఉన్నాడు. 'ఈ ప్రపంచాన్ని నమ్మడానికి వీల్లేదు' అనుకుంటూ, నిస్పృహలతో బుర్ర తాటిస్తూ.

●●●

మి.మహెూతా కాలింగ్ బెల్ నొక్కాడు. కార్తీక్ వాళ్ళమ్మ వచ్చి తలుపు తీసిద్మి. కార్తీక్ క్రిందకి ఆడుకోవడానికి వెళ్ళాడు. తండ్రి సోఫా మీద కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నాడు. మి.మహెూతా రావడం చూసి, "రండి రండి" అంటూ సాదరంగా ఆహ్వానించాడాయన్ని.

"నేను మీకొక ముఖ్యమైన సలహా ఇద్దామని వచ్చాను." మి.మహెూతా లోపలికి వస్తూనే అన్నాడు.

"యు ఆర్ మోస్ట్ వెల్ కమ్" అంటూ, కార్తీక్ తండ్రి భార్యకి 'చాయ్' పెట్టమని ఆర్డరు జారీ చేశాడు.

ఆమె లోపలికి వెళ్ళింది. ఇప్పుడు వారిద్దరే అక్కడ మిగిలారు.

"ఉదయం కార్తీక్ స్కూలుకి వెళ్ళే బస్సు ఎన్నిగంటలకి వస్తుంది?"

"పదిగంటలకి."

"మళ్ళీ ఎప్పుడు బయల్దేరుతుంది?"

"పదిన్నరకి ఓ అరగంట ముందుగా వస్తుంది."

"అయితే రేపట్నుంచీ కార్తీక్‌ని ముందుగా క్రిందకి పంపకండి. సరిగ్గా పదిన్నర అయ్యాకే క్రిందకి దిగనివ్వండి."

"అదేం? అలా అన్నారు?"

"ఆ బస్సు డ్రైవరూ, కండక్టరూ అంత మంచివాళ్ళు కాదు."

"అంటే? వాళ్ళు గూండాలా?"

"ఏమో? ఎవరికి తెలుస్తుంది? కార్తీక్ తో వాళ్ళ ప్రవర్తన ఏమంత బాగాలేదు. బహుశా ఆ కుసంస్కారం మనవాడికీ అలవడవచ్చు. అందుకే మీకు చెప్పాలని వచ్చాను."

"మంచిదయింది. మీరు చెప్పడం. రేపట్నుంచీ, సరిగ్గా టైముకే క్రిందికి పంపుతాము. మీరింత శ్రమతీసుకుని మమ్మల్ని హెచ్చరించినందుకు చాలాచాలా కృతజ్ఞులం."

చాయ్ తీసుకుని మి.మహెతా వెళ్ళిపోయాడు.

●●●

మర్నాడు కార్తీక్ తల్లి మి.మహెతా ఇంటి కాలింగ్ బెల్ నొక్కింది. మి.మహెతా వచ్చి తలుపు తీశాడు. ఆమె చాలా భయకంపితురాలై ఉంది. ఇటూ అటూ చూసి ఎవరూ లేరని నిర్ధారించుకుని వణికిపోతూ లోపల అడుగుపెట్టి ఇలా అంది.

"మీరు నిన్న కార్తీక్ గురించి వాళ్ళ నాన్నతో చెప్పడం చాలా ప్రమాదం అయింది. రాత్రి ఆయనకి చాలా కోపం వచ్చింది. తెల్లవార్లూ ఆయన కార్తీక్‌ని చితకబాదేశాడు. పాపం వాడు ఏడిచి ఏడిచి గదిలోనే ఓ మూల పడుకుని నిద్రపోయాడు. రాత్రంతా వాడు నిద్దట్లో బెదురుతూనే ఉన్నాడు" ఆమె కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"అయ్యయ్యో నాకు చాలా బాధగా ఉంది. ఆయనలా రియాక్ట్ అవుతారని నేననుకోలేదు." మి.మహెతా మొహం వెలవెలబోయింది.

ఆమె కళ్ళు తుడుచుకుంటూ అంది. "పిల్లలు ఆటపాటల్లో ఏవో తప్పులు చేస్తారు. అంతలో ఏం పోయింది? ఎవరైనా చిన్నపిల్లవాడిని అలా కొట్టుకుంటారా? కానీ ఆయన నైజమే అలాంటిది. కోపం వస్తే ఒళ్ళు మరిచిపోతారు. నేనెవరికి చెప్పుకునేది?"

"పోనీ నేను వచ్చి సర్ది చెప్పనా?"

"వద్దు. వద్దు. మరిచిపోయి కూడా అలాంటి తప్పు చేయకండి. నా పని అయిపోతుంది. ఆయనకి ఎప్పుడు కోపం వస్తుందో, ఎప్పుడు ఎవరిమీద ఎగిరిపడతారో చెప్పలేం. అప్పుడాయన గ్రుడ్డివాడైపోతారు. దాని ప్రభావం కార్తీక్ మీదకూడా పడసాగింది. కానీ ఏం చేయగలం? ఈసారి అలా ఏమైనా జరిగితే మీరు ముందుగా నాకు చెప్పండి" తరువాత ఆమె మిసెస్ మహెతాతో మాట్లడడానికి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

●●●

కార్తీక్ చాలా భయపడిపోయాడు. మైదానంలోని ఒక గొయ్యి దగ్గర మూలకి పరుగెత్తుకుంటూ వెళ్ళి దాక్కున్నాడు. వాళ్ళ నాన్న గోతి దగ్గరికి వచ్చి, నిలబడ్డాడు. ఆయన చేతిలో పెద్ద పెద్ద రాళ్ళున్నాయి. ఆయన గట్టిగా అరిచాడు. అలా అరుస్తూండగానే ఆయన మొహం మీద నల్లని వెంట్రుకలు మొలవసాగాయి. నుదుటిమీదా, బుగ్గలమీదా, పెదవుల మీదా, దంతాలపైనా నల్ల నల్లని చిక్కటి జుత్తు మొలవసాగింది. కొంచెంసేపటిలోనే అది పెరగసాగింది. ఆఖరికి ఆ జుత్తు ఆయన ముఖం అంతా ఆవరించింది. రెండు మెరుస్తున్న భయంకరమైన కళ్ళు, రాక్షసుడి కోరల్లాంటి రెండు కోరలూ మాత్రం ఆ జుత్తు మధ్యలో కానవస్తున్నాయి. ఆయన మళ్ళీ అరుస్తూ, కార్తీక్‌ని పట్టుకోవడానికి ఒక ఉరుకు ముందుకి ఉరికాడు. కానీ, కార్తీక్ ముఖం చేతుల్తో కప్పుకుని, దూరంగా పారిపోయి దాక్కున్నాడు. ఇంతలో ఆయన నాలుగుకాళ్ళ జంతువులా మారిపోయాడు. ఆయన శరీరం మీద బెబ్బులిలా పులిచారలు వచ్చాయి. ఆయన పులిలా గాండ్రిస్తూ, ఆ గోతి చుట్టూ గెంతుతూ తిరగసాగాడు. ఆయన నుంచి తప్పించుకోవడానికి కార్తీక్ మూల మూలల్ని నక్కినక్కి దాక్కోసాగాడు. ఆ గొయ్యి అంతా క్రమంగా ఎర్రగా మారింది. ఆకాశం అంతా ఎర్రగా అయిపోయింది. రాక్షసుడి నోట్లోంచి, దంతాల్లోంచీ రక్తం ధారలు కట్టి కారసాగింది. హఠాత్తుగా ఆయన గోతిలోకి ఒక్కదూకు దూకాడు. కార్తీక్ అరుపు గట్టిగా వినిపించింది.

●●●

పై అంతస్తు బాల్కనీలో కార్తీక్ నిలబడి ఉన్నాడు. అతని ముఖం అంతా గీరుకుపోయి ఉంది. ఈరోజు ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై ఉంది. ఏ రావణుడో గాలిని వీచకుండా బంధించి ఉంచాడు. నిశ్చలంగా నిటారుగా నిలబడిన చెట్లు భయంకరంగా ఉన్నాయి. కుక్క ఒకటి ఘోరంగా అరుచుకుంటూ ప్రక్క సందులోకి పారిపోయింది. రోడ్డు మీద చెట్టునీడలో బస్సునాపుజేసి ఇద్దరు మనుషులు క్రిందికి దిగారు. బాదం చెట్టు దగ్గరికి వచ్చి ఆగారు. వారిలో నీలి రంగు బుష్ షర్టు వేసుకున్న ఒకడు చేతులు వెనక్కి పెట్టి నుంచున్నాడు. రెండోవాడు పాంటు క్రిందినుంచి మడత పెట్టి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. అతను స్కూలు బస్సు డ్రైవరు. అతని కళ్ళు కోపంగా ఉన్నాయి. ఎవరో తనపై చాడీలు చెప్పినందుకు అతనికి చాలా రోషంగా ఉంది. అతను పైకి చూస్తున్నాడు. పైన బాల్కనీలో నిలబడిన కార్తీక్ ద్వారా వాడెవరో తెలుసుకోవాలి. అతను సమయం కోసం వేచి ఉన్నాడు. ఉన్నట్టుండి కార్తీక్ వ్రేలితో ఎటో చూపిస్తునట్టు గ్రహించాడతను. వెంటనే బాదం చెట్టు క్రిందనుంచి ముందుకి వచ్చాడు. ఆ ఇంటి తలుపు దగ్గరకి వచ్చి నిలబడ్డాడు. అతని కళ్ళలో బాధ నిండి ఉంది.. అతని కళ్ళలో బాధనిండి ఉంది. అతను మెట్లవైపు చుశాడు. ఒక వ్యక్తి మెట్లు దిగి ఇంట్లోంచి బైటికి వచ్చాడు. అతనా వ్యక్తిని గుర్తుపట్టి, నిశ్చేష్టుడయ్యాడు. ఆయన కార్తీక్ తండ్రి. పలకమీద రాసిన అక్షరాలు చెరిపేసినట్టు అతని మనసులోని కఠోరత అంతా చెరిగిపోయింది. ఆ తరువాత అతను బస్సులో కార్తీక్‌ని చాలా ప్రశ్నలు వేశాడు. కానీ, కార్తీక్ ఏమీ మాట్లాడలేదు నిశ్శబ్ధంగా కూర్చున్నాడు.

●●●

ఎండలు ఎక్కువయ్యాయి. బాగా ఉక్కపోతగా ఉంది. భూమిలోంచి, చిన్న చిన్న కన్నాల్లోంచి ఎర్రచీమలు నాలుగు కాళ్ళతో గెంతుకుంటూ బైటికి వచ్చాయి. కొన్ని చెట్టు కాండం మీద, కొన్ని నేలమీద రాలిన ఎండుటాకుల మీద, కొన్ని నల్ల మట్టిబెడ్డల మీద చరచరా ఎక్కేశాయి. వాసన చూసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. నాలుగుప్రక్కలా గోల మొదలయ్యింది. ఒకటి మూతి శుభ్రం చేసుకుంటుంటే మరొకటి మీసాలు త్రిప్పుతోంది. ఒక్కొక్కటి కాలితో వీపు గోక్కుంటోంది. ఇంతలో రెండు మూడు చీమలు సాహసించి, పసికట్టిన వాసనవైపు ప్రయాణించాయి. దగ్గరైన కొద్దీ వాసన ప్రభావం ఎక్కువ కాసాగింది. దానితో త్వరలో అవి అక్కడికి చేరుకోగలిగాయి. ఆహారం చూసిన ఆనందంతో వెంటనే వెనక్కి వెళ్ళి అరక్షణంలోనే మిగిలిన మిత్రులందరినీ పిలుచుకొచ్చి, చచ్చిపడిఉన్న ఊసరవెల్లి శరీరాన్ని చూపించాయి. ఇక ఆలస్యం చేయకుండా కొన్ని దాని తోకమీదా, కొన్ని ఎర్రని కళ్ళమీదా కొన్ని దాని శరీరం మీద ఎండిన రక్తం మీదా దాడిచేశాయి. కొద్ది క్షణాల్లోనే ఎర్రచీమల పెద్దగుంపొకటి ఆ ఊసరవెల్లిని పూర్తిగా ఆవరించేసింది. అవన్నీ కలిసికట్టుగా దాని శరీరాన్ని నెమ్మదిగా ఈడ్చుకుంటూ చెట్టుదాకా తీసుకుపోయాయి. నేలమీదనుంచి పైకెత్తి ముందుగా ఊసరవెల్లి ముఖభాగాన్ని చెట్టుతొర్రలోకి తోశాయి. ఆ తరువాత కాళ్ళూ, కడుపూ ఇంకొక్క తోపులో తోకా ఒక చీకటి గహ్వరంలోకి అదృశ్యమైపోయాయి.

ఆఖరికి నేలమీద మిగిలినవి ఆ ఊసరవెల్లిని చీమలు లాక్కెళ్ళినప్పుడు పడిన నేలమీది గీతలు, ప్రక్క ప్రక్కనే చీమలు నడిచిన బాటలు.

●●●




## ప్రతీకారం గుజరాతీ మూలం: కీ.శే.ఘనశ్యామ్ దేశాయ్

**ముసలాయన లోలోపలే గొణుక్కోవడం ప్రారంభించాడు.** అతని రెండో భార్య, శాంతాబాయి బైటికి వెళ్ళే ప్రయత్నంలో, ఇంట్లో ముస్తాబవుతోంది. పల్చని పాము కుబుసం లాంటి గులాబీ రంగు చీర, కొత్తగా కొన్న చెప్పులు, విరబోసుకున్న జుత్తుకి రెండు పూల చెండులు, మొహానికి పఫ్‌తో అద్దిన పౌడరు...

అంతే. ఆమె ఇలా బైటికి వెళ్ళిందో లేదో, ఈయన చటుక్కున మంచం మీంచి లేచి కూర్చున్నాడు. ఒంటరిగానే, గాలిలో చేతులూపుతూ, మాట్లాడసాగాడు. 'ఇదేమీ బాగోలేదు. వయసుడిగాక ఈ అలంకారాలేం శోభనిస్తాయి? ఒళ్ళంతా అత్తరు పూసుకుని, జడలో పువ్వులు తురుముకుని, కాళ్ళకి మువ్వల పట్టీలు వేసుకుని బురదలో పొర్లిన పందిలా... చూసినవాళ్ళు దెయ్యమో, భూతమో అనుకుంటారేమోనన్న ఇంగిత జ్ఞానమైనా లేదు. ఇంకా లౌకిక సుఖాల మీద మమకారం పోలేదు. రామా కృష్ణా అనుకునే రోజులొచ్చాయి. భేతాళుడిలా దీనికి బ్రహ్మజ్ఞానం అలవడలేనట్టుంది.'

'హీ..హీ..హీ..హీ'. ముసలాయనకి నవ్వొచ్చింది. కానీ, బాహాటంగా నవ్వలేదు. ఉబికి వచ్చే నవ్వుని, లోలోపలే దంతాలతో అదిమి పట్టాడు. భయం, భయంగా ఇటూ, అటూ చూశాడు. మూలనపడి ఉన్న చెక్కకాలు తీసి మోకాలు వరకూ విరిగిన కాలికి తగిలించాడు జాగ్రత్తగా క్రిందికి దిగాడు. మెక్కుకుంటూ, మెక్కుకుంటూ, లాబీవరకూ వెళ్ళాడు. దూరంగా వీధి చివర్న, శాంత నడిచి వెళ్తూ కనిపించింది. అతనొక్కసారి కాండ్రించి ఉమ్మేశాడు. తిరిగి లోపలికి వచ్చాడు. అతనికి చాలా కోపం వస్తోంది. మొహం వికృతంగా మారింది. కళ్ళలో ఎర్రజీరలొచ్చాయి. వాటిలోంచి నిప్పురవ్వలు కురుస్తున్నాయి. మూలనున్న బాణాకర్ర చేతిలోకి తీసుకున్నాడు. కోపంతో గట్టిగా అరవసాగాడు.

"నిన్ను.. నిన్ను ఖూనీ చేసేస్తాను. బతికుండగానే నిప్పంటించేస్తాను. నన్నెదిరించిన వాళ్ళని నేనేం చేస్తానో, చేయగలనో నీకింకా తెలియదు" అంటూ మంచం పట్టెమీద నాలుగైదు సార్లు కర్రతో బాదాడు. పెద్దగా శబ్దం అయింది. ముసలాయనకి ఆయాసం వచ్చింది. ఈ మధ్యనే అతని ఆరోగ్యం బాగా దెబ్బతిని ఉంది. అతను మంచం మీద కూర్చున్నాడు. నెమ్మదిగా, శాంతాబాయిని చంపేందుకు ప్లాను వెదకసాగాడు. ఎన్నో ఉపాయాలు అతని మనసులోకి వచ్చాయి. ఇంకా వివరంగా ఆలోచించసాగాడు.

ఇవాళ రాత్రి ఆమె ఇంటికి రాగానే నేను కర్రకాలు పెట్టుకుని తయారుగా కూర్చుని ఉంటాను. తాగడానికి మంచినీళ్ళిస్తాను. ఫాను వేస్తాను. ఆమె కొంత ఆశ్చర్యపోతుంది. ఒకింత శంకిస్తుంది కూడా. కానీ నేను ప్రశాంతంగా ఉండి, ఆమె అనుమానించకుండా ప్రవర్తిస్తాను. ఆమెనూ, ఆమె అమ్మా నాన్నలనూ పొగుడుతాను. ఆమె నన్ను నమ్మడం మొదలుపెడుతుంది. నేను ఒక్కొక్క మెట్టూ దిగుతాను. అవసరం అయితే జాలిగా మొహం పెడతాను. కాసిన్ని కన్నీళ్ళు కూడా కారుస్తాను. ఆమె నన్నెంత ప్రేమగా చూసుకుంటోందో అన్నీ గద్గద స్వరంతో వినిపిస్తాను. ఇంత చూసిన తర్వాత ఆమెకి నా మీద ఎంత ప్రేమ లేకపోయినా, కాస్తంత సహానుభూతి అయినా

కలుగుతుంది కదా! ఆ ఆనందంతో ఆమె నిశ్చింతంగా నిద్రపోతుంది. కానీ నేను ఊరుకుంటానా! మరో ప్రక్కన ఆమె పనిపట్టడానికి నా ప్రయత్నాలు చేస్తూనే ఉంటాను. మొదటి ఝాములోనే ఆమె గాఢనిద్రలోకి వెళ్ళిపోతుంది. బాగా గుర్రుపెడుతుంది కూడా. అంతే! అదే అదనుగా తీసుకుని, నేను నా ఈ క్రకాలు ఊడబీకి, ఆమె నడినెత్తిమీద బలంగా ఒక్క దెబ్బ వేస్తాను. అంతే! ఆమె తల రెండు చెక్కలైపోతుంది. కానీ, కానీ.. ఆ దెబ్బ అనుకున్నంత గట్టిగా తగలకపోతే? ఆ క్రకాలు చూసి అతని శరీరం కంపించసాగింది. వెన్నెముకలోంచీ వణుకు పుట్టుకొచ్చింది. ఈ క్రకాలితోనే శాంత తనెన్నిసార్లో కొట్టింది. ఈ ముసలితనంలో ఇక ఆ దెబ్బలు భరించలేడు తను. మొదట్లో ఆమె అంత విచ్చలవిడిగా ప్రవర్తిస్తూంటే, బలవంతంగా ఆమె చెయ్యిపట్టి ఆపే ప్రయత్నం చేశాడతను. కానీ శాంత అతన్నొక తోపు తోసింది. అతని కంటే ఆమె వయసులో పదిహేను సంవత్సరాలు చిన్నది. ఆమె శరీరం కూడా బలంగా ఉండేది. ఆ దెబ్బతో నేలమీదపడిన అతన్ని, ఆ కుర్రకాలుతోనే కొట్టడానికి మీదికి వచ్చేది. తప్పించుకోవడం కోసం అతను మూడుకాళ్ళ వింత జంతువులా దేక్కుంటూ పారిపోయేవాడు. గదిలో ఒక మూలనుంచీ మరొక మూలకి, అక్కడి నుంచి మరో మూలకీ అప్పుడు భయంతో అతని సగం విరిగిన కాలు, తెగిపడిన బల్లితోకలా గిలగిలా కొట్టుకునేది. ఆ దెబ్బలకి అతని శరీరం మీద నొప్పులు చాలా రోజులు కాపురం ఉండేవి. ఆమె అంటే భయం ఇప్పుడు కూడా ఎక్కడ పోయిందని? క్రమంగా అది దినచర్యలాగానే మారిపోయింది.

ఇవన్నీ మనోఫలకం మీదికి వస్తూనే ముసలాయన కోపం అంతా చల్లారిపోయింది. అలిసిపోయి, మంచం మీద అడ్డంగా పడి, గోడవైపు తిరిగి పడుకున్నాడు. అతని మస్తిష్కంలో నెమ్మదిగా ఉదాసీనత చోటు చేసుకోసాగింది. ఆయన తన గురించి ఆలోచించసాగాడు.

అయినా నేనెప్పుడూ ఇంతే. మానసికంగా చాలా బలహీనుడిని, భగవంతుడు నాపై దయచూపలేదు. పరిస్థితుల్ని ఎదిరించి నిలబడగల ధైర్యం నాకులేదు. ఎండుటాకులమీద ఎండిన పురుగులా మిగిలిపోయాను. అసలీ ప్రాణుల సృష్టే అంత. అదే వాటి నైజం అనిపిస్తుంది. వాటికి ఏదోవిధంగా బ్రతికి ఉండడమే జీవన పరమార్థం కాబోలు. నేను నా భార్యని సంతోష పెట్టాలి. అది నా ధర్మం. చిన్నవి, చితకవీ ఆమె పనులు చేసిపెట్టి, ఆమె దయకు పాత్రుడివి కావాలి. ఆమె ఎంత దుర్మార్గంగా ప్రవర్తించినా భరించాలి. ఇవన్నీ సద్గుణాలు కావా మరి? బ్రతికి బావుండాలంటే జీవుడేం చేయాలో, ఆ రహస్యం ఇందులో వ్యక్తం అవుతోంది కదా! అందుకే నోరు పారేసుకోవడం తగదు. సాగినంతవరకూ మూగవాడిగా బతకడమే మేలు.

ముసలాయన నీరుగారిపోయాడు. ఒక్కసారిగా ఢీలా పడిపోయాడు. తరవాత, ఎవరికో నచ్చచెప్పుతున్నట్టుగా తనలో తానే ఇలా అనుకోసాగాడు. 'నేనొక చెట్టుమీది కాయనై పుట్టి ఉంటేణ ఆకుల మధ్య అణిగీ మణిగీ ఉండేవాడిని. అలాగే పరువుకొచ్చి, పండిపోయి క్రిందపడిన ఎండుటాకుల మీద పడేవాడిని. అది నాకెంతో ఇష్టం. జీవితం అంతా ప్రశాంతం. ఏదో ఒకనాడు ఠప్పున నేలరాలడం. మతే!'

ఆయనకి దాహం వేసింది. మంచినీళ్ళు తాగడానికి లేచాడు. క్రకాలు పెట్టుకోకుండానే మంచం మీదనుంచి దిగాడు. రెండు చేతులూ నేలమీద మోపాడు. అలా మూడు కాళ్ళతోనే దేక్కుంటూ, నీళ్ళకుండ వైపు వెళ్ళాడు. నీళ్ళు తాగాక కొంత స్వస్థత లభించింది. నెమ్మదిగా వెళ్ళి, తలగడ క్రింద దాచిపెట్టిన ఫైలు చేతిలోకి తీసుకున్నాడు. దానిలో అప్పుడప్పుడూ వార్తాపత్రికల్లో వచ్చిన ఖూనీ కేసుల వివరాలు ఫైలు చెసి ఉన్నాయి. వాటినతడు చదవసాగాడు. అతనికి తనమీద తనకే కోపం రాసాగింది. ఈ మనుషులింతే. చచ్చినవాళ్ళకోసం నెత్తీ నోరూ బాదుకుని ఏడుస్తారు. బ్రతికి ఉన్నప్పుడు నరకయాతనలు పెడతారు. అప్పుడు కానీ, ఈ స్త్రీ అవతారం పూర్తికాదు.

ఆలోచించిన కొద్దీ అతని రక్తం ఉడికిపోసాగింది. అతని గోళ్ళతో తలగోక్కున్నాడు. నెత్తిమీద ఒకటిచ్చుకున్నాడు. తననే ఉద్దేశించి ఇలా అనుకోసాగాడు.

'నువ్వెందుకూ పనికిమాలినవాడివిరా! నీలో అసలేమీ ధైర్యం లేదు. నువ్వేపనీ తెగించి చేయలేవీ జీవితంలో. నీ బతుకు నిరర్థకం.' తిరస్కార భావంతో అతని కళ్ళు మూతలు పడ్డాయి. తన హృదయాన్నుద్దేశించి మళ్ళీ ఇలా అనసాగాడు. 'దుష్టుడా! నిన్నిప్పుడే నలిపి పారేస్తాను. అలాగ్గాని నువ్వు బాగుపడవు. నీకెలాగైనా బుద్ధి చెప్పుతానుండు.'

అతను మంచం మీంచి లేచి కూర్చున్నాడు. అతని కళ్ళు క్రూరతతో ఎర్రబడ్డాయి. కసిగా ఈ దవడా, ఆ దవడా వాయించుకున్నాడు. 'తిను. నీకీ దెబ్బలే గతి. నీఅంతట నువ్వేపనీ చేయలేవు. ఇంకా నిన్ను బ్రతిమిలాడుకోవడంలో అర్థంలేదు.' అతను నెత్తిమీద జుత్తు పీక్కోసాగాడు. ఒకచేత్తో జుత్తుపట్టుకుని, రెండో చేత్తో గొంతు నొక్కిపెట్టి, 'చెప్పరా చెప్పు పెళ్ళాం చేతిలో కీలుబొమ్మా! నీకేం శిక్ష విధించాలో నువ్వే చెప్పు. బద్మాష్! మాట్లాడవేం? అంటూ లేచి నిలబడ్డాడు. గాలిలో వ్రేళ్ళాడుతున్న ఆ కుంటి తొడమీద నాలుగు గుద్దులు గుద్దాడు. నెమ్మదిగా వెళ్ళి మూలనున్న కర్రకాలు చేతిలోకి తీసుకున్నాడు. ఒక పెద్ద ఉపన్యాసం ఇస్తున్నవాడిలాగ గట్టిగా అరవసాగాడు. 'దీనితోనే కదా! నువ్వు నీ పెళ్ళాన్ని చంపుదామనుకున్నావు. దాని చర్మం ఒలిచేద్దామనుకున్నావు. అవును. వాడెవడో వస్తే, వాడిని కూడా బెదిరించావు కదా. నరాధముడా! పరాయి స్త్రీ మీద కన్నేస్తావురా? చంపేస్తాను నిన్ను కుక్కా! దానివేపు కళ్ళెత్తి చూశావో నీ కళ్ళు పీకేస్తాను. వేలెత్తి చూపుతే వేళ్ళు నరికేస్తాను. వెధవా అని.'

ముసలాయనకి ఒక్కసారిగా అరవడంతో ఆయాసం వచ్చింది. ఆవేశంతో, తనని తాను సంబాళించుకోలేకపోతున్నాడు. కొంచెం ఊపిరి పీల్చుకుని మళ్ళీ 'నరాధముడా పనికిమాలినవాడా అరవసాగాడు. కాలిమీదా, వీపు మీదా నడుము మీదా కర్రతో బాదుకోసాగాడు. 'చూసుకో నిన్ను ఓనాడు నా చేతుల్తోనే చంపేస్తాను. ఏమనుకుంటున్నావో అరిచీ, అరిచీ ఆయాసం వచ్చి, నిలువునా కుప్పకూలిపోయాడు. మంచం మీద పడి నిద్రలోకి జారుకున్నాడు.

ఉన్నట్టుండి అతనికి, ఒక వైద్యుడు, శస్త్ర చికిత్స కోస్మ, శవం శరీరాన్ని కోసినట్టుగా తానేతన శరీరాన్ని మధ్యకి రెండు భాగాలుగా చీల్చినట్టనిపించిద్మి. రెండువైపులా చర్మం ఒలిచి, లోపలికి తొంగి చూశాడతను. ఆ దృశ్యాన్ని చూసి కంపించసాగాడు. తన కోరికల నగ్నస్వరుపాన్ని కళ్ళారా చూసి నివ్వెరపోయాడు. రక్తమాంసాలతో తీగల్లాసాగే రక్తనాళాలతో, బహుముఖాల విస్తరించి ఉన్న పురుగులాంటి స్వరూపాన్ని చూసి, 'దీనినా నేను చంపాలనుకున్నది?' అని ఆలోచించసాగాడు. ఆ దృశ్యాన్ని కళ్ళెదుటినుంచి చెరిపేయాలని ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాలేదు. 'నేనిప్పటికే చాలా దూరం వచ్చేశాను. నా ఉద్దేశం ఇంతదూరం రావాలనికాదు' అనుకున్నాడు. భయంతో అతను వెనుతిరిగి పోవాలనుకున్నాడు. కానీ, పోలేకపోతున్నాడు. అతనికి శ్వాస ఆగిపోయినట్టనిపించింది. చచ్చిపోయానేమోననుకున్నాడు. ఆ భయంతో వెర్రి చూపులు చూస్తున్న అతని దృష్టి ఎదురుగా ఉన్న గోడమీద పడింది.

అక్కడ, శ్రీనాథ్‌జీ (రాజస్థాన్ లోని శ్రీకృష్ణ ధామం) పటం కనిపించింది. దైన్యం నిండిన కళ్ళతో ఆయన భగవంతుడిని వేడుకున్నాడు. 'హే భగవాన్ ఆపద్భాంధవా! అనాథ రక్షకా నన్ను రక్షించు. నాకు శక్తినియ్యి.' అతనామూర్తిని అలాగే చూస్తూ నిలబడ్డాడు. మంత్రించినట్టుగా అలాగే చాలాసేపు ఉండిపోయాడు. క్రమేపీ ఆయన షుషిప్తి నుంచి జాగ్రదావస్థకి చేరువ కాసాగాడు. శ్రీనాథ్‌జీ ధనుష్టంకారం చేసినట్టుగా అతనిలో కోట్లాది నాడులు మేల్కొన్నాయి. కుండలినీ శక్తి లేచినట్టనిపించిందతనికి. అతనిలో ఆలోచన వచ్చింది. 'నాలో శక్తి ఉంది. పురుషత్వం ఉంది' అని. అతని శరీరంలో రక్తం ప్రచండవేగంతో ప్రవహించసాగింది. ఇప్పుడు నేను ఒంటరివాడివి కాను. శ్రీనాథ్‌జీ నాకు తోడు ఉన్నాడు. అనిపించిందతనికి. లేచి పరుగెత్తాలనిపించింది. పళ్ళు బిగించాడు. కాళ్ళు గంతులేయసాగాయి.

ఇంచుమించుగా అతను పరుగెత్తుతున్నట్టే ఉంది. తన భగవంతుడి దగ్గరకి.

'ప్రభూ! నేను దుష్టుడిని. నేను ప్రతీకార వాంఛతో కాలిపోతున్నాను. మానసికంగా నేనొక హంతకుడిని. దానికి నువ్వే శిక్ష విధిస్తావో విధించు. కానీ నేను మాత్రం పగ తీర్చుకోకమానను. శాంత శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికి దాని రక్తం తాగుతాను.'

అతను గదిలో ఒక మూలకి పోయి, గోడకి వీపు ఆనుకుని కూర్చున్నాడు. నిర్నిమేషంగా అతనలా ఎంతసేపున్నాడో చెప్పడం కష్టం. బైట తలుపు గొళ్ళెం తీసిన చప్పుడుకి అతని కళ్ళు కదిలాయి. సర్దుకుని కూర్చున్నాడు. సాయంత్రం అయిపోయింది. శాంత లోపలికి వచ్చి, లైటు వేసింది. వెల్తురు రావడంతోటే అతను పగటి కలలలోంచి, బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు. ఆ కలల మత్తు అతనినింకా వదలలేదు. ఆ కారణంగా ఎక్కిళ్ళు వచ్చి, అతని శరీరం కొద్దిగా వణకనారంభించింది.

వస్తూనే శాంత ఆయన్ని గద్దించింది. ''ఏం? చీకట్లో ఏడుస్తున్నావు? పైగా, ఇంకా పొయ్యి మీద ఎసరు కూడా పెట్టలేదు. ఆకలితో కడుపు మాడ్చుకోవాలనుందా? ఇప్పుడు నాకేం వంట చేసే ఉద్దేశం లేదు. నేనైతే మస్తుగా బైట తిని వచ్చాను.'' ముసలాయన దృష్టి ఆమె భారీ కాయం మీదపడింది. దానితో, కాస్త ఏమైనా మత్తు మిగిలి ఉంటే అది కూడా పూర్తిగా దిగిపోయింది. ప్రతీకార వాంఛతో అతను క్షణకాలం కళ్ళు మూసుకుంటున్నాడు. మళ్ళీ తెరిచి చూస్తున్నాడు. కొంత సమయం గడిచాక, శాంత బాత్రూములోకి వెళ్ళి తలుపేసుకుంది. ముసలాయన ఆ మూసిన తలుపు వైపు దృష్టి సారించాడు.

ఉన్నట్టుండి ఆయనకొక ఆలోచన తట్టింది. వెంటనే నవ్వుకూడా వచ్చింది. కానీ బైటికి వినిపించేలా నవ్వలేదు. పెదవులు అదిమిపట్టి లోలోపలే, నవ్వుకున్నాడు. అలా నవ్వడం ఆయనకో చిత్రమైన స్ఫూర్తినిచ్చింది. నెమ్మదిగా మంచం మీద నుంచి క్రిందకి దిగి, చప్పుడవుతుందని, కర్రకాలు పెట్టుకోకుండా, మూడుకాళ్ళతోనే దేక్కుంటూ బాత్రూము వైపు వెళ్ళాడు. తెరలు, తెరలుగా వస్తున్న నవ్వుని ఆపుచేసుకోవడానికి అతనికి పెద్ద ప్రయత్నమే చేయవలసి వచ్చింది. తలుపు దగ్గరగా వెళ్ళి, ఒక చేయి పైకెత్తి, బైటనుంచి గొళ్ళెం పెట్టాడు. లోహపు గొళ్ళెం. చిన్నగా శబ్దం చేసింది. అది విని, శాంత లోపల ఆశ్చర్యపడింది. కానీ, వెంటనే కర్కశ స్వరంతో ''నాకు తెలుసులే! నువ్వు బైటినుంచి గొళ్ళెం పెట్టావు. మూర్ఖుడా! నన్ను బైటికి రానీ, నీ పని చెపుతాను. నీకు అన్నం పెట్టకుండా ఆకలితో మాడ్చి చంపకపోతే నన్ను పేరు పెట్టి పిలవొద్దు. ముసలాడివని జాలి కూడా చూపకుండా, చితకబాదుతాను. ఏమనుకుంటున్నావో!'' అంది.

తాను చేసిన ఘనకార్యానికి ముసలాయన సంతోషం పట్టలేకపోతున్నాడు. అంతవరకూ అదిమిపెట్టిన నవ్వు ఒక్కసారిగా పైకి ఉబికి వచ్చింది. హి..హి..హి..హీ.. అని ఒకటే నవ్వు. నవ్వుతూ, నవ్వుతూ అతను, బాగా అయింది. బాగా అయింది అని చంకలు గుద్దుకోసాగాడు. చప్పట్లు కొట్టసాగాడు. బాత్రూములోంచి, శాంత మళ్ళీ కోపంగా అరిచింది. ''పైగా కిక్కిక్కి అంటూ వెధవ నవ్వొ నువ్వొను. బయటికి రానీ, నీ గొంతునులిమి, ఎముకలు విరిచేస్తాను. నా సంగతి నీకింకా తెలియదు.'' అంటూ ఇంకా చెప్పలేనంత తిట్ల వర్షం కురిపించింది.

నవ్వీ, నవ్వీ అలిసిపోయిన అతను శ్వాస తీసుకోవటానికి ఆగాడు. అతని దృష్టి బాత్రూము తలుపు మీద పడింది. అక్కడినుంచి ఖూనీ కేసుల ఫైలు మీదికి, శ్రీనాథ్ జీ పటం మీదకీ, చివరిగా కర్రకాలు మీదకీ వెళ్ళి అక్కడ స్థిరపడింది. అంతే! ఆ నవ్వు హఠాత్తుగా ఆగిపోయింది. ఏదో తెలియని భయంతో, అతను కంపించసాగాడు. అలా వణుకుతూనే ఆయన బాత్రూము వైపు వెళ్ళసాగాడు.